బిజెపి అభ్యర్థులపైనే అత్యధిక క్రిమినల్ కేసులు

- 41 శాతం స్థానాల్లో ముగ్గురు కంటే ఎక్కువ అభ్యర్థులపై కేసులు
- ఎడిఆర్ నివేదిక

9

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 245 | విజయవాడ, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 9 April 2024 | Rs

కరువు నిధులడిగితే కదలరేం?

ప్రతిదానికీ పేచీ పడే పరిస్థితి రానివ్వొద్దు

- కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన సుప్రీం
- కర్ణాటక అభ్యర్థనపై స్పష్టమైన ప్రకటనతో రండి
- అటార్నీ, సొలిసిటర్ జనరల్స్‌ను ఆదేశించిన కోర్టు



న్యూఢిల్లీ : తీవ్ర కరువు, నీటి ఎద్దడితో అల్లాడుతున్న కర్ణాటక జాతీయ విపత్తు సహాయ నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) నిధుల కోసం అభ్యర్థిస్తే కేంద్రం స్పందించకపోవడంపై సుప్రీం కోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతిదానికి పేచీ పడే పరిస్థితి రానివ్వొద్దని కోర్టు కేంద్రాన్ని హెచ్చరించింది. కేంద్రానికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేస్తూ పలు రాష్ట్రాలు తమ వద్దకు రావాల్సి వస్తోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కరువు నిధుల విడుదల కోసం ఎన్నిసార్లు కేంద్రాన్ని అభ్యర్థించినా ఫలితం లేకపోవడంతో కర్ణాటక ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిని విచారణకు స్వీకరించిన జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కరువు ఉపశమనానికి సంబంధించి కేంద్రం వైఖరిని తెలియజేస్తూ స్పష్టమైన ప్రకటనతో తదుపరి విచారణ తేది నాటికల్లా తమ ముందుకు రావాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణ, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతానుద్దేశించి ధర్మాసనం ఆదేశించింది. కరువు నిధుల కోసం కర్ణాటక చేసిన అభ్యర్థనపై తగాదాపడే దాకా పరిస్థితి రానివ్వొద్దని కేంద్రానికి సూచించింది. ఇటీవల కాలంలో రాష్ట్రాలకు మరీ ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు న్యాయంగా ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకుండా కేంద్రం ఇబ్బందులు పెడుతుండడంతో వేరే గత్యంతరం లేక రాష్ట్రాలు సుప్రీం కోర్టునాశ్రయిస్తున్నాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక ఆర్థిక నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై కోర్టునాశ్రయించాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకున్న సుప్రీం ధర్మాసనం ఇలా వ్యాఖ్యానించింది. "కేంద్రం, రాష్ట్రం మధ్య వివాదం వుండరాదు. వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు రావడాన్ని మేం చూస్తున్నాం." అని పేర్కొంది.

కనివినీ ఎరుగని రీతిలో సంభవించిన వరదలు, తుపాను వంటి రెండు ప్రకృతి విపత్తులను ఎదుర్కొనడానికి అవసరమైన దాదాపు రూ.38వేల కోట్ల నిధుల జారీ విషయంలో కేంద్రం, తమ పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఇటీవలనే తమిళనాడు ప్రభుత్వం కేంద్రంపై ఫిర్యాదు చేసింది. అలాగే కేరళ కూడా తమ రుణ పరిమితుల వ్యవహారంలో ఏకపక్షంగా జోక్యం చేసుకుంటోందంటూ కేంద్రంపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కేరళను ఆర్థిక ఎమర్జన్సీలోకి నెట్టివేస్తోందంటూ విమర్శించింది.

తీవ్ర కరువుకాటకాలను ఎదుర్కొంటున్న తమకు జాతీయ ప్రకృతి వైపరీత్యాల నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) నుండి రూ.18,171.44 కోట్లు మంజూరు చేయాలంటూ ఆరు మాసాల క్రితం కేంద్రాన్ని కోరామని, కానీ కేంద్రం నుండి ఎలాంటి స్పందన లేదని కర్ణాటక తన పిటిషన్‌లో పేర్కొంది. రాష్ట్రంలో పంటల నష్టం రూ.35,162.05కోట్లుగా అంచనా వేసినట్లు తెలిపింది. కర్ణాటక తరపు వాదనలు వినిపిస్తున్న డి.ఎల్.చందన మాట్లాడుతూ, 2023 ఖరీఫ్ సీజనులో 236 తాలుకాలకు గానూ 223 తాలుకాలు కరువు ప్రాంతాలుగా ప్రకటించినట్లు తెలిపారు. గత జూన్‌లో మైనస్ 56శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. గత 122 సంవత్సరాల్లో రాష్ట్రానికి సంబంధించి ఇది మూడవ అత్యంత తక్కువ వర్షపాతమని చెప్పారు. వివిధ పద్దుల కింద మూడు కరువు సాయం మెమోరాండాలు అందచేసామని చెప్పారు. కానీ కేంద్రం నుండి స్పందన లేదన్నారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం చేయకుండా కేంద్రం నిరాకరించడమన్నది రాజ్యాంగంలో 14, 21 అధికరణల కింద కర్ణాటక ప్రజలకు కల్పించబడిన ప్రాధమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుఉందని కర్ణాటక తన పిటిషన్‌లో పేర్కొంది. ఇరు పక్షాల వాదోపవాదాలు విన్న అనంతరం రెండు వారాల్లోగా సమాధానం చెప్పాల్సిందిగా కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.



చిగురుపాటి బాబూరావు (విజయవాడ సెంట్రల్) | మూలం రమేష్ (నెల్లూరు సిటీ) | డి గౌస్‌దేశాయి (కర్నూలు) | మరడాన జగ్గునాయుడు (గాజువాక) | కళ్లం వెంకటేశ్వరరావు (గన్నవరం) | లోతా రామారావు (రంపచోడవరం) | జొన్నా శివశంకరరావు (మంగళగిరి) | దీసరి గంగరాజు (అరకు) | మండంగి రమణ (కురుపాం) | ఉబ్బా ఆదిలక్ష్మి (సంతనూతలపాడు)

సిపిఎం అభ్యర్థుల ప్రకటన

- అరకు లోక్‌సభ, 5 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్‌తో అవగాహన
- మరో ఐదు అసెంబ్లీ స్థానాలపై కొనసాగుతున్న చర్చలు
- అన్ని స్థానాల్లోనూ పరస్పరం బలపర్చుకోనున్న సిపిఎం, సిపిఐ



పాచిపెంట అప్పలనర్స (అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి)

స్థానం	అభ్యర్థి
అరకు (పార్లమెంటు)	పాచిపెంట అప్పలనర్స
అసెంబ్లీ స్థానాలు	
రంపచోడవరం(ఎస్‌టి)	లోతా రామారావు,
అరకు(ఎస్‌టి)	దీసరి గంగరాజు
కురుపాం (ఎస్‌టి)	మండంగి రమణ
గాజువాక	మరడాన జగ్గునాయుడు
విజయవాడ సెంట్రల్	చిగురుపాటి బాబూరావు
గన్నవరం	కళ్ళం వెంకటేశ్వరరావు
మంగళగిరి	జొన్నా శివశంకర్
నెల్లూరు సిటీ	మూలం రమేష్
కర్నూలు	డి గౌస్‌దేశాయి
సంతనూతలపాడు(ఎస్‌సి)	ఉబ్బా ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో అరకు లోక్‌సభతో పాటు 10 శాసనసభ నియోజకవర్గాలకు సిపిఎం తన అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్ర కమిటీ ఆమోదించిన అభ్యర్థులను ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. కాంగ్రెస్‌తో పలు దఫాలుగా జరిగిన చర్చల తరువాత అరకు పార్లమెంటుతోపాటు రంపచోడవరం, కురుపాం, గన్నవరం, మంగళగిరి, నెల్లూరు సిటీ శాసనసభ నియోజకవర్గ స్థానాలపై ఉమ్మడి అవగాహన కుదిరిందని తెలిపారు. మిగిలిన ఐదు స్థానాలపై చర్చలు కొనసాగించి నామినేషన్‌లోపు ఒక అవగాహనకు రావాలని ఉభయ పార్టీలు అభిప్రాయపడ్డాయని వివరించారు. సిపిఎం, సిపిఐ పోటీ చేస్తున్న పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పరస్పరం బలపర్చుకోవాలని ఉమ్మడి అవగాహనకు వచ్చాయని తెలిపారు.

చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)

అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్పల మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కేసేపల్లి గ్రామానికి చెందిన నాగానంద (44)కు ఓ సొంత మగ్గం ఉంది. మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కుటుంబ పోషణ, మగ్గాల నిర్వహణకు దాదాపు రూ.నాలుగు లక్షల వరకు అప్పులు చేశారు. ఇటీవల ముడిసరుకు ధరలు పెరగడం, నేసిన చీరలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులకు వడ్డీల భారం అధికమైంది. అప్పులు తీరేదారిలేక ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాఠశాలల్లో 'వాటర్ బెల్'ను పర్యవేక్షించాలి

- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ బెల్ నిర్వహణను ప్రతిరోజూ పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. మూత్రం రంగును బట్టి శరీరంలోని నీటిలోపాన్ని గుర్తించి నీరుతాగే అలవాటును విద్యార్థులు గుర్తించేలా, అవగాహన పెంచుకునేలా పోస్టరును జతపరిచామని తెలిపారు. వీటిని పోస్టుకార్డు సైజులో ముద్రించి ప్రతి మూత్రశాల ముందు అతికించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఎండ వేడిమికి విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పును నివారించేందుకు రోజుకు మూడు సార్లు వాటర్ బెల్ మోగించాలని విద్యాశాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. వేసవి సెలవుల తరువాత పాఠశాలలు తిరిగి ప్రారంభమైన తరువాత కూడా వాటర్ బెల్ విధానాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వైసిపికి మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి రాజీనామా

ప్రజాశక్తి-పుట్లూరు (అనంతపురం)



అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి వైసిపికి రాజీనామా చేశారు. ఆమె కుమారుడు అశోక్‌తో కలిసి వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఆమె ప్రకటించారు. గత నాలుగు రోజుల క్రితం శమంతకమణి కుమార్తె, మాజీ ఎమ్మెల్యే యామినిబాల వైసిపికి రాజీనామా చేశారు. శమంతకమణి కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1989 నుంచి 1991 వరకు మంత్రిగా సేవలందించారు. ఆ తరువాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టిడిపిలో చేరారు. 2014లో యామినీబాల టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2019లో వీరి కుటుంబానికి టిడిపి టికెట్ ఇవ్వలేదు. దీంతో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత శమంతకమణి కుటుంబంతో కలిసి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలోఆ పార్టీలో చేరారు. 2024లో వైసిపి టికెట్ ఆశించినా వీరికి దక్కపోవడంతో శమంతకమణి కుటుంబ సభ్యులందరూ ఆ పార్టీకి రాజీనామా చేశారు.

దాడిపై దళితుల నిరసన

- కోడ్ నేపథ్యంలో ధర్నా విరమించాలని కోరిన సిఐ
- నిందితుల్లో పదిమందిని అదుపులోకి తీసుకున్నామని ప్రకటన



ఆందోళన కారులతో మాట్లాడుతున్న కడియం సిఐ తులసీధర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ కడియం మండలం కడియపు సావరంలో దళిత యువకులపై జరిగిన దాడిని నిరసిస్తూ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళితులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కడియం పోలీస్‌స్టేషన్ ఎదుట దళిత సంఘాలు, రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాకు యత్నించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ధర్నాను విరమించాలని పోలీసులు వారిని కోరారు. దీంతో సిఐతో చర్చలు సాగించారు. ఈ సందర్భంగా కడియం సిఐ తులసీధర్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిలో పదిమందిని అదుపులోకి తీసుకున్నామని, ఇంకా దాడిలో ప్రమేయం ఉన్న వారి పాత్రపై విచారణ జరుగుతుందన్నారు. వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు. గ్రామంలోని సిసి పూటేజీని విశ్లేషిస్తున్నామని తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో అన్ని సామాజిక తరగతుల ప్రజలూ సహకరించాలని కోరారు. ప్రస్తుతం దాడి ఘటనపై డిఎస్‌పి అంబికా ప్రసాద్ విచారణ చేస్తున్నారని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో దళితులు ఆందోళనను విరమించారు. సిఐతో జరిగిన చర్చల్లో బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, బిఎస్‌పి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొండపల్లి సూరిబాబు, బిఎస్‌పి రూరల్ అధ్యక్షుడు జుత్తుగ రాజేష్, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నం రాజు, రాష్ట్ర నాయకులు కోనాల లాజర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు శీలం నరసింహ, రేగుళ్ల కార్తీక్, రేగుళ్ల సురేష్‌లకు వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్న శీలం రాజేష్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దాడికి సంబంధించిన వివరాలను డిఎస్‌పి ప్రసాద్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని, తరువాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులను కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు తదితరులు పరామర్శించారు.

దళితులపై దాడులు అమానుషం : సిపిఎం

దళిత యువకులపై పెత్తందార్ల యువకుల దాడి అమానుషమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ అన్నారు. దాడికిపాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధితులకు మెరుగైన సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్కడికి వెళ్లాల్సిన అవసరమేంటి?

- అధికారుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో సిఎం రమేష్‌ను విచారించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - చోడవరం (అనకాపల్లి)



సిఎం రమేష్‌ను విచారిస్తున్న డిఎస్‌పి అప్పలరాజు

అధికారుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో అనకాపల్లి బిజెపి ఎంపి అభ్యర్థి సిఎం రమేష్ అనకాపల్లి జిల్లా చోడవరం పోలీస్ స్టేషన్‌కు సోమవారం హాజరయ్యారు. ఆయనను డిఎస్‌పి అప్పలరాజు విచారించారు. ఆ రోజు అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఏమిటి? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాను ఎటువంటి గలాటా సృష్టించలేదని, అధికారులతో శాంతియుతంగానే మాట్లాడానని సిఎం రమేష్ చొప్పుకొచ్చారు. అనంతరం 41ఎ నోటీసులు అందుకున్న రమేష్‌తో పాటు మిగిలిన వారికీ డిఎస్‌పి సమక్షంలో స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. ఈ నెల నాలుగున చోడవరం మండలం గాంధీ గ్రామంలో ఉన్న బుచ్చిబాబు ట్రేడర్స్ టైల్స్ దుకాణంపై డిఆర్ఐ అధికారులు దాడులు నిర్వహించారు. జిఎస్‌టి లెక్కలపై ఆరా తీశారు. ఈ విషయాన్ని దుకాణం యజమాని స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజుకు, బిజెపి ఎంపి అభ్యర్థి సిఎం.రమేష్‌కు తెలపగా వారు అక్కడకు వచ్చి నానా హడావుడి చేశారు. ఆ సమయంలో తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, తాము సేకరించిన ఫైల్స్‌ను లాక్కున్నారని చోడవరం పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో సిఎం రమేష్, కెఎస్ఎన్ఎస్.రాజులతో పాటు ఆరుగురిపై కేసు నమోదైంది. అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సిఎం.రమేష్‌కు శనివారం రాత్రి 41ఎ నోటీసులు అందజేశారు. తొమ్మిదో తేదీలోపు విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. దీంతో సిఎం రమేష్, చోడవరం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు, బుచ్చిబాబు ట్రేడర్స్ యజమానులు రామకృష్ణ, బుచ్చిబాబు విచారణ హాజరయ్యారు.



మిల్లు గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

కొత్తూరు జ్యూట్‌మిల్లు వెంటనే తెరిపించాలి

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మూసివేసిన కొత్తూరు జూట్‌మిల్లును వెంటనే తెరిపించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మిల్లు గేటు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి టిఎన్‌టియుసి అధ్యక్షులు కోలా ఉమాశంకర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిఐటియు ఏలూరు నగర కార్యదర్శి వీరంకి సాయి మాట్లాడారు. 25 సంవత్సరాల చరిత్ర గల కొత్తూరు జ్యూట్‌మిల్లును చట్టవిరుద్ధంగా మూసివేయడాన్ని ఖండించారు. ఆదివారం యాజమాన్యం మిల్లు వద్ద నోటీసు బోర్డు పెట్టిందని, ఆర్థిక వనరులు సమకూరకపోవడం వల్ల జ్యూట్‌మిల్లును నడపలేకపోతున్నామని నోటీసులో పేర్కొన్నారని, అది చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రభుత్వ అధికారులకుగానీ, కార్మిక సంఘాలకుగానీ ముందుగా తెలియజేయకుండా నోటీసు బోర్డులో పెట్టి మిల్లు నడపలేకపోతున్నామనడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణం మిల్లు తెరిపించే చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సుమారు మూడువేల మంది కార్మికులు పని చేస్తున్న జ్యూట్‌మిల్లును తెరిపించేలా తగు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చట్ట విరుద్ధంగా మిల్లును మూసివేసిన మేనేజ్‌మెంట్‌పై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి రాధాకృష్ణ (చంటి) హాజరై మద్దతు తెలిపారు. మిల్లును మూసి వేయడం చాలా బాధాకరమన్నారు. కార్మికులకు ఏ అవసరం వచ్చినా ముందుంటానని, సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ధర్నాలో సిఐటియు ఏలూరు నగరాధ్యక్షులు జగన్నాథం, ఐఎఫ్‌టియు ఏలూరు నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు, కార్మికులు నాగేశ్వరరావు, సూరిబాబు, శ్రీనివాసు, రమణ భూషణం, తదితరులు పాల్గొన్నారు.

'వివేకా' హత్య కేసులో శివశంకర్ రెడ్డికి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ-5గా ఉన్న శివశంకర్ రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌లో ఆయనకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జులై 22కు వాయిదా వేసింది. శివశంకర్ రెడ్డికి ఇటీవల తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. శివశంకర్ రెడ్డి, సిబిఐతోపాటు ప్రతివాదులందరికీ సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ట్రయల్ ఏ దశలో ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. చార్జెస్ ఫ్రేమ్ చేసే దశలోనే ఉన్నట్లు సునీత తరపున న్యాయవాది తెలిపారు. ప్రతి దశలోనూ నిందితులు కేసు ట్రయల్ ముందుకు సాగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ధర్మాసనానికి తెలిపారు. ఈ కేసులో ఇతర నిందితులు కూడా బెయిల్ పొందారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఎ-1గా ఉన్న వ్యక్తికి గతంలో బెయిల్ రాగా, సుప్రీంకోర్టు స్టే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇదే కేసుకు సంబంధించి గతంలో దాఖలైన పలు పిటిషన్లపై ఈ నెల మూడో వారంలో ఇదే ధర్మాసనం ముందు విచారణకు వస్తున్నట్లు న్యాయవాది చెప్పారు. ఎ-8 మాత్రం ముందస్తు బెయిల్‌పై ఉన్నారని, ముందస్తు బెయిల్‌ను ఇప్పటికే సవాల్ చేశామని సునీత తరపు న్యాయవాది తెలిపారు. అనంతరం శివశంకర్ రెడ్డితో పాటు సిబిఐకి కూడా నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు, బెయిల్ రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని సూచించింది.

యువకుడి హత్య?

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు..పట్టణంలోని దేవనగర్ కాలనీకి చెందిన సమీర్ (25) తన ఇంటి మేడపైన ఆదివారం రాత్రి నిద్రించారు. సమీర్‌ను నిద్ర లేపేందుకు సోమవారం ఉదయం మేడపైకి కుటుంబసభ్యులు వెళ్లారు. రక్తపుమడుగులో సమీర్ పడి ఉండటాన్ని కుటుంబసభ్యులు గమనించి వెంటనే మూడవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గొంతుకోసి హతమార్చినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వ్యక్తిగత కారణాలతో హత్య చేశారా? లేక వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

ఏదైతే
దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి జరుపవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	వెల్లటూరి సుధాకర్/ వెల్లటూరి సుబ్బలక్ష్మి/ LBTEN00005198416	గుంటూరు జిల్లా, తెనాలి పశ్చిమ ఉపజిల్లా, అంగలకుదురు గ్రామంలో అంగలకుదురు గ్రామ పంచాయతీ ఏరియా ప్లాట్ నం.1 ప్లాన్ ప్రకారం మరియు స్థలం ప్రక్కప్రక్కనే ఉన్న రెండు డో.నం.లలో డో.నం.322/3, 322/4, సైట్ హద్దులు : తూర్పు : ప్లాట్ నం.8 సైట్-30'-09", దక్షిణం : 18 అ.లు. వెడల్పు పంచాయతీ రోడ్డు-30'-06", పడమర : 18 అ.లు. వెడల్పు పంచాయతీ రోడ్డు-30'-09", ఉత్తరం : ఉన్ముడి లక్ష్మి ప్లాట్ నం.2 సైట్-31'-09" ఈ సరిహద్దుల విస్తీర్ణం 106.34 చ.గ.లు. లేదా 88.91 చ.మీ.లు. మరియు ఆ గ్రౌండ్ ఫ్లోర్, ఆర్ సి సి దాబా మరియు అన్నీ ఇతర సౌకర్యాలతో పాటు అన్నీ యాక్సిస్ హక్కులు. ఆస్తితో డో.నం.5-136. పంచాయతీ మూల్యాంకనం నం.824/లాంఛనప్రాయ స్వాధీనత : 04.04.2024	27.12.2023 Rs. 21,46,108.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 మరియు 9 క్రింద నిబంధనల ప్రకారం ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరిన తర్వాత తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 09 ఏప్రిల్, 2024, ప్రదేశం : గుంటూరు

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది) సిఐఎన్ : L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం: కెఅర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్‌టన్ రోడ్, చెట్‌పట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000 ఫ్యాక్స్: +91 44 4564 4022.

IDFC FIRST Bank

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

ఏదైతే, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది) నుంచి దిగువ తెలిపిన రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు దిగువ తెలియపరిచిన సెక్యూర్డ్ లోన్స్‌ను తీసుకొని ఉన్నారు. రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు వారు వారి యొక్క ఆస్తులను తనఖా పెట్టి లోన్‌ను తీసుకున్నారు. వారు వారి యొక్క లోన్ అగ్రిమెంట ప్రకారం ఉన్న నియమాలు మరియు నిభందనలు పాటించడంలో విఫలమైనారు మరియు వారి యొక్క లోన్‌ను ఆర్‌బిఐ గైడ్ లైన్స్ ప్రకారం ఎన్‌పిఏ లుగా వర్గీకరించబడినాయి. వారు సదరు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది) బ్యాంకు వారికి బకాయి ఉన్న మొత్తంను నోటీసులో జారీ చేయబడిన విధంగా దిగువ టేబుల్‌లో వివరింపబడ్డాయి మరియు బకాయిల మీద తదుపరి వడ్డీ కూడా ఉంటుంది మరియు అదే కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తెలిపిన తేదీలలో ఆమోదించబడతాయి.

క్ర. సం	లోను అకౌంట్ నెం	లోను రకం	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల పేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బకాయి మొత్తం	ఆస్తి చిరునామా
1	37618952	ఆస్తి పై రుణం	1. గడ్డం అయ్యప్ప, 2. గడ్డం ధనలక్ష్మి, 3. గడ్డం నాగరాజు, 4. గడ్డం పవన్ కుమార్, 5. గడ్డం సుబ్రమణ్యం	30.03.2024	INR 18,23,911.31/-	ఆంధ్రప్రదేశ్-521301, కృష్ణాజిల్లా, గుడివాడ, పెద్దఎరుకుపాడు, పార్క్ రోడ్డు యొక్క ఆర్.ఎస్.నం.21/1ఎ1ఎ లో డో.నం.18/130 ఎసిసి షీట్ షెడ్ తో ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 246.7 చ.గ.లు. (మెయిన్ డాక్.నం.2017/2020 తో ఆస్తి సంపూర్ణ యజమాని) మరియు హద్దులు : తూర్పు : ఇ షెడ్యూల్ సైట్-40 అ.లు., పడమర : మున్సిపల్ బజార్-40 అ.లు., ఉత్తరం : గడ్డం వాసు ఆస్తి-55.6 అ.లు., దక్షిణం : గడ్డం చిట్టయ్య ఆస్తి-55.6 అ.లు.
2	89236280	ఆస్తి పై రూరల్ లోన్	1. జరుగుమల్ల రాజు 2. జరుగుమల్ల సుజాత	28.03.2024	INR 10,61,142.07/-	ఆంధ్రప్రదేశ్-522005, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ అధికార పరిధిలో ఉన్న గుంటూరు జిల్లా, పోతూరు గ్రామం పచాయతీ యొక్క ఆర్.ఎస్.నం.273 వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 79 చ.గ.లు. లేదా 66.05 చ.మీ.లు. హద్దులు : తూర్పు : జరుగుమల్ల ఆనందరావు సైట్, పడమర : దుపాఇ శివ శంకరరావు సైట్, ఉత్తరం : 2 గ.ల. వెడల్పు రోడ్డు, దక్షిణం : కగ్గ కోటయ్య సైట్.
3	37301954 & 104171538	ఆస్తి పై రుణం	1. రాయపుడి లక్ష్మీనారాయణ, 2. రాయపుడి లక్ష్మీ తిరుపతమ్మ	28.02.2024	INR 18,65,562.70/-	ఆంధ్రప్రదేశ్-522503, గుంటూరు జిల్లా, తుల్లూరు మండలం, వెలగపుడి గ్రామం యొక్క సర్వే నం.39 లో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఆర్‌సిసి భవనం విస్తీర్ణం 108.9 చ.గ.లు. లేదా 91.05 చ.మీ.లు., తో బేరింగ్ డో.నం.1-43, మూల్యాంకనం నం.50, ఆర్‌సిసి 800 చ.అ.లు. మరియు హద్దులు : తూర్పు : ఉమ్మడి మార్గం, పడమర : పంచాయతీ బజారు, ఉత్తరం : రాయపుడి వెంకటేశ్వరరావు సైట్, దక్షిణం : పంచాయతీ బజారు.

మీకు తెలియజేయవలసినది ఏమనగా ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) కు బకాయిలను చెల్లిచవలసిందిగా మరియు టేబుల్ లో చూపించిన దాని ప్రకారం కాంట్రాక్టువల్ రేటు ప్రకారం దాని యొక్క తేదీలతో పాటుగా ఇతర ఖర్చులు, చార్జీలు మరియు ఇతరమైనవి ఈ నోటీసు ప్రచురించిన 60 రోజులలోగా చెల్లించవలెను., ఒక వేళ మీరు గనుక చెల్లించడంలో విఫలమైనచో దిగువ సంతకాదారుడు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 14 మరియు సెక్షన్ 13(4) ప్రకారం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) బ్యాంకు వారు వారి యొక్క ప్రక్రియ మొదలుపెడతారు. కనుక మీరు సెక్షన్ 13(13) ప్రకారం మీరు మీ యొక్క సెక్యూర్డ్ ఆస్తులను అమ్మడం/లీసు కు ఇవ్వడం గానీ లేదా ఇతర పనులు చేయడానికి మీకు అనుమతి లేదు.

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది)

తేది: 09.04.2024
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

ఏదైతే
దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి జరుపవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	తాడిబోయిన నాగేంద్రబాబు/ తాడిబోయిన కృష్ణ కుమారి/ LBGTR00006618342/ TBGTR00006370626	(లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్ లో వివరించిన ప్రకారం కవర్ చేయబడిన ఆస్తి మొత్తం భాగం మరియు ముక్కలతో 1170 చ.అ.లు. టి.ఎస్.నం.514 2 6వ బ్లాక్ 10వ వార్డు, డో.నం.2 33 42 తెనాలి మున్సిపల్, తెనాలి ఎస్ఆర్ఓ తెనాలి, గుంటూరు మండలం, గుంటూరు-522201, ఉత్తరం : మున్సిపల్ రోడ్డు 20 అ.లు., దక్షిణం : ఉప్పలపాటి దమయంతి ఆస్తి, తూర్పు : సయ్యద్ అబ్దుల్ ఖాసీం ఆస్తి, పడమర : షేక్ సర్దార్ ఆస్తి/లాంఛనప్రాయ స్వాధీనత : 04.04.2024	19.01.2024 Rs. 26,89,791.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 మరియు 9 క్రింద నిబంధనల ప్రకారం ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరిన తర్వాత తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 09 ఏప్రిల్, 2024
ప్రదేశం : గుంటూరు మరియు విజయనగరం

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

ఏదైతే
దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి జరుపవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	ధరావత్తు చిన్నారి/ వెంకటేషు ధరావత్తు / ధరావత్తు వినయ్ కుమార్/ LBVJW00004906313/ LBVJW00004913173	(లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్ లో వివరించిన ప్రకారం (లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్ లో వివరించిన ప్రకారం కవర్‌చేయబడిన ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్లు 2567 చ.అ.లు., డో.నం.15 20, ఫ్లాట్ నం.జి3 సాయి రామ్ రెసిడెన్సీ గ్రౌండ్ ఫ్లోర్, రూరల్ మండలం కృష్ణాజిల్లా, విజయవాడ ఆర్ఎస్ నం.589 4, విజయవాడ 520012. ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : కామన్ కారిడార్, పడమర : ఓపెన్ టు స్కై/లాంఛనప్రాయ స్వాధీనత : 03.04.2024	18.01.2024 Rs. 40,16,746.00/-	విజయవాడ

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 మరియు 9 క్రింద నిబంధనల ప్రకారం ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరిన తర్వాత తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 09 ఏప్రిల్, 2024, ప్రదేశం : విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్ ఆఫీస్ : నెం. హెచ్.948, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002. ఫోన్ : 0866-2433379, 2436365

స్వాధీనతా ప్రకటన

అనుబంధం - 4 - స్థిరాస్తి కొరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 8(1) క్రింద. సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద ఏర్పాటు కాబడినది.

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద **గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలు / సహ రుణగ్రహీతలు / రుణగ్రహీతల యొక్క న్యాయవారసులకు డిమాండు నోటీసు జారీచేసి సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు చెల్లించు వరకు తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొదలగు వాటిని తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది.రుణగ్రహీతలు దిగువ పేర్కొనబడిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఇందుమూలముగా ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రాజికమునకు తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ పేర్కొనబడిన ఆస్తిన దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నారు.**
ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదు మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరిపితే లోన్ రీకాల్ నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు తదుపరి వడ్డీలు, ఛార్జీలు మొదలగు వారి కొరకు బ్యాంకు యొక్క ఛార్జికి లోబడి ఉండగలదు.
హామీగల ఆస్తులు విడిపించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నిబంధనలను రుణగ్రహీతల దృష్టికి తీసుకురావడం జరుగుచున్నది.

1	**రుణగ్రహీతల వివరాలు: 1) ప్రధాన రుణగ్రహీత: బొబ్బిలి విస్రాంతమ్మ,** W/o **యేశయ్య. డిమాండ్ నోటీస్ తేదీ: 01-01-2024 బకాయి మొత్తం: రూ.22,50,368/- 31.12.2023** నాటికి మెయిన్ బ్రాంచ్ నందలి **లోన్** నం. **01-2213-009366లో** పూర్తిగా మరియు ఛార్జీలు మొదలైనవి చెల్లించే వరకు తదుపరి వడ్డీ. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: బొబ్బిలి విస్రాంతమ్మ:** డోర్ నెం. 53-1-34, ప్లాట్ నెం.68A, విజయనగర్ కాలనీ హిల్ ఏరియా, గుణదల, విజయవాడ-520004. సర్వే నెం.413/Aలో 155 చదరపు గజాల స్థలంలో ACC షెడ్‌లు ఉంటాయి. **అసెస్‌మెంట్ నెం.1073195093 (పాత.అసెస్‌మెంట్ నం.605481).** గుణదల సబ్-రిజిస్ట్రీ కింద డాక్ నెం.2660/2004. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** కె.ఎస్తేరమ్మ రాణి, **దక్షిణం:-** రోడ్డు, **పడమర:-** ఆరోగ్యమ్మ **ఉత్తరం:-** పద్మ. **స్వాధీనం చేసుకున్న తేదీ: 03-04-2024**
2	**రుణగ్రహీతల వివరాలు: 1) ప్రధాన రుణగ్రహీత : చల్లగాలి పద్మావతి దేవి,** W/o **వెంకట పున్నమ రాజు (లేటు) డిమాండ్ నోటీస్ తేదీ: 01-01-2024 బకాయి మొత్తం : రూ.69,51,195/- 31.12.2023** నాటికి మెయిన్ బ్రాంచ్ నందలి **లోన్ నెం. 01-2213-008714లో** పూర్తిగా మరియు ఛార్జీలు మొదలైనవి చెల్లించే వరకు తదుపరి వడ్డీ. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: చల్లగాలి పద్మావతి దేవి,** డోర్ నెం. 8-6, సాన్వి ఎన్‌క్లేవ్ దగ్గర, జెండా చెట్టు సెంటర్, రామాలయం దగ్గర, మస్జిద్ సెంటర్ సిగ్నల్స్, ఎనికేపాడు, విజయవాడ రూరల్. సర్వే నెం.205/9లో 175 చదరపు గజాల స్థలంలో ACS షెడ్‌తో సహా. అసెస్‌మెంట్ నం.1110. Doc No.5521/2011 & MODT:1630/2015తో గుణదల సబ్ రిజిస్ట్రీ కింద. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** కల్యాణం శ్రీనివాసరావు (34-8 అడుగులు), **దక్షిణం:-** బజార్ (48-9 అడుగులు), **పశ్చిమం:-** పంచాయతీ బజార్ (34-0 అడుగులు), **ఉత్తరం:-** 4-6 అడుగుల బజార్ (43 -0 అడుగులు). **స్వాధీనం చేసుకున్న తేదీ: 03-04-2024.**
3	**రుణగ్రహీతల వివరాలు: 1) ప్రధాన రుణగ్రహీత: చల్లగాలి శ్రీనివాస బాబు, S/o వెంకట పున్నమ రాజు (లేటు) డిమాండ్ నోటీస్ తేదీ: 01-01-2024 బకాయి మొత్తం: రూ.95,43,241/- 31.12.2023 నాటికి.** మెయిన్ బ్రాంచ్ నందలి **లోన్ నెం. 01-2213-008332లో** పూర్తిగా మరియు ఛార్జీలు మొదలైనవి చెల్లించే వరకు తదుపరి వడ్డీ. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: చల్లగాలి శ్రీనివాసబాబు:** డోర్ నెం. 3-34, CMR ప్లాజా వెనుక వైపు మరియు నారాయణ కళాశాల యొక్క సరస్వతి భవన్, ఫ్లై ఓవర్ స్టార్టింగ్ పాయింట్ దగ్గర, నిడమనూరు, విజయవాడ రూరల్-521104. ఆస్తి పరిమాణం 205 యార్డుల్లో. సర్వే నెం.113/11లోని ఏసీఎస్ షెడ్ కలిగి ఉంటుంది. **అసెస్‌మెంట్ నం.1684.** గుణదల సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.1799/2012 & MODT:8015/2014 **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** 12 అడుగుల ఉమ్మడి మార్గం (61 లింకులు), **దక్షిణం:-** నర్రా వెంకటేశ్వరరావు (71 లింకులు) **పశ్చిమం:-** బొర్రా సాంబశివరావు (61 లింకులు) **ఉత్తరం:-** గరిమెళ్ల వెంకటేశ్వరరావు (71 లింకులు) **స్వాధీనం చేసుకున్న తేదీ: 03-04-2024.**
4	**రుణగ్రహీతల వివరాలు: 1) ప్రధాన రుణగ్రహీత: బత్తిన నాగార్జున, S/o వెంకట గణేశ్వరరావు డిమాండ్ నోటీసు తేదీ: 01-01-2024 బకాయి మొత్తం రూ.12,42,292/- 31.12.2023** నాటికి పటమట బ్రాంచ్ నందలి **లోన్ నంబర్ 02-2213-005451లో** పూర్తి మరియు ఛార్జీలు మొదలైనవి చెల్లించే వరకు తదుపరి వడ్డీతో పాటు **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: బత్తిన నాగార్జున,** డోర్ నెం.7- 409, శ్రీ బాలాజీ రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.1, 2వ అంతస్తు, జాబిల్లి హాస్పిటల్ పక్కన, పోరంకి, కృష్ణా జిల్లా. సర్వే నెం.445/8లో 387.64 చదరపు గజాల ఆస్తిలో 35 చదరపు గజాల UDSతో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్. సాధారణ ప్రాంతం మరియు కార్ పార్కింగ్ ఏరియా 100 SFTతో సహా ప్లింట్ ఏరియా 950 SFT **అసెస్‌మెంట్ నం.3690.** కంకిపాడు సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.11153/2014 & MD/MODT: 2303/2018. **అపార్ట్‌మెంట్ సరిహద్దులు: తూర్పు:-** తోటకూర కమలమ్మ, **దక్షిణం:-** తోటకూర కుటుంబరావు, **పడమర:-** కర్లపూడి వెంకటేశ్వరరావు & వెంకట భవానీ వర ప్రసాద్, **ఉత్తరం:-** రోడ్డు. **ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు:-** ఆకాశానికి తెరువు, **దక్షిణం:-** ఆకాశానికి తెరువు, **పశ్చిమం:-** ఆకాశానికి తెరువు, **ఉత్తరం:-** ఫ్లాట్ నెం.2 & కమాన్ కారిడార్ **స్వాధీనం చేసుకున్న తేదీ: 06-04-2024**
5	**రుణగ్రహీతల వివరాలు: 1) ప్రధాన రుణగ్రహీత: బాలిపల్లి దుర్గా** w/o **గోవిందరావు. డిమాండు నోటీసు తేదీ: 20/11/2023. బకాయి మొత్తం: రూ.5,62,667/- 31.10.2023** నాటికి పూర్తి మరియు ఛార్జీలు తదితరాలు చెల్లించే వరకు తదుపరి వడ్డీతో పాటు. అజిత్ సింగ్ నగర్ బ్రాంచ్‌లోని **లోన్ నెం. 04221300381 8.** **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: బలిపల్లి దుర్గ,** డోర్ నెం: 77-228-20, ప్లాట్ నెం-297, మున్సిపాలిటీ స్కూల్ దగ్గర, పాత రాజీవ్ నగర్, పాయకాపురం, విజయవాడ. **అసెస్‌మెంట్ నెం. 1073076307.** విజయవాడ సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.4590/2004 & MD/MODT 11961/2018. సర్వే నెం.34P,35,36లో 50 చదరపు గజాల స్థలం భవనం కలిగి ఉంటుంది. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** ప్లాట్ నెం - 311, **దక్షిణం:-** ప్లాట్ నెం - 296, **పశ్చిమం:-** రోడ్డు, **ఉత్తరం:-** ప్లాట్ నెం - 298 **స్వాధీనం చేసుకున్న తేదీ : 02-04-2024**
6	**రుణగ్రహీతల వివరాలు: 1) ప్రధాన రుణగ్రహీత: మరణించిన ప్రధాన రుణగ్రహీత కుటుంబ సభ్యులు, జుంజూరు దానమ్మ, W/o J బంగారరావు, భర్త: జుంజూరు బంగారరావు, కుమార్తె: కె.పద్మావతి, కుమార్తె: పి.కుమారి, కుమారుడు: జునజూరు శ్రీనివాసరావు, కొడుకు : ఏసోబు. డిమాండ్ నోటీసు తేదీ: 20-11-2023 బకాయి మొత్తానికి : రూ.11,19,327/- 31.10.2023** నాటికి అజిత్ సింగ్ నగర్ బ్రాంచ్ నందలి **లోన్ నంబర్ 04-2213-002711లో** పూర్తిగా మరియు ఛార్జీలు మొదలైనవి చెల్లించే వరకు తదుపరి వడ్డీతో పాటు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: జుంజూరు దానమ్మ (చివరి)** డోర్ నెం: 43-8-4, ప్లాట్ నెం.2514, బ్లాక్ నెం: 99, వడ్డెర కాలనీ, అజిత్ సింగ్ నగర్, విజయవాడ-8. **అసెస్‌మెంట్ నెం.140551** మరియు విజయవాడ సబ్ రిజిస్ట్రీ కింద. డాక్ నెం.2637/2005తో. 17/1గా పునరుద్ధరించబడిన సర్వే నెం.17లో 66.66 చదరపు గజాల ఆస్తి ACS షెడ్‌ను కలిగి ఉంది. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** ప్లాట్ నెం - 2515, **దక్షిణం:-** రోడ్డు, **పడమర:-** అబ్రహం, **ఉత్తరం:-** ప్లాట్ నెం - 2520 **స్వాధీనం చేసుకున్న తేదీ: 02-04-2024**
7	**రుణగ్రహీతల వివరాలు: 1) మరణించిన ప్రధాన రుణగ్రహీత కుటుంబ సభ్యులు, నాగిపోగు సముద్రాలు, S/o రామయ్య (లేట్) 1. కుమారుడు: నాగిపోగు పెదబాబు, S/o సముద్రాలు (లేట్). 2. కూతురు: నాగిపోగు సాయమ్మ, D/o సముద్రాలు (లేట్). 3. కూతురు: మన్నె సిరోమణి, D/o సముద్రాలు (లేట్). 4. కూతురు: మన్నెం రత్నమణి, D/o సముద్రాలు (లేట్). డిమాండ్ నోటీసు తేదీ: 20-11-2023 బకాయి మొత్తం తేదీ: రూ.6,58,666/- 31.10.2023** నాటికి. అజిత్ సింగ్ నగర్ బ్రాంచ్‌లోని **లోన్ నంబర్ 042213004363లో** పూర్తి మరియు ఛార్జీలు మొదలైనవి చెల్లించే వరకు తదుపరి వడ్డీతో పాటు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: నాగిపోగు సముద్రాలు (చివరి)** డోర్ నెం:42-83-6, ప్లాట్ నెం.630, గంగానమ్మ సెంటర్ దగ్గర, అజిత్ సింగ్ నగర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా. **అసెస్‌మెంట్ నెం.1073056107.** విజయవాడ సబ్ రిజిస్ట్రీ ఆధ్వర్యంలో.. డాక్ నెం.2379/2002 & MD/MODTతో: 2839/2020. 17/1గా పునరుద్ధరించబడిన సర్వే నెం.17లో 46.67 చదరపు గజాల ఆస్తి RCC బిల్డింగ్‌ను కలిగి ఉంది. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** ప్లాట్ నెం:631 , **దక్షిణం:-** ప్లాట్ నెం:647, **పశ్చిమం:-** షేక్ అబిదా, **ఉత్తరం:-** మార్గం & S దుర్గంభ. **స్వాధీనం చేసుకున్న తేదీ: 02-04-2024**
8	**రుణగ్రహీతల వివరాలు: 1) వీరమల్ కృష్ణ కుమారి,** w/o **శ్రీనివాసరావు. డిమాండ్ నోటీసు తేదీ: 20-11-2023, బకాయి మొత్తం: రూ.2,93,682/- 31.10.2023** నాటికి అజిత్ సింగ్ నగర్ **లోన్ నెం. 04-2213-002968లో** పూర్తి మరియు ఛార్జీలు మొదలైనవి చెల్లించే వరకు తదుపరి వడ్డీతో పాటు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: వీరమల్ కృష్ణ కుమారి,** డోర్ నం:77-8-7, ప్లాట్ నెం.3894, మసీదు దగ్గర, శాంతి నగర్, పాయకాపురం, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా. **అసెస్‌మెంట్ నెం 154155.** బ్లాక్ నెం-8, విజయవాడలో సబ్ రిజిస్ట్రీ. డాక్ నెం.2119/2004 & MD/MODT:1424/2017తో. సర్వే నెం.68,73,74,82,92,95లో 72 చదరపు గజాలలో ఆస్తి భవనం కలిగి ఉంటుంది. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:-** ప్లాట్ నెం.3893, **దక్షిణం:-** ప్లాట్ నెం.3912, **పశ్చిమం:-** ప్లాట్ నెం.3895, **ఉత్తరం:-** రోడ్డు. **స్వాధీనం చేసుకున్న తేదీ: 02-04-2024**

ది.06-04-2024
స్థలం : విజయవాడ

సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్
ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

విశాఖ రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి
10

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 245 | విజయవాడ, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 9 April 2024 | Rs



ఖగోళ అద్భుతం

- అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం
- చూసేందుకు పెద్దయెత్తున గుమికూడిన జనం
- మెక్సికో నుంచి కెనడా దాకా ఒకటే సందడి

న్యూయార్క్/ టొరంటో : ఖగోళ అద్భుతం, అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం అమెరికా, మెక్సికో, కెనడా ప్రజలకు కనువిందు చేసింది. చాలా ఏళ్ల తరువాత కనిపించిన ఈ అరుదైన సూర్యగ్రహణాన్ని వీక్షించేందుకు వచ్చిన సందర్శకులతో నయాగరా జలపాతం, పార్కులు, నాసా కేంద్రాలకు ఖగోళ శాస్త్రవేత్తలు, ఔత్సాహిక శాస్త్రవేత్తలు, సాధారణ ప్రజానీకంతో కిటకిటలాడాయి. సాధారణంగా ప్రతి ఏటా రెండు నుండి ఐదు సూర్యగ్రహణాలు ఏర్పడుతుంటాయి. కానీ సంపూర్ణ సూర్యగ్రహణం ప్రతి 18మాసాలకొకసారి మాత్రమే ఏర్పడుతుంది. అప్పుడు కూడా అందరూ చూడలేరు, దీనికి కారణం గ్రహణం సమయంలో అంబ్రల్ షాడో అంటే చంద్రుని యొక్క చీకటి లోపలి నీడ - దట్టంగా నల్లగా వుండే ఈ ప్రాంతం చాలా చిన్నగా వుంటుంది, మొత్తంగా భూమిపై ఒక శాతం కన్నా తక్కువమందికి మాత్రమే కనిపిస్తుంది. తాజాగా ఏర్పడిన సంపూర్ణ సూర్య గ్రహణాన్ని అరుదైనది అని ఎందుకంటున్నారంటే ఉత్తర అమెరికా, కెనడాల్లో 115 మైళ్ళ పొడవునా దాదాపు 8 నగరాల్లో ఇది కనువిందు చేసింది. ఒకసారి ఏర్పడిన ప్రాంతంలో మరి కొన్ని శతాబ్దాల తరువాత కానీ ఇది కనిపించకపోవచ్చని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్థానిక కాలమానం సోమవారం ఉదయం 8గంటలకు మెక్సికోలేని మెజట్లాస్ పసిఫిక్ తీర ప్రాంతంలో మొదట పాక్షికంగా కనిపించింది. భారత్ కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 9గంటల నుండి మంగళవారం తెల్లవారు జామున 2.30గంటల వరకు ఈ ప్రక్రియ సాగింది. భారత్‌లో ఇది కనిపించ లేదు. ఇటువంటి అరుదైన సంపూర్ణ గ్రహణం కోసం 2034 మార్చి 20 వరకు వేచి చూడాల్సి ఉంటుంది. సంపూర్ణ సూర్య గ్రహణం ఎలా ఏర్పడుతుందంటే భూ భ్రమణం, పరిభ్రమణంలో సూర్యుడు చంద్రుడు భూమి ఒకే కక్ష్యలోకి వచ్చినప్పుడు సంభవిస్తుంది. సూర్యుని కాంతి భూమిపై పడకుండా మధ్యలో చంద్రుడు అడ్డంపడి పూర్తిగా కమ్మేసినప్పుడు పగలే చీకటిగా మారుతుంది. దీనినే సంపూర్ణ సూర్యగ్రహణం అని అంటాం. సూర్యునికి భూమికి మధ్య చంద్రుడు వచ్చి పాక్షికంగా సూర్యుణ్ణి కవర్ చేసినప్పుడు పాక్షిక సూర్యగ్రహణం ఏర్పడుతుంది. సంపూర్ణ సూర్యగ్రహణం వీక్షించేందుకు టెలిస్కోప్ కేంద్రాల వద్ద చిన్న పిల్లల దగ్గర నుంచి వృద్ధుల దాకా పోటీ పడ్డారు. వీరికి నాసా, పీపుల్స్ సైన్స్ సంస్థలు ప్రత్యేక నల్ల కళ్లద్దాలను పంపిణీచేశాయి. చాలా ప్రాంతాల్లో వాతావరణం అనుకూలించడం వల్ల లక్షలాది మంది ఈ ఖగోళ అద్భుతాన్ని చూసి మురిసిపోయారు.

సిట్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హెరిటేజ్ పత్రాలు దహనం చేశారని టిడిపి ఆరోపణ

- అవి పనికిరాని కాగితాలు : ఎపి సిఐడి
- ఇసి విచారణ జరపాలి : సిపిఎం డిమాండ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాడేపల్లిలోని సిఐడి సిట్ కార్యాలయం కాంపౌండ్‌లో పలు పత్రాలను సిబ్బంది తగలబెట్టారు. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటన ఉద్రిక్తతకు దారితీసింది. పత్రాలను దహనం చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీటిని హెరిటేజ్ సంస్థకు చెందిన పత్రాలతో పాటు కీలకమైన ఇతర దస్త్రాలు వాటిలో ఉన్నాయని టిడిపి ఆరోపిస్తోంది. సాధారణ ఎన్నికలు జరుగుతున్న వేళ హడావిడిగా వాటిని తగలబెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిట్ కార్యాలయం వద్ద సిఐడి సిబ్బంది సోమవారం పలు పత్రాలను దహనం చేశారు. సిబ్బంది వీటిని తగలబెడుతున్న సమయంలోనే స్థానికులు వారిని ప్రశ్నించి, నిలువరించే ప్రయత్నం చేశారు. తమకు పై అధికారుల ఆదేశాలున్నాయని చెప్తూ సిబ్బంది స్థానికుల అభ్యంతరాలను ఖాతరు చేయలేదు. మరికొందరు ఈ సంఘటనను, సిబ్బంది తగలబెడుతున్న దస్త్రాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. వీటిలో కొన్ని కాగితాలపై హెరిటేజ్ పేరు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ విషయం తెలియడంతో టిడిపి కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. సిఐడి సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. మరోవైపు సిట్ కార్యాలయం బయట హెరిటేజ్ ఫైల్స్‌ను కట్టలుకట్టలుగా తగలబెడుతూ అధికారులు అడ్డంగా దొరికిపోయారని టిడిపి పేర్కొంది. కూటమి అధికారంలోకి వస్తే తప్పుడు కేసులకు సంబంధించి సృష్టించిన ఫేక్ డాక్యుమెంట్లపై విచారణ జరుగుతుందన్న భయంతోనే వాటిని తగలబెట్టారని ఆరోపించింది. ఈ సంఘటనపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని, ఫైళ్లను, డేటాను నాశనం చేయకుండా సిఐడితో పాటు ఇతర ఉన్నతాధికారులకూ ఆదేశాలివ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని టిడిపి నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, పట్టాబి, వర్ల రామయ్య తదితరులు కోరారు.

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం, సిపిఐ

ఈ ఘటనపై ఎన్నికల కమిషన్ సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు ప్రజలకు వెల్లడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పత్రాలు తగలబెట్టిన ఘటనపై సిఐడి ఇచ్చిన వివరణ పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ మాదిరి, ఎపిలో సిట్ అక్రమ కేసుల వ్యవహారం సాగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పేర్కొన్నారు. హెరిటేజ్ సంస్థకు చెందిన పత్రాలను తగలబెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

అనుమానాలకు తావు లేదు : సిఐడి

ఈ ఘటనపై స్పందించిన సిఐడి ఆర్థిక నేరాలకు సంబంధించిన ఐదు కేసుల్లో ఎసిబి కోర్టులో ఛార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపింది. ఒక్కో ఛార్జిషీట్ 8 వేల నుంచి 10 వేల పేజీల వరకు ఉంటుందని తెలిపింది. ఆ ఛార్జిషీట్లను ప్రింటింగ్ చేసే క్రమంలో ప్రింటర్‌లో సాంకేతిక కారణాలతో చాలా పేపర్లు సక్రమంగా ప్రింటు కాలేదని, కొన్ని పేపర్లు ప్రింటర్లో ఇరుక్కుపోయి, నలిగిపోయాయని చెప్పింది. దీంతో ఆ పేపర్లను మాత్రమే తగలబెట్టామని సిఐడి పేర్కొంది. అలాగే హెరిటేజ్ ఫుడ్స్‌కు సంబంధించిన ఐటి రిటర్న్ ప్రతులను, ఆ కంపెనీనే అందించిందని, దీనిలో ఎటువంటి అనుమానాలకూ తావులేదని పేర్కొంది.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసిన నీరు

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

ప్రజాశక్తి- విజయపురిసౌత్ (పల్నాడు జిల్లా)

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు సోమవారం అధికారులు తాగునీటిని విడుదల చేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు ఇఇ శివశంకరయ్య పర్యవేక్షణలో కుడికాలువ 5, 7 గేట్ల ద్వారా 5,500 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇఇ శ్రీహరి విడిచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం ఐదు టిఎంసిల నీటిని రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున పది రోజుల పాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నీటిని తాగునీటికి మాత్రమే ఉపయోగించాలని, రైతులు సాగునీటికి వాడుకోవద్దని కోరారు. కుడి కాలువ పరిధిలోని చెరువులను, కుంటలను నింపుకొని తాగునీటి నిమిత్తం వాడుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, మంచినీటి చెరువులను నింపుకోవడానికి, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉమ్మడి గుంటూరు జిల్లాలకు తాగునీటిని విడుదల చేశామన్నారు. ఇప్పటికే వేసవి ఎండలకు చెరువులన్నీ ఎండిపోయాయని, వాటిని నింపుకొని తాగునీటి అవసరాలకు వాడుకోవాలని ఆయన సూచించారు. కుడి కాలువ పరిధిలో పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలూ, గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మెట్ట ప్రాంతంలోని మండలాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డిఇ మురళీధర్, జెఇ బాబుమియా, సిబ్బంది పాల్గొన్నారు.

వేటు పడిన ఐఎఎస్‌లకు పోస్టింగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా, ఏకపక్షంగా పనిచేస్తున్నారనే కారణంతో కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసిన ఐఎఎస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 676ను సోమవారం విడుదల చేసింది. 2013 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మీశాకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా బదిలీ చేశారు. 2013 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి పి రాజబాబుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డిగా నియమించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి గౌతమిని టిటిడిలో జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్)గా నియమించారు. 2015 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి బిఆర్ అంబేద్కర్‌ను మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల పారిశుధ్యం డైరెక్టరుగా నియమించారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఎమ్‌డిగా పనిచేస్తున్న కె వెంకటరామిరెడ్డికి సివిల్ సప్లై కార్పొరేషన్ ఎమ్‌డిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఎన్ ప్రభాకర్‌రెడ్డికి సిసిఎల్ఎ సెక్రటరీగా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు.

జనసేనకు పోతిన గుడ్‌బై

- పార్టీలో పని చేసిన వారికి ఎందుకు సీట్లు ఇవ్వలేదు
- భవిష్యత్తుపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటా



ప్రజాశక్తి- వన్‌టౌన్ (విజయవాడ)

జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జనసేనలో పదవులకు రాజీనామా చేసినట్లు తెలిపారు. సీటు రాలేదని అసంతృప్తితో మాట్లాడడం లేదన్నారు. రాజకీయాల్లో మార్పు తెస్తారని అనుకున్నామని, కొత్త తరాన్ని తీసుకుని వస్తారని గుడ్డిగా పవన్ వెంట అడుగులు వేశామన్నారు. తనలాంటి కొత్త తరం రాజకీయ నాయకులకు పవన్ సమాధానం చెప్పాలని కోరారు. ఇన్నాళ్లూ స్వార్థపరులతో ప్రయాణం చేస్తున్నానని అర్థం కాలేదని, ఇన్ని రోజులు పవన్ లాంటి వ్యక్తితో నడిచినందుకు అసహ్యం వేస్తోందని వ్యాఖ్యానించారు. పార్టీ నిర్మాణం, క్యాడర్, వీర మహిళల భవిష్యత్తుపై దృష్టి సారించకపోవడంతో పవన్ నైజం తెలుస్తోందని, ఆయనది నటన అని తాము గుర్తించలేకపోయామని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కంటే ముందు పార్టీని నమ్ముకున్న వారి భవిష్యత్తు ఏంటో పవన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ స్వార్థం కోసం తమ కుటుంబాలు బలై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ వద్దకు కొంతమంది పార్టీ పెద్దలు తమను రానివ్వలేదని అపోహ పడ్డామని, ఆయన చెప్పినట్లే వారు పని చేశారని అర్థం చేసుకోలేకపోయామని వివరించారు జనసేన పార్టీకి కాలం త్వరలోనే చెల్లిపోతుందన్నారు. పార్టీలో పని చేసిన వారికి ఎందుకు సీట్లు ఇవ్వలేదని, టిడిపి వారికే సీట్లు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. పార్టీ పెట్టింది రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని, వ్యక్తిగత ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. తన వద్ద ఉన్న ఆధారాలన్నీ బయట పెడతానన్నారు. కాపు కాసిన కాపు సామాజిక తరగతిని పవన్ బలి చేస్తున్నారని విమర్శించారు. పవన్ తల్లిని దూషించిన వ్యక్తి సుజనా చౌదరికి టికెట్ ఇప్పించారని, కన్నతల్లిని విమర్శించిన వారు పచ్చనోట్ల కట్టలు పడేస్తే అన్ని మర్చిపోతారా? అని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గాన్ని బలోపేతం చెయ్యలేని మనోహర్... రాష్ట్రంలో పార్టీని ఏం బలోపేతం చేస్తారని ప్రశ్నించారు. తన రాజకీయ భవిష్యత్తును రెండు రోజుల్లో ప్రకటిస్తానని తెలిపారు.

దస్తగిరి పిటిషన్ రీ ఓపెన్

- సిబిఐ కోర్టులో 12న విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివేకా హత్య కేసు విచారణలో తనను సాక్షిగా వరిగణించాలంటూ దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను సిబిఐ కోర్టు సోమవారం రీ ఓపెన్ చేసింది. సిబిఐ వాదనలు వినేందుకు మళ్లీ విచారణ జరపాలని నిర్ణయించింది. దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ప గతంలో సిబిఐ వాదనలు వినిపించలేదు. దీంతో దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌పై గత నెల 12నే న్యాయస్థానం విచారణ ముగిస్తూ తీర్పును ఏప్రిల్ ఎనిమిదికి వాయిదా వేసింది. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత సిబిఐ కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు ప్రకటించారు. వివేకా హత్య కేసులో దస్తగిరి సాక్ష్యం నమోదు చేయాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను సిబిఐ కోర్టు ఈ నెల 12కి వాయిదా వేసింది.



ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు పంపిన సర్టిఫికెట్‌ను చూపుతున్న విసి ప్రసాద్‌రెడ్డి

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎయుకు స్థానం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ - 2024లో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థానం సంపాదించింది. ఈ మేరకు ఆ సంస్థ దీనికి సంబంధించిన సర్టిఫికెట్, మెడల్, పుస్తకాలను పంపింది. వీటిని ఎయు పాలక మండలి సమావేశ మందిరంలో ప్రిన్సిపల్స్‌తో కలిసి వైస్‌ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఆరున ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 60 వేల మందితో కలిసి 'ఛేంజ్ ఫ్రం హ్యూమన్ బీయింగ్ టు బీయింగ్ హ్యూమన్' ప్రతిజ్ఞ చేశారు. ఒకే ప్రాంగణంలో అత్యధిక సంఖ్యలో యువత పాల్గొని ఈ ప్రతిజ్ఞను చేయడాన్ని గుర్తిస్తూ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిజ్ఞ అనంతరం యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఎయు ఇటువంటి రికార్డును సాధించడం పట్ల వర్సిటీ ప్రిన్సిపల్స్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపల్స్ ఎ.నరసింహారావు, కె శ్రీనివాసరావు, టి శోభశ్రీ, వై రాజేంద్ర ప్రసాద్, ఎస్‌కె భట్టి, జి శశిభూషణరావు, దూరవిద్య సంచాలకులు ఆచార్య కె విశ్వేశ్వరరావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్ విజయ్ మోహన్ పాల్గొన్నారు.

వాహన పరిశ్రమపై హెచ్చు వడ్డీ రేట్ల ఒత్తిడి

- చిన్న కార్లపై మరింత ప్రతికూలత
- ఎఫ్ఎడిఎ ఆందోళన



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వరుసగా 14 మాసాల నుంచి వడ్డీ రేట్లను తగ్గించకపోవడంతో వాహన పరిశ్రమపై ఒత్తిడి నెలకొందని ఆ రంగం డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. అన్ని వాహనాల రిటైల్ అమ్మకాలపై ప్రభావం పడుతోందని.. ముఖ్యంగా చిన్న, ప్రవేశ స్థాయి వాహన కొనుగోలుపై హెచ్చు వడ్డీ రేట్లు ఒత్తిడిని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో 42 లక్షల ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు జరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఎడిఎ) సోమవారం వెల్లడించింది. రేపోరేటు యథాతథంగా కొనసాగింపునతో ప్రాథమిక స్థాయి వాహనాలపై ఒత్తిడి ఎక్కువగా ఉందని తెలిపింది.

ఎఫ్ఎడిఎ రిపోర్ట్ ప్రకారం.. 2023-24లో ద్విచక్ర వాహన అమ్మకాలు ఇప్పటికీ కోవిడ్ ముందు స్థాయి కంటే వెనుకబడి ఉన్నాయి. చిన్న కార్ల విభాగం అమ్మకాల్లో 3 శాతం తగ్గుదల నమోదవుతోంది. కొన్ని సంవత్సరాల క్రితంతో పోల్చితే 30 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ మారుతి సుజుకీ ఛైర్మన్ ఆర్‌సి భార్గవ ఎప్పటిలాగే ఆశాజనకంగా ఉన్నారు. ఎంట్రీ లెవల్‌లో కస్టమర్ల ఆదాయం పెరగడంతో 2026 నాటికి చిన్న కార్లకు మరింత డిమాండ్ పెరగొచ్చని భార్గవా పేర్కొన్నారు.

అధిక ద్రవ్యోల్బణానికి తోడు విత్త రేట్లలోనూ ఉపశమనం లేకపోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారని ఎఫ్ఎడిఎ పేర్కొంది. రాబోయే ఎన్నికలతో పాటు, ఈ సవాళు పరిశ్రమను ప్రభావితం చేస్తాయని విశ్లేషించింది. అన్ని విభాగాలలో వాహనాల అమ్మకాలపై ఒత్తిడి ఉండొచ్చు. ప్రస్తుతం 2024-25లో ఆశావాదం, సవాళ్ల మిశ్రమం మధ్య ఆటో పరిశ్రమ వృద్ధి స్థిరంగా ఉండొచ్చని ఎఫ్ఎడిఎ ప్రెసిడెంట్ మనీష్ రాజ్ సింఘానియా అంచనా వేశారు. ప్రభుత్వ వ్యయంతో పాటు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు, మంచి రుతుపవనాలు ఈ సంవత్సరం డిమాండ్‌ను పెంచుతాయని ఆశిస్తున్నామన్నారు. ఉగాది పండగ సందర్భంగా ఏప్రిల్‌లో అమ్మకాలు ఆశాజనకంగా ఉండొచ్చన్నారు. ఎన్నికల ప్రకటన తర్వాత వాణిజ్య వాహనాల కొనుగోళ్లలో తాత్కాలిక తగ్గుదల కనబడిందన్నారు.

అమ్మకానికి 75 లక్షల మంది బోట్ యూజర్ల డేటా

న్యూఢిల్లీ : ఆడియో, యాక్సెసరీస్ బ్రాండ్ బోట్ యూజర్ల వ్యక్తిగత సమాచారం లీక్ అయ్యింది. దాదాపు 75 లక్షల మంది బోట్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని డార్క్ వెబ్‌లో అమ్మకానికి పెట్టడం ఆందోళన కలిగించే అంశం. డేటా ఉల్లంఘనతో బాధిత కస్టమర్లు ఆర్థిక మోసాలకు, ఫిషింగ్ స్కామ్స్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. వినియోగదారుల పేర్లు, చిరునామా, కాంటాక్ట్ నెంబర్లు, ఇమెయిల్ ఐడిలు, కస్టమర్ ఐడిల వంటి కీలక వివరాలు డార్క్ వెబ్‌పై హ్యాకర్లు అమ్మకానికి పెట్టారు. షాపిఫైజీయువై అనే హ్యాకర్ ఈ దుశ్చర్యకు తెగబడినట్టు భావిస్తున్నారు. డేటా ఉల్లంఘనలపై కంపెనీల నుంచి సమాచారం రాబట్టడంలో భారత్ ఇంకా వెనుకబడి ఉందని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

షార్ప్ ఇండియా ఛైర్మన్‌గా సుజయ్ కరంపురి



హైదరాబాద్ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ షార్ప్ తన ఇండియా బిజినెస్ ఛైర్మన్‌గా సుజయ్ కరంపురిని నియమించింది. ఆయన డిస్‌ప్లే వ్యాపారానికి నాయకత్వం వహిస్తారని పేర్కొంది. దేశంలో షార్ప్ బ్రాండ్ ఉనికిని మెరుగుపరుస్తారని ఆ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది. టి వర్క్స్ సిఇఒగా, తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ఎండిగా పని చేసిన అనుభవం కరంపురికి ఉంది.



ఓటర్ల అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఇఒ ఎంకె మీనా, అదనపు సిఇఒ ఎమ్ఎన్ హరీంధర్ ప్రసాద్, అసిస్టెంట్ పోస్టు మాస్టర్ జనరల్ కందుల సుధీర్‌బాబు తదితరులు

పోస్టాఫీసుల ద్వారా అవగాహన

- పోస్టరును ఆవిష్కరించిన సిఇఒ ఎంకె మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 10,670 పోస్టాఫీసుల ద్వారా ఓటర్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం శ్రీకారం చుట్టారు. పోస్టల్‌శాఖ ముద్రించిన పలు రకాల ఓటర్ల అవగాహన పోస్టర్లను అదనపు సిఇఒ ఎమ్ఎన్ హరీంధర్ ప్రసాద్, అసిస్టెంట్ పోస్టు మాస్టర్ జనరల్ కందుల సుధీర్‌బాబుతో కలిసి సిఇఒ ఎంకె మీనా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ.. క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమం అమల్లో భాగంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం, పోస్టల్ శాఖతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. రాష్ట్రంలోని 57 హెడ్ పోస్టాఫీసులు, 1,512 సబ్ పోస్టాఫీసులు, 9,101 బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓటు విలువను, ఎన్నికల ప్రాముఖ్యతను రాష్ట్ర ప్రజలు, ప్రత్యేకించి యువత గుర్తించి రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టరు (మార్కెటింగ్) జి ప్రసన్న వెంకటసాయి పాల్గొన్నారు.



ఫైల్ ఫోటో

మణిపూర్‌లో సహాయక శిబిరాల్లోనే ఓటింగ్

- క్యాంపుల్లో 24,500 మంది

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో కుకీ, మెయితీ రెండు జాతుల మధ్య చెలరేగిన అల్లర్లు, హింసాత్మక సంఘటనల వల్ల సుమారు 50 వేల మందికిపైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. వీరిలో అత్యధిక ప్రజలు సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. సహాయ శిబిరాల్లో ఉన్న సుమారు 24,500 మందికిపైగా ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. శిబిరాల నుంచే వారు ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 24,500 మంది నిర్వాసితులు ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులుగా గుర్తించినట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రదీప్ కుమార్ ఝా తెలిపారు. నిరాశ్రయులు, స్థానభ్రంశం చెందిన వ్యక్తుల కోసం 94 ప్రత్యేక పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల కోసం మణిపూర్ రాష్ట్రంలో మొత్తం 2,955 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందులో దాదాపు 50 శాతం పోలింగ్ స్టేషన్లు చాలా సున్నితమైనవని వెల్లడించారు. కాగా, మణిపూర్‌లో మెయితీ, కుకీ వర్గాల మధ్య సుమారు ఏడాదిగా జరిగిన ఘర్షణలో సుమారు 200 మందికిపైగా మరణించారు. వేల సంఖ్యలో గాయపడ్డారు. ఆందోళనకారులు వేలాది ఇళ్లకు నిప్పుపెట్టడంతో సుమారు 50 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. ఇందులో సగానికిపైగా సహాయ శిబిరాల్లో ఇప్పటికీ తలదాచుకుంటున్నారు.

బిగ్ పోల్

ప్రపంచంలోకెల్ల అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ మన భారతదేశానిది. అతిపెద్ద రాజ్యాంగం, అతిపెద్ద పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా మనదే. ఈ మధ్యనే జనాభాలోనూ చైనాను వెనక్కినెట్టి మన దేశం మొదటి స్థానంలోకి వచ్చింది. అంతటి పెద్ద ప్రజా బాహుళ్యం ఐదేళ్లకోమారు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని తమకు నచ్చిన, తమకు మేలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కు ఓటు. ఓటు అనే ఆయుధాన్ని ఎక్కుపెట్టే సమయం వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల సమరానికి మార్చి 16న నగారా మోగించింది. షెడ్యూల్‌ను ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలు దేశ వ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న 543 స్థానాల్లో జరగుతున్నాయి. వీటితోపాటే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకూ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అలాగే రాజీనామాలు, మరణాలు, అనర్హత వేటు వంటి కారణాలతో ఖాళీ అయిన 26 శాసనసభ స్థానాలకూ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది ఇసి.

మహా యజ్ఞం

ఇంతపెద్ద దేశంలో ఎన్నికలు నిర్వహించడం ఆషామాషీ వ్యవహారం కాదు. అదొక మహా యజ్ఞం. 2024 జనవరి నాటికి ఇసి తాజా పర్చి ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం దేశంలో 97 కోట్ల ఓటర్లున్నారు. ఇంత మంది ఓటర్లు ప్రపంచంలో మరెక్కడా లేరు. మొత్తం ఓటర్లలో సగం, అంతకంటే ఎక్కువ మహిళా ఓటర్లుండటం విశేషం. 2019 ఎన్నికల్లో 89.6 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటికొచ్చేసరికి 7.28 కోట్ల ఓటర్లు పెరిగారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన 18-19 ఏళ్ల వయసు నవయువకులు 1.84 కోట్లు. మొత్తం ఓటర్లలో వారిది 1.89 శాతం. ఇంత పెద్ద సంఖ్యలో కొత్త ఓటర్లు రావడం రికార్డే. అమెరికా అతిపెద్ద ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటుంది. కానీ ఆ దేశం ప్రజాస్వామ్య వ్యవస్థలోకొచ్చాక దాదాపు గడచిన వందేళ్ల ముందు వరకు కూడా మహిళలకు ఓటు హక్కు లేదు. కానీ మన రాజ్యాంగం దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి ఎన్నికల నుంచీ పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది. ఇది మన రాజ్యాంగం గొప్పతనం. ప్రజాప్రాతినిధ్యచట్టానికి సవరణలు చేసి ట్రాన్స్‌జెండర్లకూ ఓటు హక్కు కల్పించారు. దేశ వ్యాప్తంగా 48 వేల మంది వరకు ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారు. సర్వీస్ ఓటర్లు 19 లక్షలకుపైన ఉన్నారు. శతాధిక వయసు కలిగిన ఓటర్లు రెండు లక్షలకుపైన ఉన్నారు. 85 ఏళ్లకుపైన ఉన్న సీనియర్ సిటిజన్ ఓటర్లు 81 లక్షలకుపైన ఉన్నారు. ఇంత మంది శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇసి ఎప్పటికప్పుడు ప్రక్రియలో మార్పులు చేస్తూ వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటోంది.

బ్యాలెట్ పత్రాల స్థానంలో ఇవిఎంలు వచ్చాయి. వాటిపై అనుమానాలు రావడంతో వివిప్యాట్‌లు వచ్చాయి. వాటిపైనా సందేహాలు వస్తున్నాయి. అన్ని వివిప్యాట్ స్లిప్‌లనూ లెక్కించాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు విచారణ దశలో ఉంది. అలాగే ఇవిఎంల పనితీరులో ప్రస్తుతం ఉన్న సీక్వెన్స్‌ను మార్చాలన్న సూచనలూ వస్తున్నాయి. ఇవిఎంలపై వస్తున్నవి సందేహాలే తప్ప నిరూపించదగిన స్పష్టమైన ఆధారాలు ఇప్పటి వరకు లేవు. ఇవిఎంలను ట్యాపరింగ్ చేయలేరని ఇసి చెబుతోంది.


మోడీ మరక

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఇసి స్వతంత్రత ప్రశ్నార్థకం కావడం ఆందోళనకరం. ఇసిని బిజెపి ప్రభుత్వం ప్రభావితం చేస్తోందనడానికి పలు ఉదాహరణలే ఉన్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందనడానికి ఇటీవల చేసిన చట్ట సవరణే నిదర్శనం. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో గతంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సభ్యునిగా ఉండేవారు. కొత్త చట్టంలో సిజెఐని మోడీ సర్కారు తప్పించింది. ప్రధాని, కేంద్ర ప్రభుత్వంలోని కేబినెట్ మంత్రి ఒకరు, ప్రతిపక్ష నేత మాత్రమే ఉంటారు. అప్పుడు మెజార్టీ ప్రభుత్వానిదే అవుతుంది. వారి అనుకూలురే కమిషనర్లుగా ఎంపిక అయ్యే అవకాశం ఉంటుంది. ఈ మధ్యన ఎన్నికల కమిషనర్ల రాజీనామాలు, నియామకాలు వివాదాస్పదమయ్యాయి. ఇదిలా ఉండగా ప్రస్తుత బిజెపి ప్రభుత్వంలో ఎన్నికలు సజావుగా జరుగుతాయో లేదోనన్న శంక అంతర్జాతీయంగా నెలకొంది.

అందుకే ఇక్కడి ఎన్నికల ప్రక్రియ పరిశీలనకు అంతర్జాతీయంగా ఒక కమిటీ ఏర్పడటంబట్టి దేశంలో ఎన్నికలపై ఉన్న అనుమానాల తీవ్రతేమిటో అర్థమవుతుంది.

ఏడు దశలు

దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఇసి ఏర్పాట్లు చేసింది. బీహార్, యుపి, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఏడు దశల్లో పోలింగ్ ఉంది. తొలి దశ పోలింగ్ ఏప్రిల్ 19న జరుగుతుండగా, చివరి దశ పోలింగ్ జూన్ 1న నిర్వహిస్తున్నారు. దేశం మొత్తమ్మీద లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది. అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఓట్ల లెక్కింపు మాత్రం జూన్ 2న పూర్తి చేస్తారు. అక్కడ లోక్‌సభ ఓట్ల లెక్కింపు జూన్ 4నే ఉంటుంది.



ఎన్నికల దశలు - 2024

	దశలు	స్థానాల సంఖ్య	రాష్ట్రాలు	పోలింగ్ తేదీ
	మొదటి దశ	102	21	19-04-2024
	రెండవ దశ	89	13	26-04-2024
	మూడవ దశ	94	12	07-05-2024
	నాలుగవ దశ	96	10	13-05-2024
	ఐదో దశ	49	08	20-05-2024
	ఆరో దశ	57	07	25-05-2024
	ఏడో దశ	57	08	01-06-2024

తమిళనాట హోరెత్తిన ప్రచారం

- బలంగా ముందుకు సాగుతున్న ఇండియా ఫోరం
- ఎన్‌డిఎ నుంచి బయటకొచ్చి అన్నాడిఎంకె పోటీ
- చిన్నా చితకా పార్టీలతో బిజెపి కూటమి



మొత్తం ఓటర్లు	6,18,90,348
పురుషులు	3,03,96,330
మహిళలు	3,14,85,724
థర్డ్ జండర్	8,294
మొత్తం స్థానాలు	39

సార్వత్రిక ఎన్నికల మొదటి దశ పోలింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారంలో మునిగి తేలుతున్నాయి. నేతల పరస్పర విమర్శలు, సవాళ్లతో రాజకీయ వేడి, వేసవి వేడిని మించిపోయింది. భిన్నమైన రాజకీయాలకు నిలయమైన తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు మొదటి దశలోనే (ఏప్రిల్ 19న) ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా అధికార డిఎంకె నేతత్వంలోని ఇండియా ఫోరం, ప్రతిపక్ష అన్నాడిఎంకె కూటమి, బిజెపి నేతత్వంలోని ఎన్‌డిఎ కూటమి పోటీ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సమాఖ్య వాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని బలపరుస్తూ ఇండియా ఫోరం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ప్రతిపక్ష అన్నాడిఎంకె కూటమి కేంద్రం జోలికి పోకుండా కేవలం డిఎంకె ప్రభుత్వ పాలనపైనే విమర్శలు గుప్పిస్తూ ప్రచారం చేస్తోంది. బిజెపి కూటమి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, హిందుత్వాన్ని ప్రచారం చేస్తూ ఎన్నికల బరిలోకి దిగింది.

బిజెపితో అన్నాడిఎంకె తెగదెంపులు

జయలలిత మరణం తరువాత, శశికళ జైలు పాలైన తరువాత అధికార అన్నాడిఎంకెలో సంక్షోభం చోటు చేసుకుంది. ఎప్పటి నుంచి తమిళనాడు రాజకీయాల్లో జోక్యం చేసుకోవాలని బిజెపి ఆత్రపడగా, ఈ పరిణామంతో అన్నాడిఎంకె నేతలు మోడీ, షాల వద్దకు ప్రదక్షిణాలు చేశారు. దీంతో తమిళనాడు బిజెపి చేతుల్లోకి వెళ్లింది. ఈ పరిణామాలను సునితంగా పరిశీలించిన తమిళ ప్రజలు అదును చూసి, అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడిఎంకె, బిజెపి కూటమికి గట్టిదెబ్బకొట్టారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో కలిసి పోటీ చేసిన అన్నాడిఎంకె తన వైఖరిని మార్చుకుని, ఎన్‌డిఎ కూటమి నుంచి బయటకు వచ్చింది. బిజెపితో కలిసి వెళ్తే తమకు పరాభవం తప్పదని భావించిన అన్నాడిఎంకె, బిజెపితో తెగదెంపులు చేసుకుంది. అన్నాడిఎంకె తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మరో మూడు చిన్న చితకా పార్టీలతో పొత్తులు పెట్టుకొని ఎన్నికల బరిలో దిగింది. బిజెపి కూడా మరో మూడు చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకొని ఎన్నికలకు దిగింది.

పక్షాల బలాబలాలు

2019 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులోని 39 స్థానాలకు గానూ 38 స్థానాలను డిఎంకె కూటమి గెలుచుకుంది. ఒక్క స్థానమే అన్నాడిఎంకె గెలుచుకుంది. బిజెపికి ఒక్కటి కూడా రాలేదు. డిఎంకె కూటమిలో డిఎంకె 24, కాంగ్రెస్ 8, సిపిఎం 2, సిపిఐ 2, ఐయుఎంఎల్, విసికె పార్టీలు ఒక్కొక్క స్థానం చొప్పున గెలుపొందాయి. అయితే ఇటీవల ప్రముఖ సినీ నటుడు కమలహాసన్ పార్టీ మక్కల్ నీది మైయం (ఎంఎన్ఎం)ను ఇండియా ఫోరంలో చేరి మద్దతిస్తోంది. ఈ పరిణామంతో డిఎంకె నేతృత్వంలోని పక్షానికి ప్రయోజనం జరగనుంది.

ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ

ప్రస్తుత ఎన్నికలో అన్నాడిఎంకె కూటమి తరపున అన్నాడిఎంకె 32, డిఎండికె 5, పిటి 1, ఎస్‌డిపిఐ 1 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇండియా ఫోరంలో డిఎంకె 21, కాంగ్రెస్ 9, సిపిఎం, 2, సిపిఐ 2, విసికె 2, ఐయుఎంఎల్ 1, ఎండిఎంకె 1, కెడిఎంకె 1 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. బిజెపి కూటమిలో బిజెపి 24, పిఎంకె 10, ఎఎంఎంకె 2, టిఎంసి (తమిళ్ మనిలా కాంగ్రెస్) 3 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. బిజెపి పోటీ చేసే 24 స్థానాల్లో బిజెపి అభ్యర్థులు 20 స్థానాల్లో పోటీ చేయగా, నలుగురు ప్రాంతీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు బిజెపి గుర్తుపై పోటీ చేస్తున్నారు.

సామాజిక సమీకరణలు

ఆధునికత ప్రారంభంతో కులం, మతం బలహీనపడతాయని ద్రవిడ పార్టీల ప్రాథమిక అంచనా. ఇది సమానత్వంపై ఆధారపడిన సమాజాన్ని రూపొందించడంలో సహాయ పడుతుందని ఆయా పార్టీలు పేర్కొంటున్నాయి. అయినప్పటికీ, తమిళనాడులోని వెల్లలార్లు, చెట్టియార్లు, ముధలియార్లు, నాయుడులు, గౌండర్లు, నాడార్లు, యాదవులు, తేవర్లు, వన్నియార్‌ల వంటి సామాజిక వర్గాలు రాజకీయంగా ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో ఆధిపత్య రాజకీయ ఉద్యమం బ్రాహ్మణ వ్యతిరేకత నుండి జస్టిస్ పార్టీ, ఆత్మగౌరవ ఉద్యమం, ఆపై ప్రస్తుత రాజకీయ పార్టీల వరకు పురోగమించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, సమాజంలోని విభిన్న వర్గాల మధ్య సామాజిక, రాజకీయ అభివద్ధి సూచికలపరంగా తమిళనాడు ప్రగతిని సాధించింది. తమిళనాడులో 68 శాతం ఒబిసిలు, 20.01 శాతం ఎస్‌సిలు, 1.10 శాతం ఎస్‌టిలు, మిగిలిన 10.7 శాతం అగ్రవర్ణాలు ఉన్నారు. తమిళనాడులో హిందువులు దాదాపు 87.58 శాతం (ఇందులో ఎస్‌సి, ఎస్‌టిలు ఉన్నారు), ముస్లింలు దాదాపు 5.86 శాతం, క్రైస్తవులు మరో 6 శాతం ఉండగా, ఇతరులు 0. 56 శాతం ఉన్నారు. 6 శాతం క్రైస్తవుల్లో గణనీయమైన భాగంగా దళితులు ఉన్నారు.

డిఎంకెకి అనుకూలాంశాలు

నీట్ రద్దు, జాతీయ విద్యా విధానం-2020 స్థానంలో ప్రత్యామ్నాయ విద్యా విధానం, విద్యను రాష్ట్ర జాబితాలోకి పునరుద్ధరించడం, గవర్నర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వంలోకి కేంద్రం జోక్యం, రాష్ట్రానికి నిధులు, ప్రతిపాదిత ఎనిమిది లేన్‌ల చెన్నై-సేలం గ్రీన్ కారిడార్ వంటి వాటిపై అన్నాడిఎంకె మౌనంగా ఉందని విమర్శలు వస్తున్నాయి. దీనిపై డిఎంకె కూటమి రాజీలేని పోరాటం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం హిందీని జొప్పించడాన్ని కూడా డిఎంకె కూటమి పెద్ద ఎత్తున పోరాటం చేసింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు కషి చేస్తోంది. బిజెపి తరపున ఇప్పటికే ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు ప్రచారం చేశారు. డిఎంకె తరపున ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, తనయుడు ఉదయనిధి స్టాలిన్ తదితరులు ప్రచారం చేస్తున్నారు. సిపిఎం నేతలు ప్రకాష్ కరత్, సీతారాం ఏచూరితో పాటు రాష్ట్ర నేతలు, సినీ ప్రముఖులు ప్రచారం చేస్తున్నారు. అన్నాడిఎంకె తరపున మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి, తదితరులు ప్రచారం చేస్తున్నారు. అయితే బిజెపి విభజన రాజకీయాలకు పాల్పడుతోంది. ఈ వీటికి తమిళనాడులో స్థానం లేదు.

(ప్రజాశక్తి న్యూఢిల్లీ బ్యూరో)

బిజెపికి మూడవ స్థానమే...!


- ఒక్క సీటూ కష్టమే
- కేంద్ర పెద్దలకు ఇంటెలిజెన్సీ నివేదిక

ప్రజాశక్తి - చెన్నై బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు రాష్ట్రంలో కమలం కూటమికి మూడో స్థానం దక్కనుందని పలుచోట్ల ఆ కూటమికి ఓటమి తప్పదని కేంద్ర నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. ఇందుకు సంబంధించిన నివేదికను ఢిల్లీ బిజెపి పెద్దలు నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలో బిజెపి బలం పెరిగిందనే ధీమాతో రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై ఉన్నారు. బిజెపి కూటమిలో పిఎంకె. తమిళమానిల కాంగ్రెస్, అమ్మ మక్కల్ మున్నెట్ర కళగం వంటి పార్టీలతో పాటు కొన్ని చిన్న పార్టీలు కూడా చేరాయి. ఇందులో పిఎంకె 10, తమిళ మానిల కాంగ్రెస్ మూడు, అమ్మ మక్కల్ మున్నెట్ర కళగం రెండు చోట్ల పోటీ చేస్తున్నాయి. ఏసీ షణ్ముగం - పుదియనీడికట్చి, పారివేందర్ - ఐ జెకె, జాన్ పాండియన్ - తమిళ మక్కల్ మున్నెట్రా కళగం, దేవానాచాన్ - ఇండియన్ మక్కల్ కల్వి మున్నెట్ర కళగం నేతలు సైతం బిజెపి కూటమిలో కమలం గుర్తుపై పోటీ చేస్తున్నారు. బిజెపి అభ్యర్థులు 24 మంది లోక్‌సభ ఎన్నికల్లో పోటీలో ఉన్నారు. అభ్యర్థుల గెలుపు అవకాశాలు, నియోజకవర్గ పరిస్థితుల గురించి ఇంటెలిజెన్సీ వర్గాల ద్వారా ఢిల్లీలోని బిజెపి వర్గాలు ఆరా తీశాయి. ఇందుకు సంబంధించిన నివేదిక ఢిల్లీకి తెప్పించుకున్నారు. ఈ ఎన్నికల్లో కనీసం ఐదు స్థానాలు సాధించి డిఎంకె తర్వాత తమిళనాడు రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవాలని కమలం నేతలు చూస్తున్నారు. ఇదే సమయంలో అన్నాడీఎంకెని తొక్కేసి ఆ స్థానం కైవసం చేసుకోవాలని పావులు కదుపుతున్నారు. అయితే ఇవన్నీ ఫలించే అవకాశాలు లేవని ఇంటెలిజెన్స్ చెబుతోంది. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నా డీఎంకే మధ్యనే హోరాహోరీ పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. బిజెపి మూడో స్థానానికి పరిమితం అవుతుందని ఇంటెలిజెన్స్ నివేదిక తేల్చింది. కొన్నిచోట్ల బిజెపికి డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రాజకీయ నాయకుల విశ్లేషణ. ఏది ఏమైనప్పటికీ తమిళనాడులో బిజెపి బలం పెంచుకోలేదని అర్థమవుతోంది. దక్షిణ చెన్నై లోకసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తెలంగాణ మాజీ గవర్నర్ తమిళ సై సౌందర్ రాజన్ ఓటమి తప్పదని సర్వేలు తెలుపుతున్నాయి.

అరుణాచల్‌ప్రదేశ్‌లో బిజెపిపై ఆదివాసీల నిరసన

అరుణాచల్‌ప్రదేశ్‌లో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఫిరాయింపు ఎమ్మెల్యేలను లాక్కొని 2019లో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఈసారైనా పుంజుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. గిరిజనులు అధికంగా ఉన్న ఈ ఈశాన్య రాష్ట్రంలో అభివృద్ధి పేరిట వారి మనుగడకే ముప్పు వాటిల్లుతోందని ఆదివాసీలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఇటీవల మణిపూర్‌లో చోటుచేసుకున్న ఘటనలు ఈ ఎన్నికలపై ప్రభావం చూపనున్నాయి.. లోక్‌సభ ఎన్నికల్లో ఈశాన్య రాష్ట్రాల ఫలితాలపై దేశమంతా ఆసక్తి నెలకొంది. తొలిదశ ఎన్నికల్లో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏప్రిల్ 19న పార్లమెంటుతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలల్లో 169 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. 59 బిజెపి, 23 కాంగ్రెస్, 16 నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి), 23 నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి), 29 మంది స్వతంత్ర అభ్యర్థులు తలపడుతున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి ముగ్గురు మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న అరుణాచల్‌ప్రదేశ్‌లో 2016లో కాంగ్రెస్ సిఎం పెమాఖండుతో సహా 44 మంది ఎమ్మెల్యేలు ఆపార్టీని వీడి పిపిఎ (పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్)లోకి ఫిరాయించారు. బిజెపి వారికి మద్దతు పలికింది. పిపిఎ ముఖ్యమంత్రిగా తిరిగి ఖండూ ప్రమాణస్వీకారం చేశారు. తిరుగుబాటుదారులతో కలిసి బిజెపి చేసిన రాజకీయాన్ని సుప్రీంకోర్టు కొట్టిపారేయడంతో తిరిగి కాంగ్రెస్ నేతృత్వంలో ఖండు సిఎం అయ్యారు. 2019లో ఫిరాయింపుదారులను చేర్చుకుని బిజెపి అధికారంలోకి వచ్చింది.



రెండు లోక్‌సభ స్థానాలు

రెండు లోక్‌సభ స్థానాలకుగాను 14 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. రాష్ట్ర రాజధాని ఇంఫాల్ ఉన్న వెస్ట్ లోక్‌సభ నియెజకవర్గానికి ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు ఈ స్థానం నుంచి పోటీచేస్తున్నారు. ఆయనకు ప్రత్యర్థిగా అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ నబంతుకి తలపడుతున్నారు. రెండు స్థానాల్లోనూ 8 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2004లో బిజెపి, 2009లో కాంగ్రెస్ ఇక్కడ నెగ్గాయి, 2014లో చెరో సీటు దక్కించుకున్నాయి. 2019లో రెండింటినీ బిజెపి గెలుచుకుంది. ఈ రాష్ట్రంలో మొత్తం 8,86,848 మంది ఓటర్లున్నారు. పర్వత ప్రాంతం కావడంతో కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల నిర్వహణ కష్టంగా ఉండొచ్చని చెబుతున్నారు. సిబ్బంది, ఓటర్లు కాలినడకనే వెళ్లాల్సి ఉంటుంది.

కార్పొరేట్లకు వనరుల పందేరం

26 ఆదివాసీ తెగలు అరుణాచల్‌ప్రదేశ్‌లో నివసిస్తున్నాయి. అతిపెద్ద నిషి తెగవారి ప్రభావం ఈస్ట్ లోక్‌సభ నియోజకవర్గంపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి అభివృద్ధి పేరుతో ప్రైవేటు వారికి అనుమతులు జారీ చేసింది. విమానాశ్రయం, రోడ్ల విస్తరణకు వేల ఎకరాలు కేటాయించడంతో ఆప్రాంతంలో గిరిజనులకు అన్యాయం జరిగింది. ఎత్తైన పర్వతాలు, వాటి నడుమ హిమాలయ నదుల ప్రవాహంతో జలవిద్యుత్ ప్రాజెక్టలకు అనువైన ప్రదేశమని ఇటీవల బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అక్కడ భూములను





అప్పగించింది. జలవిద్యుత్ ప్రాజెక్టల నిర్మాణం వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు తమ మనుగడకే ముప్పువాటిల్లుతుందని గిరిజనులు పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపట్టటంతో కొన్ని ప్రాజెక్టలు ఆగిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా జలవిద్యుత్ ప్రాజెక్టలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తమౌతున్నా.. అధికార బలంతో వాటిని అణచివేస్తున్నారు. వీటికి తోడు ఇటీవల మణిపూర్‌లో చోటుచేసుకున్న ఘర్షణలలో మహిళలు, క్రైస్తవులపై దాడుల వంటి సంఘటనలు ఓటర్లలో ఆందోళన కలిగిస్తున్నాయి. 2014, 2019లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు భారీగా నగదు, పశువులను పంపిణీ చేసిందని కాంగ్రెస్ నేత మెడీరామ్ దోడుమ్ అంటున్నారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలుకు వ్యతిరేకత వ్యక్తమౌతోంది. కనీస అవసరాలైన విద్య, వైద్యం, ఉపాధి వంటి వాటిపై దృష్టిసారించకుండా కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను చేస్తూ అభివృద్ధి చేసామంటూ చేస్తున్న బిజెపి ప్రచారాలను స్థానిక గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. ప్రకృతి వనరులపై అధిపత్యం, ప్రాజెక్టల నిర్వహణ కోసం ఎలాగైనా అధికారంలోకి రావాలని బిజెపి పన్నాగాలు రచిస్తోంది. రాష్ట్రంలో 60 అసెంబ్లీ స్థానాలుండగా 10 అసెంబ్లీ స్థానాల్లో ప్రత్యర్థులతో నామినేషన్లు వెనక్కి తీసుకునేలా చేసింది బిజెపి. ఎన్నికలు లేకుండా పదింటిలో ఏకగ్రీవం చేసుకున్న బిజెపి పన్నాగాలు ఎలాంటివో ఈ పరిణామంతో అర్థమవుతోంది.

వైసిపిలో గ్రూపుల గోల

● ప్రభావం చూపనున్న కాంగ్రెస్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైసిపిని గ్రూప్ రాజకీయాలు కొంపముంచనున్నాయి. నగరి, పూతలపట్టు, జీడీ నెల్లూరులో ఈ ప్రభావం గతేడాదిగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మంత్రి ఆర్‌కె రోజా, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గ ద్వితీయశ్రేణి నాయకులు ఆక్షేపిస్తూనే ఉన్నారు. జీడి నెల్లూరులో నారాయణస్వామి పెద్ద కుమార్తెకు అవకాశం ఇచ్చినా ఈ ప్రభావంలో పెద్దగా మార్పు లేదనే చెప్పాలి. చిత్తూరు టిడిపి ఎంపి అభ్యర్థిగా దుగ్గిమళ్ల ప్రసాదరావు బాపట్ల జిల్లా నుంచి వలసొచ్చినా టిడిపి కంచుకోటగా ఉన్న కుప్పం, పలమనేరు నియోజకవర్గాలు కలిసి రానున్నాయి. 'వైనాట్ 175' నినాదంతో కుప్పంలో చంద్రబాబును ఓడించేందుకు వైసిపి గట్టిగానే ప్రయత్నిస్తోంది. పుంగనూరులో పెద్దిరెడ్డిని దెబ్బతీయాలని టిడిపి చూస్తోంది.

చిత్తూరు జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. చిత్తూరు పార్లమెంటు ఎస్‌సి రిజర్వుడు. పూతలపట్టు, జీడీ నెల్లూరు రిజర్వుడు. చిత్తూరు పార్లమెంటు మొత్తం 15,58,257 ఓట్లున్నాయి. వైసిపి నుంచి సిట్టింగ్ ఎంపి ఎన్ రెడ్డెప్పది పుంగనూరు. టిడిపి నుంచి బాపట్ల జిల్లాకు చెందిన రిటైర్డు ఐఆర్‌ఎస్ అధికారి దుగ్గిమళ్ల ప్రసాద్‌రావు పోటీలో ఉన్నారు. బిసి, ఎస్‌సి, మొదలియార్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయి.



కుప్పంలో 2,23,311 ఓట్లు న్నాయి. టిడిపి నుంచి మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గత 35 ఏళ్లుగా బరిలోనే ఉన్నారు. ప్రస్తుతం ఎనిమిదోసారి బరిలో ఉన్నారు. వైసిపి అభ్యర్థిగా ఎమ్మెల్సీ భరత్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఆవుల గోపి పోటీ చేసే అవకాశం ఉంది. లక్ష మెజార్టీనే లక్ష్యం అంటూ టిడిపి ప్రచారం చేస్తోంది. అయితే ఈసారి చంద్రబాబును ఓడించేందుకు వైసిపి గట్టి కసరత్తే చేస్తోందని వైసిపి నాయకులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన 'సిద్ధం' సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. భరత్‌ను గెలిపిస్తే కేబినెట్‌లో మంత్రిని చేస్తానని సభాముఖంగానే ప్రకటించారు. పలమనేరులో టిడిపి నుంచి మాజీ మంత్రి ఎన్ అమరనాథరెడ్డి బరిలో ఉన్నారు. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటెగౌడ ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా శివశంకర్ పోటీలో ఉన్నారు. 'రెడ్డి' సామాజిక ఓట్లు చీల్చే అవకాశం లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో 2,67,178 ఓట్లున్నాయి.

పూతలపట్టులో వైసిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే సునీల్ పోటీలో ఉన్నారు. టిడిపి నుంచి ప్రముఖ జర్నలిస్టు మురళీ మోహన్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బరిలో ఉన్నారు. ఇక్కడ వైసిపి, టిడిపి ఓట్లు కూడా ఆయనకు పడే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్యే లలితకుమారి సిద్ధం సభలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే సికెబాబు తనకు పట్టున్న యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లిలో టిడిపిని తరఫున ప్రచారం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో 2,21,077 ఓట్లున్నాయి. చిత్తూరులో టిడిపి నుంచి గురజాల జగన్‌మోహన్‌రావు బరిలో ఉన్నారు. వైసిపి నుంచి ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్‌గా ఉన్న విజయానందరెడ్డి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి టి కారమ్ బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 2,01,741 ఓట్లున్నాయి. జీడీ నెల్లూరులో కాంగ్రెస్ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. ఈ నియోజకవర్గంలో 2,05,123 ఓట్లున్నాయి. వైసిపి నుంచి డిప్యూటీ సిఎం నారాయణస్వామి కుమార్తె కళత్తూరు కృపాలక్ష్మి బరిలో ఉన్నారు. టిడిపి నుంచి థామస్ తొలిసారి పోటీలో ఉన్నారు.

రోజాపై సొంత పార్టీలోనే వ్యతిరేకత

నగిరిలో వైసిపి నుంచి మంత్రి ఆర్‌కె రోజా బరిలో ఉన్నారు. ఆమెపై సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉంది. టిడిపి నుంచి మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు పెద్ద కుమారుడు గాలి భానుప్రకాష్ నాయుడు రెండోసారి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఆయన యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 2,01,607 ఓట్లున్నాయి.

రాష్ట్రంలో ఎన్నికల జాతర



● పాలుపంచుకోబోతున్న 4.9 కోట్ల ఓటర్లు
● 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలకు మే 13న పోలింగ్
● మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న నామినేషన్ల పర్వం



(ప్రజాశక్తి-అమరావతి బ్యూరో)

ఎన్నికల జాతరకు ఆంధ్రప్రదేశ్ సమాయత్తమవుతోంది. కులాలు, ప్రాంతాలు, మతాలతో సంబంధం లేకుండా కోలాహలంగా నిర్వహించుకునే ఈ అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసేందుకు ప్రజానీకమూ సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని దాదాపు నాలుగుకోట్ల మంది ఓటర్లు మరో 35 రోజుల్లో జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పాలుపంచుకుని రాష్ట్ర భవిష్యత్‌కు బాటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఓ వైపు పోటాపోటీ ప్రచారాలు, మరోవైపు ఉత్తేజపరిచి, ఉత్సాహ పరిచే మేనిఫెస్టోలు, హామీలతో ఉక్కిరిబిక్కిరవుతోన్న ప్రజానీకం వేలాది మంది అభ్యర్థుల తలరాతలను మార్చేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు, ప్రజల భవితవ్యానికి సంబంధించి అత్యంత కీలకమైనవి కానుండటంతో ఓటర్లంతా ఉత్సాహంగా ఈ ఓట్ల పండుగలో భాగస్వాములయ్యేందుకు సంసిద్ధమవుతున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 4,09,37,352 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోబోతున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత జరగుతున్న మూడవ అసెంబ్లీ ఎన్నికలు కావటం, ఓటర్ల సంఖ్య కూడా తొలిసారి నాలుగు కోట్లు దాటడంతో ప్రధాన పార్టీలు, అభ్యర్థులందరూ గంపెడాశలు పెట్టుకున్నారు. మరోవైపు ఎన్నికల ప్రవర్తనా నియమావళి గత నెల 16 నుంచి అమల్లోకొచ్చింది. సాధారణ పరిపాలన కొనసాగుతోంది. ఎన్నికల కమిషన్ నియంత్రణలో ప్రభుత్వ యంత్రాంగం పని చేస్తోంది. కోడ్ వంకతో ప్రజలకు మామూలుగా రోజువారీ పనులు కూడా కాక ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల తేదీ	- మే 13
నామినేషన్ల ప్రారంభ తేదీ	- ఏప్రిల్ 18
నామినేషన్లకు చివరి తేదీ	- ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	-ఏప్రిల్ 26
నామినేషన్ల ఉపసంహారణ	-ఏప్రిల్ 29
ఎన్నికల కౌంటింగ్ తేదీ	- జూన్ 4.

మొత్తం పోలింగ్ స్టేషన్లు	- 46,165
అర్బన్ పోలింగ్ స్టేషన్లు	-34,120
గ్రామీణ ప్రాంత పోలింగ్ స్టేషన్లు	- 12,045?
అసెంబ్లీ నియోజకవర్గాలు	175 (139-జనరల్), (29-ఎస్సి), (7-ఎస్టి)
పార్లమెంట్ స్థానాలు	25 (20-జనరల్), (04-ఎస్సి), (01-ఎస్టి)
ఎన్నికల కోసం ఉపయోగించబోయే ఇవిఎమ్ మెషన్లు	- 1,15,416

(2024 -అంచనా)

రాష్ట్ర జనాభా	5,63,92,350
పురుషులు	2,76,32,352
స్త్రీలు	2,87,60,098
మొత్తం ఓటర్లు	4,09,37,352
పురుష ఓటర్లు	-2,00,84,276
మహిళా ఓటర్లు	-2,08,49,730
థర్డ్ జెండర్ ఓటర్లు	-3,346
ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు	- 7,763
సర్వీసు ఓటర్లు	- 67,393
18-19 వయసు ఓటర్లు	-9,01,863
దివ్యాంగ ఓటర్లు	-5,17,140
85+ ఏళ్ల వయసు ఓటర్లు	-2,12,237

ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించబడిన మొత్తం అధికారులు	-3,82,218
రిటర్నింగ్ అధికారులు	-175/25
ఎఆర్‌ఓ	-798/207
ఇఆర్‌ఓ	-175
ఎఇఆర్‌ఓ	-1079
సెక్టార్ ఆఫీసర్లు	-5,067
సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు	-5,076
మైక్రో అబ్జర్వర్స్	-18,961
ప్రిసైడింగ్ ఆఫీసర్లు	-55,269
పోలింగ్ ఆఫీసర్లు	-2,48,814
బిఎల్‌ఒ	-46,165
జిల్లా నోడల్ అధికారులు	-416

అభ్యర్థుల ఎంపికలో తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టిడిపి, వైసిపి తీవ్ర స్థాయిలో పోటీ పడుతున్నాయి. అభ్యర్థుల ఎంపికలో ఇరుపార్టీలూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజలతో సంబంధం లేని కొత్త అభ్యర్థులను ఈ రెండు పార్టీలూ బరిలో దింపాయి. పార్టీలో సీనియార్టీ, నిబద్ధతను పక్కనపెట్టి డబ్బు ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేశాయన్న విమర్శలు అటు ఎన్‌డిఎ కూటమి, ఇటు వైసిపికి చెందినవారి నుంచే బలంగా విని పించాయి. గుంటూరు లోక్‌సభ స్థానానికి టిడిపి నుంచి ఎన్‌ఆర్‌ఐ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఎంపిక చేశారు. మొత్తం రూ.100 కోట్ల వరకు ఖర్చు చేస్తారన్న ప్రచారం ఉంది. వైసిపి నుంచి పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్యను ఖరారు చేశారు. కానీ, ఆయనను మారుస్తారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ ఆశించిన విధంగా ఆయన ఖర్చు చేయడం లేదనే భావన ఇందుకు కారణమని పార్టీ వైసిపి వర్గాల్లో వినిపిస్తోంది. ఇండియా వేదిక నుంచి సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ లోక్‌సభకు పోటీలో ఉన్నారు. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయడంతో వైసిపి పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

గుంటూరు పశ్చిమ నుంచి వైసిపి నుంచి మంత్రి విడదల రజిని పోటీలో ఉండగా, టిడిపి తరుపున రియల్టర్లు గల్లా రామచంద్రరావు సతీమణి మాధవికి అవకాశం దక్కింది. ప్రచారంలో మాధవి వెనుకబడ్డారు. ఆమెకు ప్రజా సంబంధాలు లేవు. మంత్రి రజిని ప్రచారంలో ముందున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. గుంటూరు తూర్పు నుంచి వైసిపి తరపున ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమా బరిలో నిలిచారు. టిడిపి అభ్యర్థిగా నజీర్ అహ్మద్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి పోటీ చేయనున్నారు. మంగళగిరి నుంచి టిడిపి తరపున మాజీ మంత్రి నారా లోకేష్ పోటీ చేస్తున్నారు. ఆయనపై మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు కోడలు మురుగుడు లావణ్య పోటీలో ఉన్నారు. ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి బరిలో నిలిచారు. దీంతో ఇక్కడ పోటీ రసవత్తరంగా మారింది. తెనాలి నుంచి వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోటీలో ఉండగా, కూటమి నుంచి జనసేన పార్టీ తరఫున నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తున్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు టిడిపి టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన అను యాయులు అసంతృప్తితో ఉన్నారు. దీంతో, ఈ నియోజకవర్గంలో జనసేనకు టిడిపి నుంచి అసమ్మతి ఎదురవుతోంది. కాంగ్రెస్ నుంచి అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు.

కూటమిలో అలకలు...అసంతృప్తులు


● పొత్తుతో టిడిపికి మూడు అసెంబ్లీ, ఎంపీ స్థానం లాస్
● వైసిపిలో మూడు ఎమ్మెల్యే, ఎంపీ సిట్టింగ్‌ల మార్పు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2019 ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైసిపి విజయం సాధించింది. రానున్న ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు చోట్ల కొత్త వారిని వైసిపి బరిలో దించింది. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతిని మార్చి, ఆ స్థానాన్ని రాజకీయ సమీకరణల దృష్ట్యా రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుకు టికెట్ కేటాయించింది. ఈయన ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగుల నుంచి తన కుమార్తె ఈర్లె అనురాధకు టికెట్ కేటాయించారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గ టికెట్ మలసాల భరత్‌కుమార్‌కు కేటాయించి, గుడివాడను గాజువాక పంపించారు. పాయకరావుపేట వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభ సభ్యుడు కావడంతో, ఆయన స్థానంలో రాజాం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే కంబాల జోగులుకు పాయకరావుపేట టికెట్ ఇచ్చింది. యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు బరిలో వున్నారు. యలమంచిలి, మాడుగుల, అనకాపల్లి నియోజకవర్గాల్లో వైసిపికి సానుకూలంగా వుంది. పెందుర్తి, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేటలో ఇరు పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా వుంటుంది.

రాజీనామాల దాకా..

టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో అనకాపల్లి ఎంపీ టికెట్ కడపకు చెందిన సిఎం రమేష్‌కు బిజెపి కేటాయించింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడుచోట్ల జనసేన, నాలుగు స్థానాల్లో టిడిపి అభ్యర్థులు బరిలో వున్నారు. అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి నియోజకవర్గాల నుంచి జనసేన... నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట నుంచి టిడిపి అభ్యర్థులు పోటీలో వున్నారు. జనసేనకు కేటాయించిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టిడిపి నాయకుల్లో అసంతృప్తులు కొనసాగుతున్నాయి. జనసేనలోకి కొత్తగా వచ్చిన పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణకు టికెట్ ఇచ్చి, ఎంతోకాలంగా పనిచేస్తున్న నాయకులకు టికెట్ ఇవ్వకపోవడంపై జనసేన కార్యకర్తల్లో అసంతృప్తి వుంది. పెందుర్తి నుంచి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు పోటీచేయడంతో సీనియర్ టిడిపి నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అలిగారు. కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగావున్నారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శివశంకర్‌కు టికెట్ ఇవ్వకుండా, కొత్తగా పార్టీలో చేరిన రమేష్‌బాబుకు టికెట్ ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు అభ్యంతరం చెబుతున్నారు. అనకాపల్లి జనసేన టికెట్ కొణతాల రామకృష్ణకు ఇవ్వడంతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఆ నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పరుచూరి భాస్కరరావు మనస్థాపంతో జనసేనకు రాజీనామా చేశారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ టికెట్ కోల్పోయారు. ఎంతో ఆశతో టిడిపిలో చేరిన సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావుకు భంగపాటు తప్పలేదు. యలమంచిలి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావుకు ఈ ఎన్నికల్లో అవమానం జరిగింది. ఈ స్థానం నుంచి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ పోటీలో వుండడంతో సుదీర్ఘకాలంగా టిడిపిలో పనిచేస్తున్న నాగేశ్వరరావుకు చివరకు బాధ మిగిలింది. మాడుగుల టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావును మార్చే ఆలోచనలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వున్నారు. ఈ నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిజి కుమార్,మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు టికెట్ ఆశించారు. ప్రసాదరావుకు టికెట్ ఇవ్వడంపై గవిరెడ్డి అనుయాయల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. తాజా పరిస్థితుల రీత్యా ప్రసాదరావు బదులు గవిరెడ్డిని రంగంలోకి దించితే మంచిదన్న యోచనలో చంద్రబాబు వున్నారు. కాంగ్రెస్ నుంచి పాయకరావుపేట, మాడుగుల, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల్లో అభ్యర్థులు బరిలో వున్నారు.



సిఎం రమేష్‌పై మంత్రి

తనకు 40 శాతం ఓట్లున్న అనకాపల్లి పార్లమెంట్‌ను టిడిపి వదులుకొని, ఒక్క శాతం ఓట్లున్న బిజెపికి కేటాయించింది. కడపకు చెందిన సిఎం రమేష్‌ను బిజెపి ఎంపీ అభ్యర్థిగా ఇక్కడ నుంచి పోటీలో పెట్టాలన్న చంద్రబాబు వ్యూహం ఫలించింది. బిజెపికి కేటాయించడంతో తన తనయుడు విజయ్‌కు టికెట్ రాకుండా చేశారన్న అసంతృప్తితో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, నర్సీపట్నం టిడిపి అభ్యర్థి అయ్యన్నపాత్రుడు వున్నారు. సిఎం రమేష్‌ను కూటమి అభ్యర్థిగా బిజెపి బరిలో దించడంతో, ఆయనను ఢీ కొట్టకలిగిన మంత్రి ముత్యాలనాయుడును ఎంపీ అభ్యర్థిగా వైసిపి పోటీలో పెట్టింది. ఇండియా ఫోరంలో భాగంగా జిల్లాలో కాంగ్రెస్ కొన్ని నియోజకవర్గాల్లో పోటీకి సమాయత్తమవుతోంది.


1952 తొలి అసెంబ్లీ ఎన్నికలు - హంగ్

మనకు స్వాతంత్ర్యం వచ్చాక 1952లో దేశవ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇప్పటి తమిళనాడు ప్రాంతం, కేరళలోని మలబారు ప్రాంతం, మైసూరు రాష్ట్రం (నేటి కర్నాటక)లోని బళ్లారి, హొస్పేటు, సిరిగుప్ప తదితర ప్రాంతాలు, ఇప్పటి మన రాష్ట్రంగా పిలువబడే ఉమ్మడి 26 జిల్లాలు (అటూఇటూగా), ఒరిస్సా రాష్ట్రంలోని గంజాం జిల్లాతో కలిపి మద్రాసు రాష్ట్రంగా పిలవబడేది.

మద్రాసు రాష్ట్ర శాసనసభ ఎన్నికల చరిత్ర

1952 నాటి మద్రాసు రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్య 309. ద్విసభ్య నియోజకవర్గాలతో కలిపి 375 సీట్లు ఉండేవి. మన ఆంధ్ర ప్రాంతంలోని 13 జిల్లాల్లో 123 అసెంబ్లీ సీట్లు ఉండేవి. ద్విసభ్య నియోజకవర్గాలతో కలిపి 144 ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణా రాష్ట్రంలో ఉన్న భద్రాచలం ఆనాడు మన రాష్ట్రంలోనే తూర్పుగోదావరి జిల్లాలో ఉండేది. 1951 నాటి మద్రాసు రాష్ట్ర అసెంబ్లీలోని ద్విసభ్య స్థానాలతో కలిపి 375 స్థానాలకు ఎన్నికలు జరగ్గా, 367 సీట్లకు పోటీచేసిన భారత జాతీయ కాంగ్రెస్ 152 సీట్లు గెలిచి అధికారానికి ఆమడ దూరంలో నిలిచిది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్‌కు మరో 36 సీట్లు కావాలి. కమ్యూనిస్టు పార్టీ 62 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. అయితే కమ్యూనిస్టు పార్టీ 367 సీట్లకుగాను కేవలం 131 స్థానాలకు మాత్రమే పోటీ చేసి దాదాపు సగం స్థానాలను తెచ్చుకోగలిగింది. ఈ ఎన్నికల్లో ప్రత్యేకత ఏమిటంటే ఇండిపెండెంట్లు భారీ స్థాయిలో 667 మంది పోటీ చేసి 62 మంది గెలుపొందారు. ఈ ఎన్నికల్లో హంగ్ రావడంతో (ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాకపోవడంతో).. మంత్రివర్గంలో చేర్చుకునే షరతుతో పలు పార్టీలతో, ఇండిపెండెంట్లతో సంఘటన ఏర్పరిచి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్‌కు మద్రాసు రాష్ట్రంలో మాత్రం పూర్తి మెజారిటీ రాలేదు. ఆనాడు కమ్యూనిస్టులు కూడా కాంగ్రెస్‌పార్టీలో అంతర్భాగంగా ఉండి స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొనడమే దీనికి కారణం. అందువల్లే నాటి ప్రజలు పూర్తిగా కాంగ్రెస్ వైపు మొగ్గలేదు. స్వాతంత్రోద్యమంలో భాగస్వామ్యం వహించిన పార్టీలను కూడా గణనీయంగా ఎన్నుకున్నారు. గణనీయ సీట్లు సాధించిన కమ్యూనిస్టు పార్టీతోపాటు కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ, సోషలిస్టు పార్టీ, కృషికార్ లోక్ పార్టీ వంటి పార్టీలు కూడా ఈ ఎన్నికల్లో ప్రభావవంతమైన సీట్లు గెలుపొందాయి.


నాటి మద్రాసు రాష్ట్ర శాసనసభ


చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ)

1952 మద్రాసు శాసనసభలో పార్టీల బలాబలాలు

మొత్తం స్థానాలు - 309, ద్విసభ్యతో కలిపి - 375

పార్టీ	పోటీ చేసిన సీట్లు	గెలిచిన సీట్లు
కాంగ్రెస్	367	152
కమ్యూనిస్టు	131	62
ఇండిపెండెంట్లు	667	62
కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ	148	35
తమిళనాడు ట్రాన్స్‌పోర్టు	34	19
కృషికార్ లోక్ పార్టీ	63	15
సోషలిస్టు పార్టీ	163	13
సిడబ్ల్యుపి	13	6
ఎంఎల్‌పి	13	5
ఫార్వర్డ్‌బ్లాక్ (ఎంజి)	6	3
షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్	37	2
జెయుఎస్‌పి	9	1

ముఖ్యమంత్రిగా రాజాజీ, ప్రతిపక్ష నేతగా నాగిరెడ్డి

కొన్ని కమ్యూనిస్టేతర, ఇండిపెండెంట్ల మద్దతుతో.. స్వాతంత్ర్యానంతరం ఇండియన్ గవర్నర్ జనరల్‌గా పనిచేసిన రాజాజీ అని పిలవబడే చక్రవర్తి రాజగోపాలాచారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. ప్రతిపక్ష నాయకుడుగా ప్రఖ్యాత కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డి ఎన్నికయ్యారు. అయితే 1952 ఎన్నికల తరువాత మద్రాసు రాష్ట్రం ఒక్క సంవత్సరమే కొనసాగింది.

మద్రాసు శాసనసభలో ఆంధ్ర ప్రాంత పార్టీల బలాబలాలు

మొత్తం స్థానాలు - 123, ద్విసభ్య తో కలిపి - 141

కమ్యూనిస్టు	41
కాంగ్రెస్	40
కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ	20
ఇండిపెండెంట్లు	18
కృషికార్ లోక్ పార్టీ	15
సోషలిస్టు పార్టీ	6
షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్	1

1953లో ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు, ప్రతిపక్ష నేతగా నాగిరెడ్డి

1953లో మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకంగా ఆవిర్భవించింది. (అదే నేటి 26 జిల్లాలు గల ఆంధ్రప్రదేశ్) 1952 ఎన్నికలప్పుడు 12 జిల్లాల ఆంధ్రగా ఉండేది. నేటి ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా కూడా ఆనాడు ఆంధ్రలోనే కలిసి ఉండేది. ఇప్పటి విశాఖ జిల్లా ఆనాడు విజయనగరం జిల్లాలోనూ, ఇప్పటి ప్రకాశం జిల్లా ఆనాడు గుంటూరు జిల్లాలోనూ కలిసి ఉండేది. దీంతో మద్రాసు అసెంబ్లీకి ఆంధ్ర ప్రాంత 12 జిల్లాల నుంచి 1952 ఎన్నికల్లో ఎన్నికైన ఎమ్మెల్యేలతో కలిపి.. 1953లో కొత్త రాష్ట్రం, కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అలా మద్రాసు రాష్ట్రం నుంచి విభజించబడి కొత్తగా ఏర్పాటు చేసిన ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్‌కు మెజారిటీ రాలేదు. ఆంధ్ర రాష్ట్రం మొత్తం స్థానాలు 123 కాగా, ద్విసభ్య నియోజకవర్గాలతో కలిపి 141 సీట్లు ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీకి 41 స్థానాలు, కాంగ్రెస్ 40 స్థానాలు ఉన్నాయి. సాలూరు నుంచి గుంటూరు జిల్లా వరకూ కాంగ్రెస్‌కు పట్టుమని 15 సీట్లు కూడా రాలేదు. మొత్తంగా కాంగ్రెస్‌కన్నా కమ్యూనిస్టు పార్టీకి ఒక స్థానం అధికంగా వచ్చింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల్లో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నా 72 సీట్లు కావాలి. ఇరు పార్టీలకూ చెరో 30 సీట్ల వరకూ అవసరం. కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీకి 20 సీట్లు, ఇండిపెండెంట్లకు 18 సీట్లు, కృషికార్ లోక్ పార్టీకి 15, సోషలిస్టు పార్టీకి 6 సీట్లు ఉన్నాయి. దీంతో కమ్యూనిస్టేతర పార్టీలైన మిగతా అన్ని పార్టీలనూ కాంగ్రెస్ సంప్రదించి, ఆయా పార్టీలకు, ఇండపెండెంట్లకు మంత్రి పదవులిచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికల్లో ఇండిపెండెంట్లు కూడా గణనీయ సంఖ్యలో 18 మంది గెలు పొందారు.


తరిమెల నాగిరెడ్డి (1953 ప్రతిపక్ష నేత)

టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. మద్రాసు శాసనసభకు ఎన్నికైన కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డి ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో ఆయన మళ్లీ ఇక్కడ కూడా ప్రతిపక్ష నాయకుడుగా వ్యవహరించారు.

యు. రామకృష్ణ

సంపాదకీయం

పొమ్మనకుండా పొగ!

బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) భారత్‌లో తన ప్రసారాలను నిలిపివేయడం మీడియా రంగానికి మరో కుదుపు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌డిఐ నిబంధనలను మార్చడంతోపాటు గతంలో ఆ సంస్థ కార్యాలయాలపై దాడులు చేసిన పర్యవసానంగా జరిగిన పరిణామమిది. గుజరాత్ మారణకాండ వెనుక నేటి ప్రధాని, ఆనాటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ పాత్ర గురించిన డాక్యుమెంటరీని బిబిసి ప్రసారం చేయడమే కేంద్రం కక్షకు అసలు కారణం. ఏతావాతా పరిశీలిస్తే మోడీని లేదా సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా ఎవరైనా వాస్తవాలు వెల్లడిస్తే వారిని వేటాడడం, హింసించడమే కేంద్ర ప్రభుత్వం పరమ కర్తవ్యంగా పెట్టుకుందని, అందుకు నిబంధనాల చట్రాన్ని బిగిస్తుందనీ మరోసారి విదితమయ్యింది. బిబిసి కార్యాలయాలలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించడం, ప్రశ్నలు సంధించడం, వేధింపులు సాగించి సంవత్సరం కూడా పూర్తికాకముందే బిబిసి భారత్‌లోని తన న్యూస్‌రూమ్‌ను మూసేసింది. నలుగురు బిబిసి మాజీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన 'కలెక్టివ్ న్యూస్‌రూమ్' పేరిట ఏర్పడిన ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి బిబిసి ప్రచురణ లైసెన్సును అప్పగించింది. ఇలా అప్పగించడం ఓ అసాధారణమైన చర్య. అంతర్జాతీయంగా ప్రసార సేవలు అందిస్తున్న ఓ పబ్లిక్ సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఇది మన దేశ ప్రతిష్టకు మాయని మచ్చ.

బ్రిటన్ వెలుపల మన దేశంలోనే బిబిసి కార్యకలాపాలు పెద్ద ఎత్తున నడుస్తుండడం ప్రత్యేకించి పేర్కొనదగినది. 1940 మేలో ప్రసారాలను ప్రారంభించిన బిబిసి ఇండియా బ్యూరోలో ఇప్పుడు సుమారు 200 మంది పనిచేస్తున్నారు. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్లపై బిబిసి ఓ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజులకే గత సంవత్సరం ఫిబ్రవరిలో ఢిల్లీ, ముంబయిలోని ఆ సంస్థ కార్యాలయాలలో ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు, సోదాలు జరగడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేసినా ఆ సంస్థ మన దేశంలో తన కార్యకలాపాలను నిలిపివేయడానికి లేదా స్థాయి తగ్గించడానికి ఇష్టపడలేదు. ఉద్యోగాలలో కోత విధించలేదు. అదే సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు తీవ్రం కావడంతో గుక్కతిప్పుకోలేకపోయింది. దేశీయ డిజిటల్ మార్కెట్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) పరిమితి 26 శాతం మాత్రమేనని నూతన నిబంధనల్ని 2021లో కేంద్రం విధించింది. ఆ పరిమితి దాటిన కంపెనీలు తమ విదేశీ పెట్టుబడులను నియంత్రణలకు అనుగుణంగా తగ్గించుకోవాలి లేదా మూత వేసుకోవాల్సి ఉంటుంది. బిబిసి ఇండియాలో 99.9 శాతం ఎఫ్‌డిఐ కావడంతో ఆ కొత్త నిబంధన గుదిబండగా మారింది. ఈ నేపథ్యంలో విధిలేని పరిస్థితులలో కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవలసిరావడం విచారకరం. తాజా పరిణామాలపై బిబిసి న్యూస్ డిప్యూటీ సిఇఒ జోనాథన్ మన్రో 'భారత్‌లో బిబిసి మనుగడకు ఘన చరిత్ర ఉంది. ప్రేక్షకులకే తొలి ప్రాధాన్యత ఇచ్చాం. దానిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కలెక్టివ్ న్యూస్‌రూమ్ ఏర్పాటు దోహదపడుతుందని వ్యక్తం చేసిన ఆశాభావం నెరవేరుతుందని ఆకాంక్షిద్దాం. జర్నలిజంలో రాజీ పడబోమని, తమ వెనుక బిబిసి ఉన్నదని కలెక్టివ్ న్యూస్‌రూమ్ సిఇఒ రూపా ఝా ఆయన స్పష్టం చేయడం దానికి మరింత బలం చేకూరుస్తుంది.

మీడియా గొంతు నొక్కడం నరేంద్ర మోడీ ప్రభుత్వ నిత్యకృత్యంగా ఉంది. పాత్రికేయుల్ని జైళ్లలో కుక్కడం, స్వతంత్ర వార్తా సంస్థలు, పోర్టళ్లపై ఉపా వంటి రాక్షస చట్టాలను ప్రయోగించడం మనం చూస్తున్నాం. న్యాయస్థానాలు, అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలూ కొన్ని సందర్భాల్లో అభిశంసిస్తున్నా బిజెపి కేంద్ర ప్రభుత్వం నవ్విపోదురు గాక... అన్నట్టు వ్యవహరిస్తోంది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ ఇండెక్స్‌లో 180 దేశాల్లో భారత్ 161వ స్థానంలో ఉండడం సిగ్గుచేటు. ఈ దుస్థితి పోవాలంటే ప్రస్తుత కార్పొరేట్ మతతత్వ కూటమి పాలన అంతం కావలసిందేతప్ప మరో మార్గం లేదు. అందుకు ప్రజలంతా నడుం బిగించాలి.

మంచి మాట



కేంద్రం నుంచి రాష్ట్రాలకు, రాష్ట్రాల నుంచి స్థానిక స్వయం పాలనా సంస్థలకు అధికార బదలాయింపు జరగాల్సి వుంటుంది. స్థానిక సంస్థలకు చాలినన్ని వనరులను కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వాల విధి అన్నట్లు కేంద్రం ప్రవర్తిస్తున్నది. రాజ్యాంగ స్ఫూర్తికే ఇది విరుద్ధం. భారత రాజ్య వ్యవస్థ లోని మూడవ అంతస్తుకు నిధులను సమకూర్చడంలో రాష్ట్రానికి ఎంత బాధ్యత వున్నదో కేంద్రానికి కూడా అంతే బాధ్యత వున్నది.

- హరికిషన్ సింగ్ సూర్జిత్,

సిపి(ఐ)ఎం పూర్వ ప్రధాన కార్యదర్శి.

హిందూ రాజ్యం అంటే?



ప్రభాత్ పట్నాయక్

హిందూ రాజ్య స్థాపన లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి పని చేస్తోంది. ఈ హిందూ రాజ్యం అంటే ఏమిటి? ఏదో ఒక్క మతానికి మాత్రమే తక్కిన మతాలకన్నా అధిక ప్రాధాన్యతనిచ్చిన దేశాలు ప్రపంచంలో చాలానే ఉన్నాయి. వీటిని మత ప్రమేయం ఉండే రాజ్యాలని అంటాం. అంతమాత్రం చేత ఆ రాజ్యాల వర్గ స్వభావంలో అణు మాత్రమైనా తేడా రాదు. అంటే మత ప్రాతిపదికన ఒక రాజ్యం వర్గ స్వభావాన్ని నిర్ధారించలేం. నిజానికి అటువంటి రాజ్యాలు అనివార్యంగా భయోత్పాతాన్ని సృష్టించే నియంతృత్వ రాజ్యాలుగా, గుత్త పెట్టుబడిదారుల కోసం మాత్రమే పని చేసే రాజ్యాలుగా ఉంటాయి. మరీ ముఖ్యంగా ఆ గుత్త పెట్టుబడిదారీ శక్తులలో కొత్తగా బలపడిన శక్తుల సేవలో అవి పని చేస్తాయి. కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు జార్జి డిమిత్రోవ్ ఏడవ అంతర్జాతీయ మహాసభలో ఫాసిస్టు రాజ్యం గురించి ఈ విధంగా నిర్వచించాడు: "ద్రవ్య పెట్టుబడి శక్తులలో అత్యంత తిరోగామి స్వభావం కలిగిన, రాజ్య విస్తరణవాద స్వభావం కలిగిన తరగతుల భయోత్పాత నియంతృత్వమే ఫాసిజం". హిందూ రాజ్యం అంటే ఇటువంటి ఒక ఫాసిస్టు రాజ్యమే అని ఇప్పుడు వివరించబోతున్నాను.

హిందూ రాజ్యంగా ఏర్పడితే, అందులో అన్ని అధికారిక కార్యకలాపాలూ హిందూ దేవతల ఆరాధనలతో మొదలౌతాయి. అన్ని రహదారులకి, రైల్వే స్టేషన్లకి, నగరాలకి పాత, మధ్యయుగాల నుంచీ కొనసాగుతున్న పేర్లను మార్చి హిందూత్వ చిహ్నాల పేర్లు పెడతారు. విద్యా కార్యకలాపాలన్నీ సరస్వతీ వందనంతో మొదలౌతాయి. ప్రభుత్వ నిధులను సైతం వెచ్చించి మరెన్నో దేవాలయాలను నిర్మిస్తారు. కాని ఈ చర్యలేవీ సామాన్య హిందువు జీవితంలో ఏ చిన్నపాటి అభివృద్ధినీ తీసుకురాలేవు. టర్కీ పాలకుడు ఎర్డోగన్ దేశ రాజధాని ఇస్తాంబుల్‌లో ప్రసిద్ధి చెందిన హగియా సోఫియా కట్టడాన్ని ఒక మసీదుగా మార్చి తద్వారా ఇస్లామిక్ మనోభావాలను సంతృప్తిపరచడానికి పూనుకున్నాడు. కాని దాని వలన టర్కీలోని సగటు పౌరుడి జీవితంలో ఏ చిన్నపాటి మెరుగుదలా రాలేదు.

మనం ఇంకా మరికాస్త ముందుకు పోవచ్చు. ఇక్కడ ప్రస్తుత హిందూత్వ శక్తుల పాలనలోనే మనకున్న అనుభవాలను చూద్దాం. గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ చవిచూడనంత తీవ్ర నిరుద్యోగాన్ని ఇప్పుడు మనం చూస్తున్నాం. భారతదేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఎప్పటికప్పుడు పరిశీలించే సిఎంఐఇ సంస్థ లెక్కల ప్రకారం 2008-2019 మధ్య కాలంలో 5 లేదా 6 శాతంగా ఉంటూ వచ్చిన నిరుద్యోగం ప్రస్తుతం 8 శాతానికి పెరిగింది. అంటే హిందూత్వ శక్తుల పాలనలో ప్రభుత్వం నిరుద్యోగ పరిస్థితి క్షీణించకుండా అడ్డుకోవడంలో విఫలమైంది అని కనపడుతోంది. నిరుద్యోగాన్ని తగ్గించడంలో ప్రభుత్వం చేయగలిగింది ఏమీ లేదని స్వయంగా కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుడే బహిరంగ ప్రకటన చేశాడు! ఆ తర్వాత ఈ ప్రకటనను అతడు ఉపసంహరించుకున్నదీ లేదు. అతగాడి ప్రకటనతో తమకు సంబంధం లేదని ప్రభుత్వం అధికారికంగా ఏ ప్రకటనా చేసిందీ లేదు. అంటే అది అధికారిక ప్రకటనగానే భావించాలి. అంటే ప్రస్తుతం కార్మిక వర్గానికి అత్యంత సమస్యాత్మకంగా ప్రస్తుత దయనీయ పరిస్థితులలో ఉన్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తాను చేయగలిగింది ఏమీ లేదని ప్రభుత్వమే ప్రకటించిందన్నమాట.



హిందూ రాజ్యంగా ఏర్పడితే, అందులో అన్ని అధికారిక కార్యకలాపాలూ హిందూ దేవతల ఆరాధనలతో మొదలౌతాయి. అన్ని రహదారులకి, రైల్వే స్టేషన్లకి, నగరాలకి పాత, మధ్యయుగాల నుంచీ కొనసాగుతున్న పేర్లను మార్చి హిందూత్వ చిహ్నాల పేర్లు పెడతారు. విద్యా కార్యకలాపాలన్నీ సరస్వతీ వందనంతో మొదలౌతాయి. ప్రభుత్వ నిధులను సైతం వెచ్చించి మరెన్నో దేవాలయాలను నిర్మిస్తారు. కాని ఈ చర్యలేవీ సామాన్య హిందువు జీవితంలో ఏ చిన్నపాటి అభివృద్ధినీ తీసుకురాలేవు.

అంటే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగితే సామాన్య ప్రజల దుస్థితి కూడా కొనసాగుతుంది. దాని విషయంలో ప్రభుత్వం చేసేది ఏమీ ఉండబోదు. తప్పుడు లెక్కలతో అంచనాలు కట్టిన జిడిపి వృద్ధి రేటు ఎంత గొప్పగా పెరుగుతోందో టాం టాం చేసుకోవడం మాత్రం జరుగుతుంది. ఆ పేరు చెప్పి తమ ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రజా సంపదను దోచి పెట్టడాన్ని సమర్థించుకుంటుంది. సామాన్య ప్రజల దుర్భర పరిస్థితుల గురించి వాస్తవ పరిస్థితిని వెల్లడించే ప్రయత్నాలు చేసే వారిని ఆడిపోసుకుంటుంది. ఇప్పుడు హిందూత్వ శక్తుల ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వం తీరు ఇలాగుందంటే ఇక హిందూ రాజ్యం అంటూ ఏర్పడితే ఎలా ఉంటుంది? ఇప్పుడు ప్రభుత్వం సామాన్య ప్రజల జీవితాల భౌతిక అవసరాలను పట్టించుకోకుండా బేఖాతరుగా వ్యవహరిస్తున్నదే అప్పుడు ఏకంగా ప్రభుత్వ అధికారిక విధానం అయిపోతుంది. అలా వ్యవహరించాలంటే అటువంటి ప్రభుత్వం తప్పనిసరిగా నియంతృత్వ ప్రభుత్వమే అయి వుండాలి. అది ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించేది అయి వుండాలి.

ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం కూడా, అది ఆస్తిపర వర్గాల నాయకత్వంలో నడిచేది అయితే అక్కడ శ్రామిక వర్గం మీద పెట్టుబడిదారులు సాగించే వర్గ నియంతృత్వ పాలనే ఉంటుంది (దానర్థం ప్రజాస్వామిక ప్రభుత్వానికి, నియంతృత్వ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీ లేదు అని మాత్రం కాదు సుమా). ప్రజాస్వామ్య ప్రభుత్వమే అలా వ్యవహరించేటప్పుడు, ఇక సామాన్య ప్రజల పరిస్థితులు నానాటికీ దిగజారిపోతూ, వాటి గురించి ఏ మాత్రమూ పట్టించుకోని ప్రభుత్వాలు ఉన్నప్పుడు పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వం మీద తన పట్టు బిగించాలనుకుంటే ప్రజల హక్కుల్ని కాలరాయకా తప్పదు, ప్రజాస్వామ్య వ్యవస్థల్ని కొరగాకుండా చేయనూ తప్పదు.

గుత్త పెట్టుబడి ఆధ్వర్యంలో వ్యవహరించే ఒక వర్గ నియంతృత్వ సాధనంగా హిందూ రాజ్యం ఉంటుంది. ఇప్పుడు ఆ గుత్త పెట్టుబడిదారీ వర్గం నయా ఉదారవాద చట్రంతో మమేకమైపోయింది. ఇది శ్రామిక ప్రజల జీవితాలను మరింత దిగజారుస్తుంది. ఇప్పుడు ఆ నయా ఉదారవాద వ్యవస్థే మొత్తంగా సంక్షోభంలో కూరుకుపోయింది. అందుచేత తన పెత్తనాన్ని నిలబెట్టుకోడానికి అది నియంతృత్వంగా వ్యవహరించడం అనివార్యం, భయోత్పాతంతో సామాన్య ప్రజానీకాన్ని అదుపు చేయబూనుకోవడమూ అనివార్యం. హిందూ రాజ్యం ఏర్పడితే జరిగేది ఇదే.

హిందూ రాజ్యం ఏర్పరచాలనే ప్రాజెక్టుకు దాదాపుగా గుత్త పెట్టుబడిదారీ వర్గం యావత్తూ తమ మద్దతును ప్రకటించడం ఇందుకే. ఇక భయోత్పాతం సృష్టించడం అనేది మత ఘర్షణలను రెచ్చగొట్టడం, ఒక మతానికి చెందిన ప్రజలను మెజారిటీ మతస్తుల దృష్టిలో "శత్రువులు"గా, మన దేశానికి చెందని "బైటవారు"గా చిత్రించే ప్రచారం చేయడం, వారిపై ద్వేషభావాన్ని రెచ్చగొట్టేవిధంగా తప్పుడు ప్రచారాలు చేయడం వంటి రూపాలతో మొదలౌతుంది. హిందూ రాజ్యం అనేది ఈ ప్రక్రియను మరింత బలపరుస్తుంది.

"హిందూ ఆధిక్యత" అనే భావాన్ని, మరోపక్క భయోత్పాతాన్ని పెంచడంతోబాటు మూడవ పార్శ్వం కూడా హిందూ రాజ్యం చేపడుతుంది. సామాజిక అభివృద్ధి నిరోధక మార్పులను తీసుకురావడమే ఆ మూడవ పార్శ్వం. 20వ శతాబ్దంలో మనం రెండు సమాంతర ఉద్యమాలను చూశాం. ఒకటి సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం కాగా రెండవది కులాధిపత్య ప్రాతిపదికన నడిచిన భూస్వామ్య సమాజంలో వేల సంవత్సరాలపాటు అణచివేతకు, వివక్షకు గురైన సామాజిక తరగతుల విముక్తి కోసం సాగిన ఉద్యమం. మొదటి ఉద్యమంలో పాల్గొన్న వారందరూ రెండవ ఉద్యమానికి సానుభూతిగా వ్యవహరించారని చెప్పలేం కాని, ఈ రెండు ఉద్యమాలూ ఒకదానిని ఇంకొకటి బలోపేతం చేశాయి. సాధారణ ప్రజానీకం రెండింటినీ వేరు వేరుగా చూడలేదు. అలా రెండింటి మధ్యా సమన్వయ సంబంధం సాధించడంలో వామపక్ష శక్తులు కీలక పాత్ర పోషించాయి.

ఈ జంట ఉద్యమాల ఫలితంగా దేశంలో చాలా పెద్ద సామాజిక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ మార్పులు సంపూర్ణమైనవీ కావు, సమగ్రమైనవీ కావు. అవి బూర్జువా చట్ర పరిమితుల వరకే జరిగాయి. వాటిని దాటి ముందుకు పోలేకపోయాయి. అయినప్పటికీ జరిగిన మార్పు, పురోగతి గణనీయమైనది. అది ముఖ్యమైన ఒక ముందడుగు. దాని ప్రాముఖ్యతను ఒకే ఒక్క ఉదాహరణతో వివరిస్తాను.

20వ శతాబ్దం ప్రారంభంలో కేరళ ప్రాంతంలో అస్పృశ్యతతో బాటు "కంట పడకూడని" ఆచారం కూడా ఉండేది. అంటే ఒక అగ్ర కులస్తుడు ఒక తక్కువ కులస్తుడిని చూస్తే చాలు. అతడు మైలపడి పోతాడన్నమాట. అందుచేత అగ్రకులస్తుల కంటబడకుండా మెలగవలసిన బాధ్యత ఆ తక్కువ కులస్తులదే. అటువంటి స్థితిలో ఉండిన కేరళ రాష్ట్రంలో ఇప్పుడు మానవాభివృద్ధి సూచికలను పరిశీలిస్తే తక్కిన రాష్ట్రాల కన్నా, చాలా మూడవ ప్రపంచ దేశాల కన్నా మెరుగుగా ఉన్నాయి. కొన్ని విషయాలలో అభివృద్ధి చెందిన దేశాల సూచికలతో పోల్చదగ్గ స్థాయిలో ఉన్నాయి. అంటే సామాజిక మార్పు ఏ స్థాయిలో జరిగిందో మనం ఊహించవచ్చు. కేరళలో జరిగినంత స్థాయిలో కాకపోయినా, దేశంలో తక్కిన ప్రాంతాలలో కూడా సామాజిక పురోగతి తరతమ తేడాలతో కొనసాగింది.

ఇప్పుడు హిందూత్వ భావజాలం పైచేయి సాధించింది. దాని వెనుక అంతర్లీనంగా హిందూత్వ శక్తులు ఇచ్చిన హామీ ఒకటుంది. రాజకీయ, సామాజిక రంగాల్లో సాధించిన పురోగతిని ఆపి వెనక్కి తిప్పుతామన్నదే ఆ హామీ. అది నెరవేరడానికి ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీయడం చాలా అవసరం. రాజకీయంగా, సామాజికంగా వెనక్కి పోయే క్రమంలో లౌకిక తత్వాన్ని బలహీనపరచం ఒక్కటే చర్య కాదు. హిందూత్వ ఆధ్వర్యంలో అమలు జరిగే నయా ఉదారవాద విధానాలు ప్రభుత్వ రంగాన్ని బలహీనపరచడం కూడా ఒకటి. అదే విధంగా విద్యా విధానంలో తెస్తున్న మార్పులు కూడా ఉన్నాయి. ఇవన్నీ కలిసి సమాజంలో వెనుకబడిన తరగతులకు విద్య, ఉపాధి రంగాల్లో ఉన్న అవకాశాలను దెబ్బ తీస్తున్నాయి. ఇంతవరకూ జరుగుతున్న పురోగతి ఇప్పుడు వెనుక పట్టు పడుతోంది. దీనినే మనం సామాజిక తిరోగమనం అని అంటాం.

మాటలు ఒక్కోసారి చాలా మోసం చేస్తాయి. ఈ విషయంలో హిందూ రాజ్యానిది అందె వేసిన చెయ్యి. హిందూ రాజ్యం గురించి హిందూత్వ శక్తులు చేసే ప్రచారం ప్రకారం హిందూ రాజ్యం గనుక ఏర్పడితే అది హిందువుల విముక్తికి దారి తీస్తుంది. కాని వాస్తవం దానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. హిందూ రాజ్యం అనేది నయా ఉదారవాద చట్రంలో గుత్త పెట్టుబడిదారీ శక్తులు సంక్షోభంలో చిక్కుకున్న ఆర్థిక వ్యవస్థలో తమ స్వంత ప్రయోజనాలను కాపాడుకోడానికి ఉపయోగించే సాధనం. ఇది ఒక సామాజిక తిరోగమనానికి దారి తీసే రాజ్యం అవుతుంది. గత శతాబ్ద కాలంగా సాధించుకున్న విజయాలన్నింటినీ తిరగదోడి మళ్ళీ వెనక్కి సామాన్య ప్రజల్ని నెట్టివేస్తుంది. ఈ హిందూ రాజ్య స్థాపనను అడ్డుకోడానికి రైతాంగంతో కలిసి ఉద్యమించవలసిన చారిత్రిక కర్తవ్యం కార్మికవర్గం భుజ స్కందాలపై ఉంది.

(స్వేచ్ఛానుసరణ)

హిందూ రాజ్యం గురించి హిందూత్వ శక్తులు చేసే ప్రచారం ప్రకారం హిందూ రాజ్యం గనుక ఏర్పడితే అది హిందువుల విముక్తికి దారి తీస్తుంది. కాని వాస్తవం దానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. హిందూ రాజ్యం అనేది నయా ఉదారవాద చట్రంలో గుత్త పెట్టుబడిదారీ శక్తులు సంక్షోభంలో చిక్కుకున్న ఆర్థిక వ్యవస్థలో తమ స్వంత ప్రయోజనాలను కాపాడుకోడానికి ఉపయోగించే సాధనం. ఇది ఒక సామాజిక తిరోగమనానికి దారి తీసే రాజ్యం అవుతుంది. గత శతాబ్ద కాలంగా సాధించుకున్న విజయాలన్నింటినీ తిరగదోడి మళ్ళీ వెనక్కి సామాన్య ప్రజల్ని నెట్టివేస్తుంది.

గుజరాత్ అభివృద్ధిపై 'నమో' నోటికి తాళం?

విశ్లేషణ


సత్య

పదేళ్ల క్రితం గుజరాత్ తరహా అభివృద్ధిని దేశమంతటా అమలు జరుపుతామని ఎన్నికల సందర్భంగా మోడీ జనానికి ఇచ్చిన గ్యారంటీ గురించి ఎక్కడా ప్రస్తావించటం లేదు. గుజరాత్ విజయ గీతాలాపన లేదు. ఎందుకు? నరేంద్రమోడీ ప్రధానిగా అధికారంలోకి రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నివేదికలను రూపొందించటం, సిఫార్సులు చేయటం తప్ప వాటికి ఎలాంటి గ్యారంటీ లేని నీతి ఆయోగ్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. సదరు సంస్థ వెల్లడించిన సమాచారం 2019-21 సంవత్సరాలలో బహుముఖ దారిద్ర్య సూచికలో గుజరాత్ రాష్ట్రం 16వ స్థానంలో ఉంది. దశాబ్దాల తరబడి బిజెపి ఏలుబడిలో ఉన్న గుజరాత్ దారిద్ర్య నిర్మూలనలో వెనుకబడింది.

ఇక్కడ అభివృద్ధి అంటే పరిశ్రమల గురించి చెబుతారు. నరేంద్ర మోడీ సిఎంగా అధికారానికి రాక ముందే ఉమ్మడి బొంబాయి ప్రోవిన్స్‌లో నేటి గుజరాత్ ప్రాంతాలు పారిశ్రామికంగా ముందున్నాయి. పరిశ్రమలు ఉన్నంత మాత్రాన అభివృద్ధి చెందినట్లు కాదు. అలాగైతే అమెరికాలో ఇప్పటికీ మన ఉచిత బియ్యం పథకం మాదిరి ఉచిత ఆహార కూపన్లు ఉండేవి కాదు. గుజరాత్‌లో పరిశ్రమల వృద్ధికి అక్కడి భౌతిక పరిస్థితులే కారణం తప్ప మోడీ గొప్పతనం కాదు. రాష్ట్ర విస్తీర్ణంలో దాదాపు సగం ఎడారి ప్రాంతం గనుక అక్కడ వ్యవసాయానికి తావుండదు. మన దేశంలో ఇప్పటికీ ఉపాధి వ్యవసాయ రంగంలోనే ఉంది, అలాంటి అవకాశం అక్కడ ఉండదు. వాణిజ్య రంగంలో గుజరాతీల వలసలకు అదొక ప్రధాన కారణం. కచ్ ప్రాంతంలో ఉప్పు పండిస్తారు, అది ఏడాది మొత్తం ఉండదు. అందుకే గుజరాత్ ప్రాంతంలో స్వాతంత్ర్యానికి ముందు, తరువాత కూడా పరిశ్రమలు, వాణిజ్యం మీద కేంద్రీకరించారు. రేవులు ఒక పెద్ద వనరుగా ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందినప్పటికీ దారిద్ర్యంతో సహా అనేక అభివృద్ధి సూచికల్లో గుజరాత్ వెనుకబడి ఉంది. సృష్టించిన సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం అవుతున్నది తప్ప జనానికి చేరటం లేదు. గతంలో దారిద్ర్య నిర్మూలనలో గుజరాత్ కొన్ని రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉన్నప్పటికీ ఇటీవలి కాలంలో దిగజారుతున్నది.

రాజకీయ నేతలు అధికార పార్టీల ప్రాపకం కోసం పాకులాడినట్లే కొందరు మేధావులు కూడా అదేమాదిరి ఉన్నారు. అలాంటి వారిలో ఒకరైన ప్రొఫెసర్ వివేక్ దేవరాయ్ బుర్ర నుంచి పుట్టిందే "గుజరాత్ తరహా అభివృద్ధి నినాదం". మోడీ గుజరాత్ సి.ఎంగా నాలుగు వేల రోజుల పదవీకాలం పూర్తి కానుండగా తదుపరి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని "వృద్ధి, అభివృద్ధికి గుజరాత్ పాలన" అనే పుస్తకాన్ని రాశారు. తరువాత 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ దాన్ని ఒక నినాదంగా తీసుకొని తాను అధికారంలోకి వస్తే దేశమంతటా అదే విధానాన్ని అమలు చేస్తానని నమ్మబలికారు. దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా భక్తులకు తెలియదు. అదే మాదిరి గుజరాత్ గురించి తెలిసిన మోడీ ప్రధాని పీఠం అలంకరించిన తరువాత ఎక్కడా దాని ప్రస్తావన తేవటం లేదు. ప్రతి రాష్ట్రంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నపుడు ఒక రాష్ట్ర నమూనా ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తామని చెప్పటమే పెద్ద మోసం. పదేళ్ల నాటి అంకెలను తీసుకొని వివేక్ దేవరాయ్ గుజరాత్ పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యం భారీగా తగ్గిందని చెప్పారు. ఊట మాదిరి అభివృద్ధి ఫలాలు కిందికి దిగినట్లు సూత్రీకరించారు. పాత లెక్కల ప్రకారం చూస్తే కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్నపుడు దేశంలో ఏడవ స్థానంలో ఉన్న గుజరాత్ తరువాత కాలంలో దిగజారింది. దీన్ని బట్టి పరిశ్రమల వృద్ధి దారిద్ర్య నిర్మూలనకు దోహదం చేయదని కొందరు ఆర్థికవేత్తలు స్పష్టం చేశారు. ఆర్థిక స్వేచ్ఛలో గుజరాత్ మొదటి స్థానంలో ఉందని దేవరాయ్ చెప్పారు. అలాంటి రాష్ట్రం తాజా నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దారిద్ర్య నిర్మూలనలో 16వ స్థానానికి ఎందుకు దిగజారినట్లు ?

గుజరాత్‌లో ఎవరు అధికారంలో ఉన్నా కార్పొరేట్ కంపెనీలకు పెద్ద ఎత్తున పన్ను రాయితీలు, సబ్సిడీలు ఇచ్చారు. వాటిలో పని చేసే కార్మికులకు వేతనాలు తక్కువగా నిర్ణయిస్తున్నారు. ఉదాహరణకు బాగా వెనుకబడిన చత్తీస్‌గఢ్‌లో 2023 అక్టోబరు ఒకటి నాటికి అమల్లో ఉన్నట్లు ప్రకటించిన వేతనాల ప్రకారం నైపుణ్యం లేని కార్మికుడికి నెలకు రూ.12,623, నైపుణ్యం ఉన్నవారికి రూ.13,698 కాగా అభివృద్ధి చెందిన గుజరాత్ రెండింజన్ల పాలనలో రూ.12,012 నుంచి 12,298, నిపుణులైన వారికి రూ.12,558 నుంచి రూ.12,870 వరకు నిర్ణయించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఊడ్చి, శుభ్రం చేసే కార్మికులకు కనీస వేతనం ఏ జోన్‌లో రూ.19,136, బి జోన్లో రూ.16,016, సి జోన్లో రూ.12,844గా 2023 ఏప్రిల్ ఒకటి నుంచి అమలు జరుపుతున్నట్లు ప్రకటించింది. ఇదీ గుజరాత్ ఆదర్శం, నరేంద్ర మోడీ గారి అచ్చేదిన్. అందుకే గుజరాత్ కార్పొరేట్లు బలిశారు తప్ప కార్మికులు, ఇతరుల పరిస్థితి దిగజారుతోంది. మానవాభివృద్ధి సూచికలే దానికి పక్కా నిదర్శనం. కొన్ని వివరాలు (పట్టిక) ఎలా ఉన్నదీ చూద్దాం. వీటికి ఆధారం గ్లోబల్ డాటా లాబ్ వెబ్‌సైట్.



పైన పేర్కొన్న వివరాలను చూసినపుడు పారిశ్రామికంగా, వ్యవసాయకంగా వెనుకబడిన కేరళలో మానవాభివృద్ధి సూచికల కంటే పారిశ్రామికంగా వృద్ధి చెందిన గుజరాత్, మహారాష్ట్ర వెనుకబడి ఉన్నాయి. దీర్ఘకాలంగా బిజెపి ఏలుబడిలో ఉన్న మధ్యప్రదేశ్ స్థితినీ చూడవచ్చు.

సంక్షేమ పథకాలను అమలు జరిపితే రాష్ట్రాలు అప్పుల పాలవుతాయని నరేంద్రమోడీ పదే పదే వ్యతిరేకతను వెల్లడిస్తున్న సంగతి తెలిసిందే. అందుకే గుజరాత్‌లో అరవై ఏళ్లు దాటిన వారికి నెలకు వెయ్యి, 80 దాటితే రూ.1,250 మాత్రమే ఇస్తున్నారు. పోనీ గుజరాత్‌కు అప్పులు లేవా? 2024-25కు బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.4.26 లక్షల కోట్లకు, మరుసటి ఏడాది ఐదు లక్షల కోట్లకు చేరుతుందని వెల్లడించారు. 1995లో బిజెపి పాలన పది వేల కోట్ల అప్పుతో ప్రారంభమై ఈ స్థాయికి పెరిగింది. నరేంద్ర మోడీ సి.ఎంగా అధికారానికి వచ్చే నాటికి రూ.45,301 కోట్లు ఉండగా దిగిపోయే నాటికి రూ.2.21 లక్షల కోట్లకు పెరిగింది. 2016 నుంచి 2021 వరకు వార్షిక జిడిపి వృద్ధి రేటు కంటే రుణాల పెరుగుదల రేటు ఎక్కువగా ఉందని కాగ్ నివేదిక చెప్పింది. రెండు సంవత్సరాలకు ఒకసారి గుజరాత్ ప్రభుత్వం ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహిస్తున్నది. ఈ సదస్సులను నరేంద్ర మోడీ ప్రతిష్ట పెంచేందుకు ఉపయోగించారు. ఆహా..ఓహో...అన్నట్లుగా పెట్టుబడులు వచ్చినట్లు ఊదరగొట్టారు. గుజరాత్ మోడల్‌ను దేశమంతటా అమలు జరుపుతానని చెప్పేందుకు ఇది కూడా కారణమైంది. మోడీ ఏలుబడిలో 2003 నుంచి 2015 వరకు ఏడు సదస్సులు జరగ్గా 84 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందాలు జరిగినట్లు ప్రచారం చేశారు. 2017 సదస్సు సందర్భంగా నాటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జెఎన్ సింగ్ అప్పటి వరకు 61 వాస్తవ రూపం దాల్చినట్లు ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, గణాంకాల శాఖ నివేదిక ప్రకారం 2003-11 మధ్య కేవలం ఎనిమిది శాతమే అమల్లోకి వచ్చాయి. 2000 నుంచి 2016 వరకు మహారాష్ట్రలో 30 శాతం, గుజరాత్‌లో 10 శాతం మాత్రమే వాగ్దానాల్లో అమల్లోకి వచ్చాయి. విదేశీ పెట్టుబడులు మోడీ హయాంలోనే గుజరాత్‌కు తగ్గాయి. మూడు దశాబ్దాల బిజెపి, దానిలో 13 సంవత్సరాల నరేంద్ర మోడీ ఏలుబడిలో ఆరోగ్య తలసరి ఖర్చు దిగజారింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సమాచారం ప్రకారం 2020లో వేయి మందికి దేశంలో 0.55 ఆసుపత్రి పడకలుంటే గుజరాత్‌లో 0.33 ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బీహార్ కంటే తక్కువ ఉన్నాయి. పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటీకరించారు.

మానవాభివృద్ధి సూచీలో...				
ప్రాంతం	1990	2000	2010	2021
దేశం	0.434	0.491	0.575	0.633
గుజరాత్	0.474	0.521	0.599	0.638
కేరళ	0.550	0.593	0.709	0.752
మహారాష్ట్ర	0.498	0.552	0.638	0.688
మధ్యప్రదేశ్	0.407	0.453	0.531	0.596

నెలవారీ తలసరి వినియోగ ఖర్చు ఆ యా రాష్ట్రాల్లో జనం ఉన్న స్థితిని అంచనా వేసుకొనేందుకు ఒక అంశంగా తీసుకోవచ్చు. నరేంద్ర మోడీ గుజరాత్ సి.ఎంగా ఉన్న సమయంలో దేశ సగటులో ఉన్న వృద్ధి కంటే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కూడా గుజరాత్ వెనుకబడింది. పదేళ్ల రెండింజన్ల వృద్ధిని చూస్తే దేశ సగటుకు దగ్గరగా మాత్రమే ఉంది.

2003 నుంచి 2011-12 సంవత్సరాలలో దేశంలో సగటున వినియోగ ఖర్చు గ్రామీణ ప్రాంతాలలో 158, పట్టణ ప్రాంతాలలో 157 శాతం పెరిగింది. గుజరాత్‌లో 145, 146 శాతాలుగా ఉన్నాయి. కేరళ 2003లో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రథమ స్థానంలో ఉంది. 2011-12లో పట్టణాలలో హర్యానా ముందుండగా కేరళ రెండవదిగా ఉంది. 2022-23లో సర్వే ఫలితాలను బట్టి రెండింజన్ల పాలనలో ఉన్నవి లేని రాష్ట్రాల తీరు తెన్నులు పైవిధంగా ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు ఉన్న ప్రధాన రాష్ట్రాల వివరాలను ఎగువన చూశాము. ఎందుకని రెండింజన్ల పాలిత రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయి? బిజెపి చెప్పే మాటలు బూటకం, అభివృద్ధి నాటకం తప్ప వాస్తవం కాదని స్పష్టం కావటం లేదా ?

★

జనవాక్యం

పంచాంగాలు అబద్ధం

ఉగాది వచ్చిందంటే పంచాగ శ్రవణాల హోరు మొదలౌతుంది. అది వాళ్ళ వృత్తి. అందులో ఎలాంటి నిజం ఉండదు. వారు చెప్పేదానిలో ఎలాంటి శాస్త్రీయత లేదు. తొమ్మిదో తేదీ నుండి శుభకృతు సంవత్సరం పోయి క్రోధి సంవత్సరం మొదలౌతుంది. అంతకు మించి ఏమీ వుండదు. తిథులు, వారాలు, నక్షత్రాలు..ఇవన్నీ మన అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నాము. వీటికి అంతకు మించి ప్రత్యేకత ఏమీలేదు. అయితే ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఈ సందర్భంగా పంచాంగాల పేరుతో, మేము చెప్పేది ఇలా జరుగుతుంది అని చెప్పకుంటూ కొంతమంది పొట్ట పోసుకుంటూ ఉన్నారు. ఇక రాజకీయ నాయకులు వారివారి ఆస్థాన జ్యోతిష్కుల చేత పంచాంగం చెప్పించుకుంటారు. అధికారంలో ఉన్న వారికి మరలా మీరే అధికారం చేపడతారని, ప్రతిపక్షంలో ఉన్నవారికి మేకే అధికారం వస్తుందని పచ్చి అబద్దాలు చెప్పి నమ్మపలికిస్తారు. ఆగ్రహం ఈ రాశిలో ప్రవేశించింది, కనుక అరిష్టమని, అరిష్టం తొలగాలంటే శాంతి చేస్తే సరిపోతుందని వేలువేలు డబ్బు గుంజుతారు. అసలు రాసులే అబద్ధం. ఆకాశంలో కనిపించే నక్షత్రాలకీ, ఆ గుంపు ఏ ఆకారంలో కనిపిస్తే పలనా రాశి అని చెపుతారు. ఒక ప్రాంతంలో ఒక ఆకారంలో కనిపించే నక్షత్రాల గుంపు, ఇంకో ప్రాంతం నుండి చూస్తే ఇంకో ఆకారంలో కనిపిస్తుంది. ఇదెలా శాస్త్రీయం? గ్రహాల, నక్షత్రాల కదలికలను బట్టి మన జీవితాలు ఉండవు. మన జీవితాలు ఎలా వుండేది మనకు మాత్రమే తెలుసు. కనుక పంచాంగాలు నమ్మవద్దు. అవి అబద్ధం.

- నార్నె వెంకట సుబ్బయ్య

రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం

ప్రత్యేక హోదా ఊసు లేదు ● సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి



మాట్లాడుతున్న సినీ నటుడు నారాయణమూర్తి

ప్రజాశక్తి-పలాస

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని సినీ నటుడు, దర్శక, నిర్మాత ఆర్ నారాయణమూర్తి విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని 2014 ఎన్నికల్లో హామీనిచ్చిన ప్రధాని మోడీ, ఆ హామీని అమలు చేసేందుకు పదేళ్ల సరిపోలేదా అని ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, విశాఖ రైల్వే జోన్, ఇతర విభజన హామీలేవీ అమలు చేయకుండా మొండిచేయి చూపారని విమర్శించారు. రాష్ట్రానికి కొత్తగా ఏ ఇన్వెస్టోగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టారన్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు కావాల్సిన ముడిసరుకును కేటాయించకుండా నష్టాల బారిన పడేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో ఎంతోమంది మృత్యువాత పడుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు, రోగులకు మెరుగైన వైద్యానికి చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిడ్నీ వ్యాధి మూలాలను కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి, ఉద్దాన ప్రాంతానికి శుద్ధజలాలు అందించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారని చెప్పారు. సమావేశంలో డాక్టర్ వై కృష్ణమూర్తి, డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు, కిడ్నీ ఆస్పత్రి నెఫ్రాలజిస్టు బాలాజీ పాల్గొన్నారు.

త్వరలో సామ్‌సంగ్ నుంచి ఎఐ టివి

గురుగ్రామ్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ భారత్‌లో ఏప్రిల్ 17న నూతన శ్రేణి ఎఐ టివిలను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. జనరేటివ్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లలో ఎఐని పరిచయం చేయగా.. గృహోపకరణాల కోసం బెస్పోక్ ఎఐ ఫీచర్లను ప్రవేశపెట్టింది. సామ్‌సంగ్ నియో క్యూఎల్ఇడి సిరీస్, నియో క్యూఎల్ఇడి 4కె సిరిస్‌లో ఈ ఏడాది నుంచి ఎఐ పవర్డ్‌గా ఉంటాయని పేర్కొంది.

ఆధారాలున్నా అవినాష్‌ను కాపాడుతున్నారు

- అబద్దాల హామీలతో ప్రజలను మోసగిస్తున్న సిఎం జగన్
- బస్సుయాత్రలో వైఎస్ షర్మిల



బ్రహ్మంగారి మఠంలో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం (వైఎస్ఆర్ జిల్లా)

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలు ఉన్నా కడప ఎంపి అవినాష్ రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపాడుతున్నారని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారిమఠం, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరులో సోమవారం నాలుగోరోజు బస్సుయాత్రను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు, జగన్ పరిపాలనకు ఏ మాత్రమూ పొంతన లేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపి అవినాష్‌రెడ్డి నిందితుడని సిబిఐ తేల్చి చెప్పిందని, కాల్ రికార్డులు, గూగుల్ మ్యాప్స్, లావాదేవీలు ఉన్నట్లు పేర్కొందని తెలిపారు. అన్ని ఆధారాలున్నా అవినాష్‌ని జగన్ కాపాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టం జరిగితే రూపాయి కూడా పరిహారం రావడం లేదని, సబ్సిడీ డ్రిప్ వేసుకోవడానికి అవకాశం లేకుండా సబ్సిడీలు అన్నీ ఆపేశారని విమర్శించారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, మెగా డిఎస్‌సి వేస్తామని జగన్ హామీ ఇచ్చారని, కానీ, నాలుగున్నర సంవత్సరాలు నిద్రపోయి కేవలం ఆరు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. మూడు నెలల క్రితం నోటిఫికేషన్ ఇవ్వడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. సొంత బాబాయిని చంపిన నిందితులకే టికెట్ ఇస్తున్నారని, హంతకులు చట్ట సభలలో వెళ్లకూడదని పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించేందుకే ఎంపిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. న్యాయం కోసం పోరాటం ఒకవైపు హంతకులు మరోవైపు ఉన్నారని, ప్రజలు ఎవరిని గెలిపిస్తారో ఆలోచించాలన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత మాట్లాడుతూ మహిళ అంటే నారీశక్తి అని, తమను అలాగే పెంచారని చెప్పారు. తప్పుంటే తప్పని చెప్పే ధైర్యం ఉందని తెలిపారు. వివేకాను ఎవరు హత్య చేశారో అందరికీ తెలుసని, న్యాయం కోసం పోరాడుతున్నామని అన్నారు. భారీ మెజార్టీతో షర్మిలను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు పాల్గొన్నారు.



మీ కోసం

ఉగాది పచ్చడిలో మామిడి తురుము కాకుండా చిన్న చిన్న ముక్కలుగా వేస్తే పంటికి తగులుతూ చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

జీవితం సకల అనుభూతుల సమ్మేళనం. స్థితప్రజ్ఞత అలవరచుకోవడమే వివేకి లక్షణం.

ఉగాది వచ్చింది!

ఉగాది పండుగ వచ్చింది
షడ్రుచుల పచ్చడి తెచ్చింది
మామిడి తోరణాలు కట్టాము
కొత్త బట్టలను తొడిగాము

తాతయ్య వచ్చాడు
తేనె తీసుకొచ్చాడు
చిన్నాన్న వచ్చాడు
నారింజ తెచ్చాడు

పిన్నమ్మ వచ్చింది
వేప పూత తెచ్చింది
మేనత్త వచ్చింది
మిరియాలు తెచ్చింది

మామయ్య వచ్చాడు
మినప పప్పు తెచ్చాడు
అన్నయ్య వచ్చాడు
ఉప్పు తీసుకొచ్చాడు

అమ్మ, నాన్న వచ్చారు
అన్నిటిని కలిపారు
షడ్రుచుల పచ్చడిని
అందరము తిన్నాము!



- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77240



ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి ఆంగ్ల పదాలు ఇచ్చాం. అయితే, కొన్ని అక్షరాలు లేవు. వాటిని మీరు నింపండి.

నేను గీసిన బొమ్మ



తాటి నాగేంద్ర,
8వ తరగతి,
జడ్పీ బాలుర హైస్కూలు,
మైదుకూరు,
కడప జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కొత్త ఆశలు చిగురించే 'ఉగాది'

కోయిల రాగాలకు, కొత్త చివుళ్ల అందాలకు స్వాగతం పలికే వసంత వేళ.. ఉగాది జరుపుకుంటాం. చిగురించిన మోడులు కొత్త ఆశలను కలిగిస్తే, కోయిల రాగాలు మనసుని ఉల్లాసపరుస్తాయి. మోడు వారిన జీవితాల్లో వెలుగులు తప్పక నిండుతాయని ప్రకృతి చెప్పే గొప్ప సందేశాన్ని తీసుకొస్తుంది ఉగాది. జీవితమంటే సంతోషం, దు:ఖం, కష్టం, సుఖం, ఆనందం, విచారాల సమ్మేళనమని ఉగాది పచ్చడి రుచుల సాక్షిగా చెప్పే పండగ ఇది.

ప్రతి రోజూలాగే ఈ రోజు కూడా ఉంటుంది అనుకుంటే మనం పొరబడినట్టే. వేకువజామునే నిద్రలేచి ప్రకృతిని ఒక్కసారి చూస్తేగాని మనం ఇన్నాళ్లు కోల్పోయిన పరవశం అర్థం కాదు. వసంతానికి అంత శక్తి ఉంది కాబట్టే, ఎందరో కవులు, రచయితలు వసంతకాలాన్ని తమ కవితలతో, రచనలతో మరింత సుందరంగా అక్షరీకరించారు.

అంతా అయిపోయింది అన్న చోట– 'ఇంకా ఎంతో ఉంది' అని చాటి చెప్పే సందర్భాన్ని వసంతం గుర్తుకుతెస్తుంది. జీవితమంటే – శిశిరంలాంటి ప్రతికూలతతో పోరాడి.. వసంతం వంటి చైతన్యంలోకి ప్రయాణించటమని చాటి చెబుతుంది. శూన్యం ఆవరించింది అనుకున్నా, ఆశ కోల్పోకూడదన్న సంకేతం ఇస్తుంది వసంత కాలం. శిశిరం కమ్మేసిన సుషుప్తావస్థ నుంచి, వసంతమనే మేల్కొలుపుకు ఉగాది ఆరంభం.

ప్రకృతి పండగ..

ఉగాది అచ్చమైన, స్వచ్ఛమైన ప్రకృతి పండగ. మనది వ్యవసాయాధార దేశం. ఇక్కడ జరుపుకునే ప్రతి పండగ ప్రకృతి చుట్టూనే అల్లుకుంటుంది. ముఖ్యంగా వ్యవసాయ పనులు ప్రారంభించే శుభదినంగా ఉగాది రోజును జరుపుకుంటారు రైతన్నలు. ప్రాంతానికో పేరున్నా పరమార్థం మాత్రం ఒక్కటే అన్నట్లు సాగుతుంది.

పంచాంగం పేరుతో పక్కదారి..

ఇంత ప్రాశస్త్యమున్న ఉగాది పండగ రోజు పంచాంగ శ్రవణం పేరుతో ఎంతోమంది పెద్దలు భవిష్యత్తు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ఇదొక తంతు మాదిరిగానే ప్రతి ఏటా నడుస్తోంది. భూత, వర్తమాన కాలాల మీదే భవిష్యత్తు ఆధారపడుతుంది తప్ప, చేతి రాతల్లో, పంచాంగాల్లో, పుస్తకాల్లో లిఖించబడదు. ఇప్పుడేమో, చేతులు కట్టుకుని కూర్చొని, భవిష్యత్తు గురించి కలలు కనటం, బెంగపడడం, భయపడడం హాస్యాస్పదం కాక మరొకటి కాదు. కానీ ఇప్పుడు మనమంతా భవిష్యత్తు గురించి భయపడే కాలంలో ఉన్నాం. ప్రకృతిలో వచ్చిన పెను మార్పులు భవిష్యత్తుని అంధకారం చేస్తున్నాయి.

ఆవశ్యకత ముంచుకొచ్చింది..

'కాలాలు మూడు, రుతువులు ఆరు' అని బాల్యంలో అభ్యసించిన రోజులను ఈ రోజు మరోసారి నెమరువేసుకుంటారు ఎంతోమంది. బుజ్జాయిలకు, చిన్నారులకు పనికట్టుకుని ప్రకృతి పాఠాలు చెబుతారు చాలామంది. అయితే ఈ ఒక్కరోజే కాదు, ప్రతి రోజూ ప్రకృతి ఆవశ్యకతను చెప్పాల్సిన కాలం వచ్చింది. కాలాలు గతి తప్పి చాలా కాలమైంది. రుతువులు దిశ మార్చుకుని దశాబ్దాలు కావస్తోంది.



ప్రకృతిని కాపాడుకుంటూ, పర్యావరణాన్ని సంరక్షించాల్సిన బాధ్యతను ఈ ఉగాది మనముందుకు తెచ్చింది. యుద్ధాలు, వైరస్‌ల కంటే ప్రకృతి ప్రకోపం చాలా పెద్దది. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఏడాదంతా ఎండాకాలాన్ని తలపిస్తోంది. ప్రస్తుత కాలంలో 'వానలు కురిస్తే కుంభవృష్టి, లేకపోతే ఒక్క చుక్క రాలడం లేదు'. వర్షాకాలానికి, ఎండాకాలానికి, చలికాలానికి మధ్య ఉన్న అంతరం ఎప్పుడో చెరిగిపోయింది. కాలం కాని కాలంలో వానలు పడుతున్నాయి. వానాకాలంలో సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు.

మేల్కొలుపు కావాలి..

ప్రకృతి ఆవశ్యకతను చాటిచెప్పే ప్రతి పండగ, మనల్ని హెచ్చరిస్తూనే ఉంటుంది. ముందున్న కాలం మరింత జాగ్రత్తపడమని చెబుతుంది. ఉగాది పండగ ఆ వరుసలో ముందుంటుంది. ప్రకృతిలో వచ్చిన స్పష్టమైన మార్పులకు ఉగాది ప్రతిబింబం. ప్రకృతికి, మనిషికి దూరం పెరగకూడదు. ఎంత పెరిగితే అంత అనర్థం. అలాంటి అనర్థాలకు తావు లేని ప్రతిరోజూ వసంతాల ఉగాది అవుతుంది. పర్యావరణాన్ని హరించే ధోరణులు దారుణంగా పెచ్చుపెరిగితే – ఉగాది కూడా శిశిరంలోని శీతల చీకటి రాత్రిలాగానే మిగులుతుంది.

ఎన్నికల వేళ...

ఈ ఏడాది ఉగాదికి ఒక ప్రత్యేకత కూడా ఉంది. ఇప్పుడు మనం ఎన్నికల కాలంలో ఉన్నాం. ఏ పనికైనా మంచి, చెడుల విశ్లేషణ చాలా ముఖ్యం. రాష్ట్రాన్ని, దేశాన్ని పాలించే పాలకుల ఎన్నిక కూడా అంతే ముఖ్యం. పౌరులంతా చైతన్యవంతమై పాలకులను ఎన్నుకోవాలి. ప్రజల తరపున నిలబడే నాయకుడిని గుర్తించాలి. మన కులం వాడనో, మన మతాన్ని రక్షిస్తాడనో ఓటు వేయడం మాని, ప్రజలకు మేలు చేసే వారిని గెలిపించుకోవాలి. ఓటు అనే వజ్రాయుధం మీ చేతుల్లోనే ఉంది. సరైన నిర్ణయం మీ మస్తిష్కంలోనే దాగుంది. చైత్ర మాస ఆరంభమైన ఈ ఉగాది రోజున పౌరులంతా చైతన్యవంతమై నాయకులను ఎన్నుకోవాలి.

రుచులు నేర్పే గుణగణాలు..

ప్రలోభాలకు, ప్రగల్భాలకు లోబడకుండా ప్రకృతి నేర్పిన కమ్మని పాటతో కోయిల మనల్ని నిద్రలేపుతుంది. కోయిల గానమంత స్వచ్ఛతను మనమూ అలవర్చుకోవాలి. వేప పువ్వు చేదు నుండి చెడుని దూరం చేయాలి. చింతపండు పులుపు నుండి నిజాన్ని గ్రహించడం నేర్చుకోవాలి. మామిడి కాయ వగరు నుండి నాయకుల గుణగణాలను బేరీజు వేసుకోవాలి. ఉప్పు, కారం రుచుల నుండి పాలకుల పనితీరును అంచనా వేయాలి. బెల్లం తియ్యదనం నుండి ఏ నాయకుడు ప్రజలకు రక్షకుడిగా ఉంటాడో గ్రహించాలి.

ఈ ఉగాది పండగ రోజు ఇంటిల్లిపాది వసంతకాల ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తూ, ఎన్నికల వేళ చైతన్యంతో ముందుకు నడవాలని కోరుకుంటూ ఉగాది శుభాకాంక్షలు.

పచ్చడి పరమార్థం..

పండగలన్నీ పరమాన్నం, పిండివంటలతో ప్రారంభమైతే, ఉగాది పండగ మాత్రం షడ్రుచుల పచ్చడితో మొదలౌతుంది. తీపి, చేదు, కారం, ఉప్పు, పులుపు, వగరు కలబోతలో జీవిత పరమార్థాన్ని చాటిచెబుతుంది ఈ పచ్చడి. వేప పువ్వు, మామిడికాయ, కొత్త బెల్లం, కొత్త కారం, ఉప్పు, కొత్త చింతపండు సమపాళ్లల్లో కలగలపుకుని ఇంటిల్లిపాది ఆస్వాదించే పచ్చడి రుచి ఇదీ అని చెప్పలేము. ఆరు రుచుల ఉమ్మడి ఆస్వాదన ఉగాది పచ్చడి ప్రత్యేకత.




'పుష్ప 2 : ద రూల్' టీజర్



అల్లు అర్జున్ నటిస్తున్న 'పుష్ప:2 ది రూల్' చిత్రం నుండి తాజాగా టీజర్ విడుదలైంది. ఏప్రిల్ 8, అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. ఈ టీజర్‌లో అల్లు అర్జున్ గంగమ్మ జాతర గెటప్‌లో కనిపించారు. గంగమ్మ జాతరలో వచ్చే సన్నివేశంతో టీజర్ కట్ చేసిన విధానం.. అందరినీ ఆకట్టుకుంటోంది. అల్లు అర్జున్ చీరకట్టి.. కాలు వెనక్కి మడిచి పైట కొంగుని అందుకున్న కటింగ్ టీజర్‌లో హైలెట్‌గా చూపించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

'డియర్‌ఎక్స్' నిత్య



నిత్యామీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'డియర్‌ఎక్స్' చిత్రం నుండి ఫస్ట్ లుక్ విడుదలైంది. కోలీవుడ్ దర్శకురాలు కామిని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'బాస్క్ టైమ్ థియేటర్', 'పోప్టర్ మీడియా నెట్‌వర్క్' బ్యానర్‌లపై బిజిఎన్, ఆదిత్య అజయ్ సింగ్, రామ్కి సంయక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 8న నిత్యా మీనన్ పుట్టినరోజు సందర్భంగా ఈ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రానుంది. వినయ్ రాయ్, నవదీప్, ప్రతీక్ బబ్బర్, దీపక్ పరంబోల్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.



ఉత్తమ చిత్రంగా 'బలగం'కు ఉగాది పురస్కారం

ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'ఉగాది సినిమా పురస్కారాలు–2024 వేడుకలు ఆదివారం రాత్రి హ్యాపీ రిసార్ట్‌లో జరిగాయి. ఉత్తమ డైరెక్టర్ గా వేణు వెల్దండి (బలగం), ఉత్తమ క్యారక్టర్ ఆర్టిస్ట్‌గా అజయ్ ఘోష్ (మంగళవారం), ఉత్తమ హీరోగా ఆశిష్ గాంధీ (రుద్రాంగి), ఉత్తమ వెటరన్ డైరెక్టర్‌గా సి.ఉమామహేశ్వర రావు (ఇట్లు అమ్మ), ఉత్తమ సపోర్టింగ్ నటుడుగా కోయ కిషోర్, ఉత్తమ సపోర్టింగ్ నటిగా జయశ్రీ రాచకొండ, ఉత్తమ బాల నటిగా బేబీ నేహా, స్పెషల్ జ్యూరీ ఫీచర్ ఫిల్మ్ అక్షరంకు అవార్డులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ నుంచి తీసిన అన్ని సినిమాలకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి సత్కరించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షులు కొత్త బసిరెడ్డి, ప్రస్తుత ఏపీ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షులు ఎఎంరత్నం, మాజీ అధ్యక్షులు అంబటి మధుమోహన కృష్ణ, ఛాంబర్ సెక్రెటరీ జె.వి.మోహన్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ విజయవర్మ పాకలపాటి, జాయింట్ సెక్రటరీ జంగా చైతన్య, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం జరిగింది.



'డియర్' అందరినీ కట్టుకుంటుంది..

జివి ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ నటించిన ఫ్యామిలీ కామెడీ డ్రామా 'డియర్'. ఈ చిత్రానికి ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. నట్మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పథ్వీరాజ్ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని ఆంధ్రాలో విడుదల చేయనుండగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణలో విడుదల చేయనుంది. ఈ చిత్రం తమిళంలో ఏప్రిల్ 11న, తెలుగులో ఏప్రిల్ 12న విడుదలవుతోంది. తాజాగా చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. హీరో సందీప్ కిషన్, నిర్మాత నాగ వంశీ, దర్శకులు వెంకీ అట్లూరి, నందిని రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. 'డియర్ నా రెండో సినిమా. లాక్ డౌన్ సమయంలో ఈ కథ రాశాను. గురక పెట్టడం ప్రతి ఇంట్లో సమస్య. దీనిపై కథ రాయడం చాలా ఎక్సయిటింగ్‌గా అనిపించింది. నిర్మాతలకు ధన్యవాదాలు. ఐశ్వర్య రాజేష్ అద్భుతమైన నటి. కథ నచ్చి ఈ పాత్ర చేశారు. జివి ప్రకాష్ సూపర్ చాలా అద్భుతంగా తన పాత్రని చేశారు. ట్రైలర్‌కి వాయిస్ ఇచ్చిన హీరో నాగచైతన్య గారికి ప్రత్యేక ధన్యవాదాలు' అని చిత్ర దర్శకుడు ఆనంద్ రవిచంద్రన్ సినిమా విశేషాలు మాట్లాడారు.

రాజమండ్రికి గేమ్‌ఛేంజర్



హీరో రామ్‌చరణ్ దర్శకుడు శంకర్ కాంబినేషనల్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'గేమ్‌ఛేంజర్'. పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా పాన్‌ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. కియారా అడ్వాణీ కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముగింపు దశలో ఉంది. ఈనెల మూడోవారం నుంచి రాజమండ్రిలో కొత్త షెడ్యూల్ ప్రారంభంకానుందని చిత్రబృందం ప్రకటించింది. కొద్దిరోజులు అక్కడ చిత్రీకరణ పూర్తయ్యాక మిగతా పార్టు విశాఖపట్టణంలో తెరకెక్కించనున్నారు. ఈ షెడ్యూల్ దాదాపు 10 రోజులకుపైగా ఉండనున్నట్లు సమాచారం. ఇందులో చరణ్ రెండు కోణాలున్న పాత్రలో కనిపించనున్నారు. త్వరలో విడుదల తేదీని కూడా చిత్రబృందం ప్రకటించనుంది. మరోవైపు శంకర్ 'ఇండియన్–2' సినిమాలో కూడా బిజీగా ఉన్న విషయం తెలిసిందే. లైకా సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఎస్‌జె సూర్య, అంజలి, సునీల్ తదితరులు కీలకపాత్రధారులు.



విజయ్ చిత్రంలో ప్రశాంత్

తమిళ హీరో విజయ్ నటిస్తున్న 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' గోట్ చిత్రంలో మరో హీరో ప్రశాంత్ నటించబోతున్నారు. ఈ చిత్రంలో ప్రభుదేవా, అజ్మల్, నటి మీనాక్షీచౌదరి, స్నేహా, లైలా ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించిన ఈ సినిమాలో విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కథ నచ్చి విజయ్, ప్రభుదేవాతో కలిసి నటించటానికి అంగీకరించానని ప్రశాంత్ తెలిపారు.

కోల్‌కతాకు చెన్నై కళ్లెం

- జడేజా, దేశ్‌పాండే మాయ
- నైట్‌రైడర్స్‌పై ఏడువికెట్ల తేడాతో సూపర్‌కింగ్స్ ఘన విజయం



చెన్నై: కోల్‌కతా నైట్‌రైడర్స్ జైత్రయాత్రకు చెన్నై సూపర్‌కింగ్ కళ్లెం వేసింది. ఎంఎ చిదంబరం(చెపాక్) స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు ఏడు వికెట్ల తేడాతో కోల్‌కతాను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాను జడేజా, దేశ్‌పాండే కట్టడి చేయడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 137పరుగులు చేసింది. అనంతరం ఆ లక్ష్యాన్ని చెన్నై జట్టు 17.4ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి 141పరుగులు చేసి విజయం సాధించింది. బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడే కోల్‌కతా నైట్‌రైడర్స్‌లను జడేజా, దేశ్‌పాండే కట్టడి చేశారు. టాపార్డర్ బ్యాటర్లను జడేజా, లోయర్ ఆర్డర్ బ్యాటర్లను దేశ్‌పాండే పెవీలియన్‌లకు పంపారు. ఆ తర్వాత బ్యాటుతో దంచేసిన డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఓటమన్నదే ఎరుగని కోల్‌కతాను చిత్తుగా ఓడించింది. తమ కంచుకోటలో కోల్‌కతాకు ముచ్చెమటలు పట్టించిన సీఎస్కే 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. ఇంపాక్ట్ ప్లేయర్ శివం దూబే(28) ఎప్పటిలానే సిక్సర్లతో హోరెత్తించాడు. దీంతో, చెన్నై మూడో విజయం ఖాతాలో వేసుకుంది. స్వల్ప ఛేదనలో డిఫెండింగ్ చాంపియన్ చెన్నైకి షాక్. 27 పరుగుల వద్ద తొలి వికెట్ పడింది. వరల్డ్ కప్‌లో దంచికొట్టిన ఓపెనర్ రచిన్ రవీంద్ర(15) మరోసారి నిరాశపరిచాడు. వైభవ్ అరోరా బౌలింగ్‌లో భారీ షాట్ ఆడి చక్రవర్తికి క్యాచ్ ఇచ్చాడు. రచిన్ వికెట్ పడినా డారిల్ మిచెల్(3) జతగా గైక్వాడ్ ధాటిగా ఆడాడు. ఈ జోడీని విడదీసేందుకు అయ్యర్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (0) ఇన్నింగ్స్ తొలి బంతికే అవుట్ కాగా, సునీల్ నరైన్ 27, రఘువంశీ 24, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 34 పరుగులతో ఓ మోస్తరుగా రాణించారు. శ్రేయాస్ అయ్యర్ షార్ట్ పిచ్ బంతులు ఆడడంలో తన బలహీనతను ఈ మ్యాచ్ ద్వారా మరోసారి బయటపెట్టుకున్నాడు. అయ్యర్ వీక్ నెస్ తెలిసిన చెన్నై బౌలర్లు పదే పదే స్లో షార్ట్ బాల్స్ విసరగా, ఆ బంతులను ఆడేందుకు అయ్యర్ ఆపసోపాలు పడ్డాడు. చివరికి ఓ షార్ట్ బాల్ కే బలయ్యాడు. క్రీజులో ఉన్నంతసేపూ అసౌకర్యంగా కనిపించిన వెంకటేశ్ అయ్యర్ (3), రింకూ సింగ్ (9) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో తుషార్ దేశ్ పాండే 3, రవీంద్ర జడేజా 3, ముస్తాఫిజూర్ రెహ్మాన్ 2, మహీశ్ తీక్షణ 1 వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రవీంద్ర జడేజాకు లభించింది.

స్కోర్‌బోర్డు...

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)జడేజా (బి)తుషార్ దేశ్‌పాండే 0, నరైన్ (సి)తీక్షణ (బి)జడేజా 27, రఘువంశీ (ఎల్‌బి)జడేజా 24, శ్రేయస్ (సి)జడేజా (బి)ముస్తాఫిజూర్ 34, వెంకటేశ్ అయ్యర్ (సి)మిఛెల్ (బి)జడేజా 3, రమణ్‌దీప్ సింగ్ (బి)తీక్షణ 13, రింకు సింగ్ (బి)దేశ్‌పాండే 9, రస్సెల్ (సి)మిచెల్ (బి)దేశ్‌పాండే 10, అనుకుల్ రాయ్ (నాటౌట్) 3, సాల్ట్ (సి)రచిన్ రవీంద్ర (బి)ముస్తాఫిజుర్ 0, వైభవ్ అరోరా (నాటౌట్) 1, అదనం 13. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 137పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/56, 3/60, 4/64, 5/65, 6/112, 7/127, 8/135, 8/135

బౌలింగ్: దేశ్‌పాండే 4–0–33–3, ముస్తాఫిజుర్ 4–0–22–2, శార్దూల్ 3–0–27–0, తీక్షణ 4–0–28–1, జడేజా 4–0–18–3, రచిన్ రవీంద్ర 1–0–4–0

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ రవీంద్ర (సి)చక్రవర్తి (బి)వైభవ్ అరోరా 15, గైక్వాడ్ (నాటౌట్) 67, మిచెల్ (బి)నరైన్ 25, దూబే (బి)వైభవ్ అరోరా 28, ధోనీ (నాటౌట్) 1, అదనం 5. (17.4ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 141పరుగులు. **వికెట్ల పతనం:** 1/27, 2/97, 3/135 **బౌలింగ్:** స్టార్క్ 3–0–29–0, వైభవ్ అరోరా 4–0–28–2, అనుకుల్ రాయ్ 1.4–0–18–0, నరైన్ 4–0–30–1, చక్రవర్తి 4–0–26–0, ఆండీ రస్సెల్ 1–0–8–0

జకోవిచ్ మరో రికార్డు

36ఏళ్ల వయసులో టాప్‌ర్యాంక్‌లో నిలిచి ఫెదరర్ రికార్డు బ్రేక్



లాసన్నె: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఎటిపి) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో నొవాక్ జకోవిచ్ మరోసారి టాప్‌ర్యాంక్‌లో నిలిచి రికార్డు నెలకొల్పాడు. ఎటిపి సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సెర్బియాకు చెందిన 36ఏళ్ల నొవాక్ జకోవిచ్ మరోసారి అగ్రస్థానంలో నిలిచాడు. దీంతో అత్యధిక వయసులో టాప్ ర్యాంక్‌లోనిలిచి ఫెదరర్‌ను వెనక్కి నెట్టాడు. ఇక బెన్ షెల్టన్ క్లేకోర్ట్ టైటిల్‌ను చేజిక్కించుకొని 230 సంపాదించి తొలిసారి టాప్–15లో చోటు దక్కించుకున్నాడు. ప్రస్తుతం షెల్టన్ ఖాతాలో 2,490పాయింట్లు ఉన్నాయి. ఫైనల్లో షెల్టన్ 7–5, 4–6, 6–3తో డిఫెండింగ్ ఛాంపియన్ టియాఫోను చిత్తుచేశాడు. 2022లో షెల్టన్ 90వ ర్యాంక్‌లో ఉండగా.. రెండేళ్లలో అత్యుత్తమ ర్యాంక్ 14వ ర్యాంక్‌కు ఎగబాకడం విశేషం.

ఐపిఎల్‌లో నేడు

పంజాబ్ × సన్‌రైజర్స్

వేదిక: ఛండీగడ్; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	4	0	8	1.12
కోల్‌కతా	4	3	1	6	1.52
లక్నో	4	3	1	6	0.77
చెన్నై	5	3	2	6	0.66
సన్‌రైజర్స్	4	2	2	4	0.40
పంజాబ్‌కింగ్స్	4	2	2	4	-0.22
గుజరాత్	5	2	3	4	-0.79
ముంబయి	4	1	3	2	-0.70
బెంగళూరు	5	1	4	2	-0.84
ఢిల్లీ క్యాపిటల్స్	5	1	4	2	-1.37

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

కవితకు బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు (ట్రయల్ కోర్టు) మధ్యంతర బెయిల్ నిరాకరించింది. మధ్యంతర బెయిల్‌పై ఇడి చేసిన అభ్యంతరాలు, కోర్టులో పేర్కొన్న ఆధారాలు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. పిల్లల పరీక్షలకు సంబంధించిన ఆందోళనను పరిష్కరించడానికి తల్లినే సరైన ప్రత్యామ్నాయం అన్న 'బలవంతపు కారణం'తో కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని అభిప్రాయపడింది. అలాగే సెక్షన్ 45 (1) అనేది మైనర్లు, అమాయకులు, పలు నేరాల్లో బలిపశువులు, మోసపోయిన మహిళకు వర్తిస్తుందని, కానీ కవిత లాంటి ఉన్నత విద్యావంతురాలు ఈ కేసులో బలిపశువు అయినట్లు భావించడం లేదని పేర్కొంది. మధ్యంతర బెయిల్ మంజూరు విషయంలో స్కామ్‌లో కవిత ప్రమేయం, ఆమెకు వ్యతిరేకంగా సేకరించిన సాక్ష్యాలు, ఆమె ప్రవర్తనను పరిగణనలోకి తీసుకోవడం చాలా అవసరమని పేర్కొంది. మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్ కేసులో అరెస్టై తీహార్ జైళ్లో ఉన్న కవిత.. తన చిన్న కొడుకుకు 11వ తరగతి పరీక్షల నేపథ్యంలో తనకు అండగా ఉండేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ట్రయల్ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ఓటమి భయంతోనే ప్రతిపక్ష నాయకుల అరెస్టులు

- కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివ కుమార్

త్రిస్సూర్ : వివిధ రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులను అరెస్టు చేయడం వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓటమి భయాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ తెలిపారు. త్రిస్సూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం త్రిస్సూర్‌కు సమీపంలోని ఓల్లూర్‌లో ఎన్నికల సభలో శివకుమార్ మాట్లాడారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న యుడిఎఫ్ అభ్యర్థి కె. మురళీధరన్ తరపున ప్రచారం నిర్వహించారు. ఎన్‌డిఎ దేశంలో క్రమంగా బలహీన పడుతోందని అన్నారు. అందుకే ఎన్‌డిఎ అసురక్షిత భావనతో ఉందని, కాబట్టే వివిధ రాష్ట్రాల్లో ఏ పార్టీతో అయినా పొత్తుకు సిద్ధంగా ఉందని అన్నారు. కర్ణాటకతో జెడిఎస్‌తోనూ, బీహార్‌లో నితీష్‌కుమార్‌తోనూ, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపితోనూ పొత్తుపెట్టుకుందని విమర్శించారు.



సముద్రంలో పడవ మునిగి 94మంది మృతి

మొజాంబిక్ (ఆఫ్రికా) : కలరా భయంతో ప్రధాన భూభాగాన్ని వీడేందుకు పడవలో బయల్దేరిన ఆ పడవ సముద్రంలో మునిగిపోవడంతో 94 మంది చనిపోయారు. మరో 26 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన ఆఫ్రికాలోని మొజాంబిక్‌లో ఆదివారం చోటుచేసుకుంది.ప్రమాద సమయంలో పడవలో 130 మంది ఉన్నారు. అధిక సంఖ్యలో ప్రయాణికులను పడవలో ఎక్కించుకోవడమే ఈ ప్రమాదానికి కారణమని అధికారులు తెలిపారు..మృతుల్లో చాలా మంది చిన్నారులు ఉన్నట్లు చెప్పారు. సహాయక సిబ్బంది ఐదుగురిని ప్రాణాలతో రక్షించారని, మిగతా వారి కోసం గాలిస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో అత్యంత పేదదేశాల్లో ఒకటైన మొజాంబిక్‌లో అక్టోబర్ నుంచి దాదాపు 15,000 కలరా కేసులు నమోదయ్యాయి. 32 మరణాలు సంభవించాయి. ఎక్కువగా నంపులా ప్రావిన్స్ ప్రభావితమైంది. పడవ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

బిజెపి అభ్యర్థులపైనే అత్యధిక క్రిమినల్ కేసులు

- 41 శాతం స్థానాల్లో ముగ్గురు కంటే ఎక్కువ అభ్యర్థులపై కేసులు
- ఎడిఆర్ నివేదిక

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 19న తొలి దశ జరిగే 102 స్థానాల్లోని 42 స్థానాల్లో పోటీచేసే ముగ్గురు, అంతకంటే ఎక్కువ అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులు ఎదుర్కొంటున్న వారిలో అత్యధికులను బిజెపి బరిలో దింపడం గమనార్హం. ఈ విషయాన్ని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక వెల్లడించింది. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. సుమారు 1,625 మంది అభ్యర్థుల అఫిడవిట్లను ఎడిఆర్ పరిశీలించింది. వీరిలో సుమారు 16 శాతం మంది అంటే 252 మంది అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో 10 శాతం మంది అంటే 161 మంది తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఏడుగురిపై హత్యకేసులు, 19 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయి. 18 మంది అభ్యర్థులు మహిళలకు వ్యతిరేకంగా నేరాలు కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో ఒకరు అత్యాచార కేసు ఎదుర్కొంటున్నారు. 35 మంది అభ్యర్థులు విద్వేష ప్రసంగం కేసులు ఎదుర్కొంటున్నారని ఎడిఆర్ నివేదిక తెలిపింది. తొలి దశ జరిగే 102 స్థానాల్లోని 42 లేదా 41 శాతం



తమిళనాడులోని శివగంగ బిజెపి అభ్యర్థి దేవనాథన్ యాదవ్

స్థానాలు 'రెడ్ ఎలర్ట్' నియోజకవర్గాలు అని నివేదిక వెల్లడించింది. పోటీ చేసే అభ్యర్థుల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువమంది అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటుంటే ఆయా నియోజకవర్గాలను రెడ్ ఎలర్ట్ నియోజకవర్గాలుగా పేర్కొంటారు.

పార్టీల వారీగా చూసుకుంటే బిజెపి అభ్యర్థులపైనే అత్యధికంగా క్రిమినల్ కేసులున్నాయి. ఆ పార్టీ తరపున పోటీలో ఉన్న 77 మందిలో 28 మంది అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ నుంచి 19 అభ్యర్థులు (మొత్తం 56 మంది) అభ్యర్థులు, ఆర్‌జెడి నుంచి పోటీలో ఉన్న నలుగురు అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. డిఎంకె మొత్తం 22 మంది అభ్యర్థుల్లో 13 మంది క్రిమినల్ కేసుల్లో ఉన్నారు. ఎస్‌పి నుంచి ముగ్గురు (మొత్తం ఏడుగురు అభ్యర్థులు), టిఎంసి నుంచి ఇద్దరు (మొత్తం ఐదుగురు), క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఎఐఎడిఎంకె నుంచి 13 మంది (మొత్తం 36 మంది అభ్యర్థులు), బిఎస్‌పి నుంచి 11 మంది (మొత్తం 86 మంది) అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

28 శాతం మంది కోటీశ్వరులే

తొలిదశలో పోటీ చేసే అభ్యర్థుల్లో 28 శాతం మంది కోటీశ్వర్లు (కోటి రూపాయల కంటే ఎక్కువ ఆస్థి ఉన్నవారు) అని ఎడిఆర్ నివేదిక తెలిపింది. అభ్యర్థుల సగటు ఆస్థి రూ.4.51 కోట్లుగా తెలిపింది. బిజెపి నుంచి పోటీలో ఉన్న 69 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. కాంగ్రెస్ నుంచి 49 మంది అభ్యర్థులు, ఆర్‌జెడి ప్రకటించిన నలుగురు అభ్యర్థులు, ఎఐఎడిఎంకె నుంచి పోటీలో ఉన్న 35 మంది, డిఎంకె నుంచి పోటీలో ఉన్న 21 మంది అభ్యర్థులు, టిఎంసి నుంచి నలుగురు, బిఎస్‌పి నుంచి 18 మంది అభ్యర్థులు కోటీశ్వరులు.

కాంగ్రెస్ నుంచి ఛింద్వారా (మధ్యప్రదేశ్) నుంచి పోటీలో ఉన్న నకుల్ నాథ్ రూ.716 కోట్ల ఆస్థితో అభ్యర్థుల్లో అందరి కంటే ధనవంతుడుగా నిలిచారు. ఈరోడ్ (తమిళనాడు) నుంచి పోటీలో ఉన్న ఎఐఎడిఎంకె అభ్యర్థి అశోక్ కుమార్ రూ. 662 కోట్ల ఆస్థితో రెండోస్థానంలో ఉన్నారు. తమిళనాడులోని శివగంగ నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి దేవనాథన్ యాదవ్ రూ.304 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు.

మోడీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

- ఇసికి కాంగ్రెస్ ఫిర్యాదు
- మరో అయిదు అంశాలపై కూడా..



న్యూఢిల్లీ : తమ ఎన్నికల మ్యానిఫెస్టోను ముస్లిం లీగ్‌తో పోల్చుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఆ పార్టీ సోమవారం ఫిర్యాదు చేసింది. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సల్మాన్ ఖుర్షిద్, పవన్ ఖేరా, ముకుల్ వాస్నిక్, గురుదీప్ సపాల్‌తో కూడిన ప్రతినిధి బృందం కేంద్ర ఎన్నికలసంఘం అధికారిని కలిసి ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు. యూనివర్సిటీల్లో ప్రధాని మోడీ హోర్డింగ్‌లు ప్రదర్శించడం, ఎన్నికల ప్రచారంలో సాయుధ బలగాలను వినియోగించడం, కేంద్ర మంత్రి, తిరువనంతపురం బిజెపి అభ్యర్థి రాజీవ్ చంద్రశేఖర్, మరి కొందరు బిజెపిఅభ్యర్థులు దాఖలు చేసిన తప్పుడు అఫిడవిట్ల గురించి మొత్తం ఆరు అంశాలపై వారు ఫిర్యాదు చేశారు.

ప్రధాని నరేంద్ర మోడీ షహరాన్‌పూర్‌లో ఓ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ విడుదల చేసిన ఎన్నికల ప్రణాళిక స్వాతంత్ర్యానికి ముందు జిన్నా ముస్లిం లీగ్ ఏ భావజాలాన్ని కలిగివున్నారో వాటినే రుద్దేదిగా ఉందని, దేశాన్ని ముక్కలు చేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందంటూ నోరు పారేసుకున్నారు. మ్యానిఫెస్టోలో రెండో భాగం కమ్యూనిస్టులు, వామపక్షాల ఆలోచనల ప్రాబల్యం ఉందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం తెలియజేసింది. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీల్లో ప్రధాని మోడీ ఫోటోలు, పెద్ద పెద్ద కటౌట్లు ప్రదర్శించడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై చర్యలు తీసుకోవాలని ఇసిని కోరింది. ఇసి అధికారులతో భేటీ అనంతరం కాంగ్రెస్ నేత పవన్ ఖేరా మాట్లాడుతూ, ఆరు అంశాలపై ఎన్నికల సంఘానికి తాము ఫిర్యాదు చేశామని, వీటిలో రెండు ఫిర్యాదులు ప్రధాని మోడీ, బిజెపి చేసిన వ్యాఖ్యలకు సంబంధించినవేనని తెలిపారు. మిలటరీ యూనిఫారంలో వున్న ప్రధాని ఫోటోలను ఎన్నికల ప్రచారం సందర్భంగా వాడడం ఎన్నికల నిబంధనావళికి విరుద్ధమన్నారు. ఢిల్లీ వర్శిటీకి చెందిన వివిధ కాలేజీల్లో "వికసిత్ భారత్ ఎట్ 2047 : వాయిస్ ఆఫ్ యూత్ క్యాంపెయిన్" బ్యానర్ కింద ప్రధాని నిలువెత్తు బ్యానర్లు, కటౌట్లను పెట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నిరసించింది. ప్రభుత్వ నిధులతో పెట్టే హోర్డింగ్‌లను రాజకీయ పార్టీలు ఉపయోగించుకోరాదని పేర్కొంది. అలాగే మంత్రులు, ఇతర రాజకీయ నేతల ఫోటోలు కాలేజీలు, ప్రభుత్వ భవనాల ఆవరణలో వుండరాదని పేర్కొంది. కేరళ స్టోరీ చిత్రాన్ని ఏప్రిల్ 5న దూరదర్శన్‌లో ప్రసారం చేయడాన్ని ఖండిస్తూ ఇచ్చిన ఫిర్యాదును కూడా ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఎన్నికల నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న ప్రధాని మోడీపైన, బిజెపి పైన చర్య తీసుకోవాలని ఇసిని తాము కోరినట్లు చెప్పారు.

కర్ణాటకలో నగదు ప్రవాహం

- ఎన్నికల ముందు రూ.5 కోట్ల డబ్బు స్వాధీనం
- 106 కిలోల నగలు కూడా..

న్యూఢిలీ : లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటకలో నగదు ప్రవాహం విచ్చలవిడిగా జరుగుతున్నది. సోదాల్లో భాగంగా పోలీసులు బళ్లారిలోని కంబళి బజార్‌లోని హేమ జ్యువెలర్స్ దుకాణం యజమాని ఇంటిపై దాడి చేశారు. ఇందులో భాగంగా వారి నుంచి రూ.5.60 కోట్ల నగదు, 3 కిలోల బంగారం, 103 కిలోల వెండి ఆభరణాలు, 68 వెండి కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.7.6 కోట్లుగా ఉంటుందని తెలుస్తున్నది. నగల దుకాణం యజమాని నరేష్ సోనీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు హవాలా లావాదేవీకి సంబంధించినవిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఎన్నికలకు కొన్ని రోజుల ముందే బళ్లారిలో ఇంత పెద్ద మొత్తంలో నగదు, బంగారు, వెండి ఆభరణాలు బయటపడటంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. ఇటీవల బిజెపిలో చేరిన గాలి జనార్ధన్, ఆయన కుటుంబం ప్రభావం బళ్లారిలో అధికంగా ఉంటుందనీ, అధికారులు మాత్రం ఇక్కడ ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

వాతావరణ మార్పులపై పోరాటం ప్రాథమిక హక్కు

- సుప్రీం రూలింగ్
- పరిశుభ్రమైన వాతావరణ కొరవడితే పలు హక్కుల ఉల్లంఘనలకు దారి తీస్తుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ : వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని రాజ్యాంగంలో ప్రత్యేక ప్రాథమిక హక్కుగా, మానవ హక్కుగా సుప్రీం కోర్టు గుర్తించింది. "వాతావరణ మార్పుల వల్ల సంభవించే దుష్ప్రభావాలపై పోరాడేందుకు ప్రజలకు హక్కు వుందని ఇంకా స్పష్టంగా వ్యక్తీకరించాల్సి వుంది. బహుశా ఈ హక్కు, అలాగే పరిశుద్ధ పర్యావరణ హక్కు ఈ రెండూ కూడా ఒకే నాణానికి రెండు కోణాలు వంటివి కావడం ఇందుకు కారణం కావచ్చు. ఏటికేడాది వాతావరణ మార్పుల వల్ల కలిగే విధ్వంసం, నష్టం పెరిగిపోతోంది. అందువల్ల దీన్ని ప్రత్యేక హక్కుగా నిర్ధారించాల్సిన అవసరం నెలకొంది. రాజ్యాంగంలోని 14వ అధికరణ (సమానత్వ హక్కు), 21వ అధికరణ (జీవన హక్కు)లు దీన్ని గుర్తించాయి." అని సుప్రీంకోర్టు ఈ నెల 6న విడుదల చేసిన ఒక తీర్పులో వ్యాఖ్యానించింది.

అంతమవుతున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పిట్ట) జాతుల మనుగడకు సంబంధించిన కేసులో ఇచ్చిన తీర్పు సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

ఈ బస్టర్డ్ జాతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని వేయాలంటూ మార్చి 21న బహిరంగ కోర్టులో ఆదేశాలు జారీ చేసింది. గుజరాత్, రాజస్థాన్‌ల్లో ప్రకృతిసిద్ధమైన వీటి ఆవాసాలోకి విమాన మార్గాలు, విద్యుత్ పంపిణీ లైన్లు రావడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఈ కేసుపై తదుపరి విచారణ ఆగస్టుకి వాయిదా వేశారు. అయితే గత వారాంతంలో కోర్టు ప్రకటించని ఈ తీర్పును తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ తీర్పులో పలు పేరాగ్రాఫ్‌లు వాతావరణ మార్పులు, దాని ప్రతికూలతలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి.

పరిశుద్ధమైన, సుస్థిర పర్యావరణం లేనిదే జీవన హక్కు, సమానత్వ హక్కు పూర్తిగా సాకారమవలేవని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. వాతావరణ మార్పులు, పర్యావరణ క్షీణత వల్ల తీవ్రమైన ఆహార కొరత, నీటికొరతలు ఏర్పడితే వాటివల్ల సంపన్నులు కన్నా నిరుపేదలు ఎక్కువగా ఇబ్బందులు పడతారని తీర్పు వ్యాఖ్యానించింది. ఆ రకంగా వాతావరణ మార్పులకు, వివిధ మానవ హక్కులకు అంతర సంబంధం వుందని కోర్టు పేర్కొంది. ఆరోగ్య హక్కు, ఆదివాసీల హక్కులు, లింగ సమానత్వం, అభివృద్ధి హక్కు వంటివి పలు హక్కులు దీనితో ముడిపడి వుంటాయని పేర్కొంది. వాతావరణ మార్పులకు సంబంధించి ఎలాంటి రుగ్మతలు లేని ఆరోగ్యకరమైన వాతావరణం ప్రతి ఒక్క మానవుని ప్రాథమిక హక్కు, మానవ హక్కు అని స్పష్టం చేసింది. ఆరోగ్య పర్యావరణానికి సంబంధించిన హక్కు ఉల్లంఘించబడితే ఆ ప్రభావం అనేక హక్కులపై పడుతుందని, జీవన హక్కు, వ్యక్తిగత సమగ్రత, ఆరోగ్యం, నీరు, గృహ నిర్మాణం, సమాచార హక్కు, భావ వ్యక్తీకరణ హక్కు, ప్రాతినిధ్య హక్కు ఇలా ప్రతి ఒక్కదానిపైనా పడుతుందని కోర్టు పేర్కొంది. అసమానమైన ఇంధన అవకాశాలు మహిళలను, బాలికలను తీవ్రంగా దెబ్బతీస్తాయని, ఎలాంటి జీతం బత్తెం లేని ఇళ్లల్లో పనులకు ఎక్కువ సమయం ఖర్చు పెట్టడం వల్ల వారి బాధ్యతలు కూడా పెరుగుతాయని పేర్కొంది. వాతావరణ మార్పుల వల్ల తలెత్తే సమస్యలను కట్టడిచేసేందుకు కోర్టు ఒక సూచన కూడా చేసింది. సౌర విద్యుత్ పాత్ర ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. భారత్ తక్షణమే సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించింది.

ఇందుకు మూడు కారణాలను పేర్కొంది. ఒకటి, రాబోయే రెండు దశాబ్దాల్లో అంతర్జాతీయంగా పెరగనున్న ఇంధన డిమాండ్‌లో భారత్ వాటా దాదాపు 25శాతం వుండొచ్చునని పేర్కొంది. రెండోది, విచ్చలవిడిగా వాయు కాలుష్యంతో పరిశుద్ధమైన ఇంధన వనరులు అవసరమవుతున్నాయని అంది. తగ్గుతున్న భూగర్భ జలాలు, క్షీణిస్తున్న వార్షిక వర్షపాతం మూడో కారణమని పేర్కొంది.

కాల్పుల విరమణ చర్చల్లో స్వల్ప పురోగతి ?

- దక్షిణ గాజా నుండి వైదొలగుతున్న ఇజ్రాయిల్ బలగాలు

గాజా : దక్షిణ గాజా నుండి తమ బలగాలన్నీ వైదొలగుతున్నాయని ఇజ్రాయిల్ ప్రకటించిన నేపథ్యంలో కైరోలో జరుగుతున్న కాల్పుల విరమణ తాజా విడత చర్చల్లో స్వల్ప పురోగతి వున్నట్లు ఈజిప్ట్ అధికారులు తెలిపారు. గాజాలో కాల్పుల విరమణకు, బందీల విడుదలకు సంబంధించి పురోగతి చోటు చేసుకుందని, ఒప్పందంలోని మౌలిక అంశాలపై సంబంధిత పక్షాలు అంగీకారానికి వచ్చాయని చెప్పారు. ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఈజిప్ట్ టివి సోమవారం ఈ విషయాలు తెలిపింది. ఈ చర్చల్లో హమాస్, ఇజ్రాయిల్ ప్రతినిధి బృందాలతో పాటూ సిఐఎ చీఫ్ బిల్ బర్న్స్, కతార్ విదేశాంగ మంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు. చర్చల అనంతరం హమాస్, కతార్ అధికారులు కైరో నుండి వెళ్లిపోయారు. రెండు రోజుల్లో తిరిగి వస్తామని చెప్పారు. గతేడాది అక్టోబరు 7 దాడి తర్వాత హమాస్ 253మందిని బందీలుగా పట్టుకుంది. వారిలో 129మంది బందీలుగా వున్నారు. మిగిలిన వారు జీవించి లేరు. ఆరు మాసాలుగా జరుగుతున్న ఈ యుద్ధంలో 33 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. 75వేల మందికి పైగా గాయపడ్డారు. జనవరి వరకు గాజాలో నాలుగైదు బెటాలియన్లతో అంటే దాదాపు 50 వేల మంది సైనికులతో ఇజ్రాయిల్ యుద్ధం చేస్తూ వచ్చింది. ప్రస్తుతం గాజాలో ఒక బెటాలియన్‌ను వుంచి మిగిలిన వారిని ఉపసంహరిస్తున్నామని ఐడిఎఫ్ తెలిపింది. ఆ ఒక్క బెటాలియన్ భద్రతా జోన్‌కు కాపలాగా వుంటారు. అంటే ప్రస్తుతం దక్షిణాదిన రాఫాలో మకాం వేసిన నిర్వాసితులైన పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ అనుమతి లేకుండా తిరిగి ఉత్తర గాజాకు వెళ్లడానికి వీలు వుండదు. ఖాన్ యూనిస్ నగరం నుండి తమ బలగాలు వైదొలగాలని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ సోమవారం తెలిపారు. ఇక ఆ నగరంలో హమాస్ ఒక పనిచేయగల సంస్థగా ఎంత మాత్రమూ లేదని చెప్పారు. తమ లక్ష్యాలను సాధించామని చెప్పుకున్నారు. తదుపరి ఆపరేషన్ కోసం బలగాలు సన్నద్ధమవడానికి వీలుగానే ఈ ఉపసంహరణ అని గాలంట్ చెప్పారు. గాజాలో యుద్ధం కొనసాగుతుంది, యుద్ధం ఆపడానికి ఇంకా చాలా సమయం వుందని ఐడిఎఫ్ చీఫ్ ప్రకటించారు. ఆ నగరం నుండి పారిపోయి వచ్చేసిన ప్రజలు తిరిగి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నా అక్కడ శిధిలాల గుట్టలు తప్ప మరేమీ మిగల్లేదని వాపోతున్నారు.

ఇసి కార్యాలయం ఎదుట టిఎంసి ఎంపిల ధర్నా

- పోలీసుల అరెస్టు



న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) ప్రధాన కార్యాలయం ముందు తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపిలు, నాయకులు 24 గంటల ధర్నాకు దిగారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఐటి, ఎన్ఐఎ, ఇడి డైరెక్టర్లను మార్చాలని డిమాండ్ చేశారు. డెరిక్ ఓబ్రియెన్, డోలా సేన్, సాకేత్ గోఖలే, సాగరిక ఘోష్‌లతో కూడిన 10 మంది టిఎంసి నాయకులతో కూడిన బృందం ఇసి అధికారులను కలిసి తమ డిమాండ్లను వారి ముందు ఉంచారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపి ఆదేశాల మేరకు తమ పార్టీ నేతల్ని టార్గెట్ చేస్తున్నాయని.. అన్ని పార్టీలతో సమానంగా వ్యవహరిస్తూ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఇసి జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ తరువాత ఇసి కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ధర్నా చేస్తున్న టిఎంసి ఎంపిలు, నాయకుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని బలవంతంగా బస్సులోకి ఎక్కించి అక్కడ నుంచి తరలించారు.

అధిక రాబడి వస్తుందంటూ ఎన్నికల బాండ్లు కొనిపించారు

- వెల్స్‌పన్ కంపెనీ అధికారిపై దళిత కుటుంబం ఫిర్యాదు
- అదానీ గ్రూపుతో దానికి సంబంధాలు

అహ్మదాబాద్ : గత సంవత్సరం అక్టోబర్ 11న గుజరాత్‌లోని ఓ దళిత కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులను మాయమాటలతో మోసం చేసి రూ.11,00,14,000 విలువైన ఎన్నికల బాండ్లను కొనిపించారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎస్‌బిఐ సమాచారం ప్రకారం ఇందులో అక్టోబర్ 16న రూ.10 కోట్ల విలువైన బాండ్లను బిజెపి సొమ్ము చేసుకుంది. మిగిలిన బాండ్ల మొత్తాన్ని అక్టోబర్ 18న శివసేన పార్టీ నగదుగా మార్చేసుకుంది.

అదానీ గ్రూపుతో సంబంధం ఉన్న వెల్స్‌పన్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కంపెనీ అధికారి ఒకరు తమను మోసం చేశారని, తమతో బాండ్లు కొనుగోలు చేయించారని ఆ దళిత కుటుంబం ఆరోపిస్తోంది. 2005లో అదానీ గ్రూపు వెల్స్‌పన్ నేచురల్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఉమ్మడి భాగస్వామ్యం నెలకొల్పింది. అదానీ వెల్స్‌పన్ ఎక్స్‌ప్లోరేషన్ లిమిటెడ్ పేరిట కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇందులో అదానీ గ్రూపుకు 65% వాటాలు, వెల్స్‌పన్ గ్రూపుకు 35% వాటాలు ఉన్నాయి.

'ఒక ప్రాజెక్ట్ కోసం అంజర్ ప్రాంతంలో మా కుటుంబానికి చెందిన 43 వేల చదరపు మీటర్ల వ్యవసాయ భూమిని వెల్స్‌పన్ తీసుకుంది. అందుకు ప్రతిగా చట్టప్రకారం మాకు నష్టపరిహారం అందించారు. ఆ డబ్బును డిపాజిట్ చేసే సమయంలో కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ మహేంద్ర సింగ్ సోధా అడ్డుపడ్డారు. ఇంత పెద్ద మొత్తం డిపాజిట్ చేస్తే ఐటి శాఖ నుండి ఇబ్బందులు వస్తాయని చెప్పారు. ఎన్నికల బాండ్ల పథకం గురించి చెప్పారు. ఈ పథకంలో సొమ్ము డిపాజిట్ చేస్తే కొన్ని సంవత్సరాలలోనే ఒకటిన్నర రెట్లు పెరుగుతుందని నమ్మబలికారు. మేము నిరక్షరాస్యులం. ఈ పథకం గురించి మాకేమీ తెలియదు' అని దళిత కుటుంబానికి చెందిన హరేష్ సవకర ఆవేదనగా చెప్పారు.

వాస్తవాలు గ్రహించిన హరేష్ ఈ ఏడాది మార్చి 18న అంజన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, విచారణ పూర్తయిన తర్వాత కేసులో బలం ఉంటే ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తామని వారు తెలిపారు. ఫిర్యాదు ప్రకారం.... వెల్స్‌పన్ కంపెనీకి రూ.16,61,21,877లకు వ్యవసాయ భూమిని విక్రయించేందుకు జిల్లా అధికారులు అనుమతి ఇచ్చారు. అందులో రూ.2,80,15,000లను అడ్వాన్సుగా ఇచ్చారు. మిగిలిన మొత్తాన్ని భూమి యాజమాన్య హక్కులున్న ఏడుగురు వ్యక్తులకు బదిలీ చేశారు. 2023 అక్టోబర్ 1-8 తేదీల మధ్య కంపెనీ అధికారి దళిత కుటుంబంతో నాలుగుసార్లు సమావేశమై బాండ్ల పథకంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా నచ్చచెప్పారు. ఈ సమావేశాల్లో అంజర్ నగర బిజెపి అధ్యక్షుడు హేమంత్ రజనీకాంత్ షా కూడా పాల్గొన్నారు.

ఐటి నోటీసులపై బలవంతపు చర్యలు ఆపండి

- సిఇసికి సీతారాం ఏచూరి లేఖ



న్యూఢిల్లీ : త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను దెబ్బతీయాలన్న దుష్ట తలంపుతో సిపిఎం త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను స్తంభింపచేశారని, కాబట్టి ఎన్నికలయ్యేవరకు ఎలాంటి బలవంతపు చర్యలకు పాల్పడకుండా ఇసిని నిరోధించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేసింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం నాడు ఈ మేరకు ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఒక లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు అభ్యంతరకరమైన ఈ ఆదేశాలను నిలుపుచేసేలా ఐటి అధికారులను ఆదేశించాలని ఆయన ఆ లేఖలో కోరారు. రాజ్యాంగంలోని 324 అధికరణ కింద ఎన్నికల కమిషన్‌కు కల్పించిన అధికారాలను ఇందుకోసం వినియోగించాల్సిందిగా కోరారు. కేంద్ర సంస్థ చర్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువస్తూ ఇటీవల కాలంలో లేఖ రాయడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు. త్రిస్సూర్ జిల్లా కమిటీ ఖాతాను స్తంభింపజేయడం పూర్తిగా అక్రమం, గర్హనీయమని ఏచూరి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ అన్ని శాఖల ఖాతాలతోపాటు ఈ శాఖ ఖాతా వివరాలను కూడా ఇప్పటికే చట్టానికి అనుగుణంగా ఐటి శాఖకు, ఎన్నికల కమిషన్‌కు అందజేశామని, అవి వారి వెబ్‌సైట్‌ల్లో కనిపిస్తున్నాయని ఏచూరి గుర్తు చేశారు.

ఏడాది కాలంగా వీటిపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని చెప్పారు. పైగా పన్నుల చట్టాలకు అనుగుణంగా వ్యవహరిస్తుందన్న రికార్డు సిపిఎంకు వుందంటూ గతంలో అనేకసార్లు ఐటి అథారిటీ ప్రశంసించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా మరోసారి గుర్తు చేశారు. ఎన్నికల కమిషన్‌కు గతంలో అందచేసిన వివరాలే ఇవని అన్నారు. ఏ చట్టమూ పేర్కొనకపోయినా, అవసరం లేకపోయినా ప్రజా జీవితంలో నిజాయితీగా ఉండాలన్న ఉద్దేశంతో సిపిఎం ఈ వివరాలను తన వెబ్‌సైట్‌లో పెడుతోందని చెప్పారు.

కేరళలో సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌కు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే ఈ చర్య తీసుకుందని ఏచూరి తన లేఖలో ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఏ బ్యాంక్ ఖాతాల స్తంభన ఉండబోదని ఇంతకుముందే ఇటువంటి ఓ కేసులో ఐటి అథారిటీ సుప్రీంకోర్టుకు తెలియజేసిందని అన్నారు. ఇటువంటి ఆక్షేపణీయమైన చర్య చేపట్టడానికి ముందు ఇసి అనుమతి కోసం ఐటి అథారిటీ సంప్రదించిందా లేదా అన్నది తమకు తెలియదని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, ఎన్నికల నిబంధనావళి కూడా అమల్లోకి వచ్చేసినందున, ఐటి అథారిటీ తీసుకున్న ఈ చర్య స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలన్న లక్ష్యాన్ని, అన్ని పార్టీలకు గల సమాన అవకాశాలు కల్పించాలన్న ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడం కాదా అని ప్రశ్నించారు. త్రిస్సూర్ పార్లమెంటరీ నియోజకవర్గం నుండి బిజెపి పోటీ చేయడం కేవలం యాదృచ్ఛికమేనా? అని ఆయన ఆ లేఖలో ప్రశ్నించారు.



రైతునేత అమ్రారామ్‌ను గెలిపించండి

- సికార్‌లో సచిన్‌పైలట్ పిలుపు

సికార్ : రైతునేత, సికార్ లోక్‌సభ సిపిఎం అభ్యర్థి అమ్రారామ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్‌పైలట్ పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం పరిధి పటాన్ పట్టణంలో సిపిఎం ఆధ్వర్యాన జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రైతు సమస్యలపై అమ్రారామ్ చేసిన ఉద్యమాలను ఆయన ప్రస్తావించారు. సభలో పలువురు ఇండియా వేదిక నాయకులు, స్థానిక ఎమ్మెల్యే సురేష్ మోడీ, దంతారాగఢ్ ఎమ్మెల్యే వీరేంద్ర సింగ్, అసెంబ్లీ మాజీ స్పీకర్ దీపేంద్ర సింగ్ షెకావత్ పాల్గొన్నారు.

కేజ్రీవాల్ పిఎ, ఆప్ ఎమ్మెల్యేను ప్రశ్నించిన ఇడి

- ఓటుతో సమాధానం చెప్పండి : ఆప్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చర్యలు కొనసాగుతున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పిఎ వైభవ్ కుమార్, ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌లను ఇడి సోమవారం విచారించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల కింద కుమార్ వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. గతంలోనూ ఈ ఇద్దరినీ ఇడి ప్రశ్నించింది. దుర్గేష్ పాఠక్ సోమవారం ఉదయం ఢిల్లీలోని ఇడి ప్రధాన కార్యాలయంలో ఇడి ముందు హాజరయ్యారు. 2022 సెప్టెంబరులో ఆప్ నేత విజయ్ నాయర్ ఇంటిపై ఇడి దాడులు జరిపినప్పుడు దుర్గేష్ పాఠక్ అక్కడే ఉన్నారు. అప్పుడు పాఠక్ ఫోనును ఇడి స్వాధీనం చేసుకుంది.

ఆప్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

ఆప్ సరికొత్త థీమ్‌తో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కేజ్రీవాల్‌ను జైలుకు పంపినందుకు ఓటుతో సమాధానం చెప్పండంటూ 'జైల్ కా జవాబ్ ఓట్ సే' ప్రచారాన్ని ప్రారంభించింది. 'ఆప్' పోటీ చేస్తున్న నాలుగు లోక్‌సభ స్థానాల్లోనూ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగిస్తారని 'ఆప్' నేతలు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆప్ ఎంపి సందీప్ పాఠక్ మాట్లాడుతూ.. కేజ్రీవాల్‌ను ఎన్నికలకు దూరంగా ఉంచాలనే ఆలోచనతోనే జైలుకు పంపిన విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. కేజ్రీవాల్ తన యావజ్జీవితం ప్రజల కోసమే పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఢిల్లీ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి అందరికీ ఉత్తమ విద్య, ఆరోగ్యం, విద్యుత్, నీరు అందించేందుకు ఎంతో తపన పడుతున్నారని అన్నారు. 'జైల్ కా జవాబ్ ఓట్ సే' నినాదంతో ఢిల్లీలోని ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగించనున్నామని చెప్పారు.

కేజ్రీవాల్ పిటీషన్‌పై నేడు తీర్పు

మనీలాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటీషన్‌పై ఢిల్లీ హైకోర్టు మంగళవారం తీర్పును వెల్లడించనుంది. మధ్యాహ్నం 2:30 గంటలకు జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఈ తీర్పును ప్రకటించనున్నారు. ఈ వివరాలను ఢిల్లీ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించారు. ఢిల్లీ మద్యం విధానం స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని ఛాలెంజ్ చేస్తూ కేజ్రీవాల్ ఈ పిటీషన్ వేశారు. తనను ఇడి కస్టడీలో ఉంచడాన్ని, లోక్‌సభ ఎన్నికల సమయంలో తనను అరెస్టు చేయడాన్ని కేజ్రీవాల్ ప్రశ్నించారు.

కర్ణాటకలో 5, 8, 9, 11 తరగతుల పరీక్షలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : కర్ణాటక రాష్ట్ర బోర్డుకు సంబంధించిన 5, 8, 9, 11 తరగతులకు పరీక్షలను నిర్వహించడానికి అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. పరీక్షలను నిర్వహించకూడదని, పరీక్షల ఫలితాలను విద్యార్థులకు లేదా తల్లిదండ్రులకు వెల్లడించకూడదని జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. పరీక్షలు నిర్వహించడానికి అనుమతిస్తూ మార్చి 22న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా ఈ నెల 4న కర్ణాటక స్టేట్ క్వాలిటీ అస్సెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ జారీ చేసిన మార్గదర్శకాలకు వ్యతిరేకంగా రిజిస్టర్డ్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఆర్గనైజేషన్ ఫర్ అన్ ఎయిడెడ్ రికగ్నైజ్డ్ స్కూల్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ముఖ్యంగా 5, 8 తరగతులకు బోర్డు పరీక్షలు నిర్వహించడంపై పిటీషనర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ పిటీషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు హైకోర్టు ఆదేశాలపై స్టేవిధించింది. కర్ణాటక ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. ఈ సందర్భంగా కర్ణాటకలో 5,8,9,11 తరగతులకు ప్రతిపాదించిన బోర్డు పరీక్షలు విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 2(ఎఫ్), 16, 30లకు విరుద్ధంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సెక్షన్ల ప్రకారం ప్రాథమిక విద్య పూర్తయ్యే వరకూ విద్యార్థులకు కఠినమైన బోర్డు పరీక్షలను నిర్వహించకూడదు. 'ప్రభుత్వం ప్రతిపాదించిన బోర్డు పరీక్షలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్యాలకు తీవ్రమైన శారీరక, మానసిక వేదన, కష్టాలు కలిగించేవిధంగా ఉన్నాయి' అని జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది.

భారీ జనసందోహం మధ్య బస్సు యాత్ర


పల్నాడు జిల్లా వినుకొండలో జగన్ బస్సు యాత్రకు హాజరైన జనం

- సిఎం జగన్‌తో పింఛను లబ్ధిదారుల ముఖాముఖి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి, దర్శి(ప్రకాశం జిల్లా)

తమకు వలంటీర్ వ్యవస్థ కావాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పింఛను లబ్ధిదారులు కోరారు. 'మేమంతా సిద్ధం'లో భాగంగా ముఖ్యమంత్రి 11వ రోజు సోమవారం ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో పర్యటించారు. రోడ్ షో నిర్వహించారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం వెంకటాచలంపల్లిలో మూడు వేల మంది నవరత్నాల లబ్ధిదారులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు అనే పింఛనుదారు మాట్లాడుతూ 2019కి ముందు వికలాంగుల నుంచి కూడా జన్మభూమి కమిటీ లంచాలు తీసుకునేదని, పింఛన్లు కావాలంటే డబ్బులు చెల్లించాల్సి వచ్చేదని, వైసిపి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛను ఇస్తున్నారని మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో ఈ నెల వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా పెట్టడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. పింఛను తీసుకోవడానికి వెళ్లి మండుటెండలో 70 ఏళ్ల వృద్ధులు కుప్పకూలిపోవడం తాను కళ్లారా చూశానని వివరించారు. వితంతు పింఛనుదారు ప్రభావతి మాట్లాడుతూ మోకాళ్ల నొప్పి వల్ల తాను నడవలేనని, గతంలో ఇంటికే పింఛను అందేదని,ఈ నెల ఇచ్చే పింఛను కోసం నన్ను మూడు చోట్లకు తిప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు జగన్ కావాలి, వలంటీర్ వ్యవస్థ కావాలి' అని అన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ తాను రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను కొనసాగించే ఫైల్‌పైనే మొదటి సంతకం చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం కురిచేడు మండలంలో యాత్ర కొనసాగింది. జగన్‌ని చూడటానికి జనాలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. బస్‌పై భాగాన జగన్ ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. కురిచేడులోని ఎన్ఎస్‌పి కాలనీ వద్ద ప్రజలు తమ సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆటో డ్రైవర్ చిప్పగిరి పాపయ్య మాట్లాడుతూ తన కూతురు చందనకి రెండు కళ్లూ కనిపించవన్నారు. ఆ పాప చదువు కోసం తగు ఏర్పాట్లు చేయాలని, దుర్గాభవాని అనే అమ్మాయి మూర్ఛ వ్యాధితో బాధపడుతుందోని, మెరుగైన చికిత్సకు అవసరమైన సహాయం చేయాలని ముఖ్యమంత్రికి అర్జీలు అందాయి. వాటిపై తగు చర్యలు వెంటనే తీసుకుంటానని జగన్ హామీ ఇచ్చారు.

ప్రకాశం జిల్లా కురిచేడు నుంచి పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చింతలచెరువుకు వచ్చిన బస్సు యాత్ర అయినవోలు మీదుగా గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి నుండి చీకటి ఈగలపాలెం గ్రామం మీదగా ర్యాలీగా సాయంత్రం ఆరు గంటలకు పల్నాడు జిల్లా వినుకొండకు చేరుకున్నారు. బస్సుపై నుంచి సిఎం జగన్ ప్రజలకు అభివాదం చేశారు. అక్కడి నుంచి వినుకొండ వరకు జరిగిన బస్సు యాత్రకు భారీగా ప్రజలు తరలి వచ్చి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. అభిమానులు సిఎం కాన్వాయ్‌పై పూలు చల్లారు. యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సాయంత్రం ఐదు గంటలనుంచి రాత్రి ఏడు గంటల వరకు యాత్ర కొనసాగింది.

ఉగాది శుభాకాంక్షలు గవర్నర్, సిఎం, చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు ప్రజలందరికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సిఎం చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం మన ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంతోపాటు కొత్త ఆశలను చిగురింపచేసి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

ముగిసిన 'టెన్త్' మూల్యాంకనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ముగిసింది. ఈ నెల ఒకటి నుంచి ప్రారంభమైన మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానంద రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 జిల్లాల్లో హెడ్‌క్వార్టర్లలో మూల్యాంకనం జరిగిందని పేర్కొన్నారు. 47,88,738 ప్రశ్నాపత్రాలను 25 వేల మంది సిబ్బందితో పూర్తిచేశామని వెల్లడించారు. మూల్యాంకన కేంద్రాల్లో సిబ్బందికి అవసరమైన అన్ని వసతులూ కల్పించామన్నారు. ఫలితాలను మే మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు.

గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

అక్రమంగా ఇంట్లో గంజాయి నిల్వ చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ గుంటూరు ఒకటవ అదనపు జిల్లా జడ్జి సిహెచ్.రాజగోపాలరావు సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సత్తెనపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్, ఎస్సై కె.రవికుమార్ 2017 నవంబర్ 22న సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం శాంతిపాలెంకు చెందిన రామచంద్రపు బుల్లియ్య ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఒక గోనె సంచిలో 21 కిలోల 100 గ్రాముల గంజాయి దొరికింది. బుల్లియ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు అయ్యింది.

జనసేనకు చిరంజీవి రూ.5 కోట్లు విరాళం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీకి సినీ నటుడు చిరంజీవి రూ.5 కోట్ల విరాళాన్ని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు సోమవారం అందజేశారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. చిరంజీవితోపాటు రామ్‌చరణ్ కూడా జనసేనకు ఆర్థికంగా అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శులు నాగబాబు, టి శివశంకర్, కోశాధికారి ఎవి రత్నం, అధ్యక్షుల వారి రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్ ఉన్నారు.

విజయవాడకు చేరుకున్న దీపక్‌మిశ్రా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రిటైర్డు ఐపిఎస్ అధికారి దీపక్‌మిశ్రా సోమవారం రాత్రి విజయవాడకు చేరుకున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రానికి ప్రత్యేక పోలీస్ పరిశీలకులు (స్పెషల్ అబ్జర్వర్)గా నియమించిన విషయం పాఠకులకు విధితమే. విజయవాడ చేరుకున్న మిశ్రాకు నోవాటెల్ హోటల్ వద్ద రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, అడిషనల్ డిజి, స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసరు శంకచక్రబాగ్చీ, ఎన్‌టిఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు, సిపి కాంతిరాణా టాటా, జాయింట్ కలెక్టరు పి సంపత్‌కుమార్ స్వాగతం పలికారు.

566 మంది వలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా 566 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఎంపిడిఒ, సచివాలయ సెక్రటరీలకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల నేపథ్యంలో తాము విధులు నిర్వహించలేకపోతున్నట్లు పలువురు వలంటీర్లు తెలిపారు. మరికొందరు స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు. విజయనగరం జిల్లా బాడంగి మండలం ముగడ సచివాలయం పరిధిలో 18 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సచివాలయ సెక్రటరీకి అందజేశారు. భోగాపురం మండలం గుడివాడ సచివాలయం పరిధిలో 18, కొత్తవలస మండల కేంద్రంలో 27 మంది, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మేజరు పంచాయతీ పరిధిలోని 1, 2 సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న 36 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలంలో 35 మంది, శ్రీకాకుళం జిల్లాలోని కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి, కోటబొమ్మాళి, హరిశ్చపురం, యలమంచిలి, ఎత్తురాళ్లపాడు పంచాయతీల్లో 60 మంది, రణస్థలం మండలం వల్లభరావుపేటలో పదిమంది, లావేరు మండలం గుమ్మడ పంచాయతీ లో17 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అధికారులకు అంద జేశారు. కర్నూలు జిల్లా ఆస్పరి మండల వ్యాప్తంగా 150 మంది, నంద్యాల జిల్లా వెలుగోడు లో 26 మంది రాజీనామా చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలో మెల్లంపూడిలో 12 మంది, ఇప్పటంలో తొమ్మిది మంది, పెనుమాకలో 44 మంది, రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలంలో 40 మంది, పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గొల్లలకొడేరు గ్రామానికి చెందిన 14 మంది, ఏలూరు 16వ డివిజన్ అరుంధతిపేట 42వ సచివాలయానికి చెందిన 16 మంది, దెందులూరు మండలం పోతునూరులో 15మంది, నూజివీడు మండలం జంగంగూడెం గ్రామానికి చెందిన 16, ఉంగుటూరు మండలం బొమ్మిడిలో 12 మంది రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

అన్ని సమ్మర్ స్టోరేజి ట్యాంకులకు నీరు

- డ్రోన్లతో సరఫరా పర్యవేక్షణ
- సిఎస్. కె.ఎస్. జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


రాష్ట్రంలోని అన్ని స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని, కాలువల ద్వారా విడుదల చేసిన నీరు సక్రమంగా శివారు ప్రాంతాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్. కె.ఎస్. జవహర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి అవసరాల నిమిత్తం ప్రకాశం బ్యారేజి నుంచి బందరు, రైవస్, ఏలూరు కాలువలకు, సాగర్ కుడి కాలువ నుంచి పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాలకు నీటిని విడుదల చేశామని చెప్పారు. నీటి సరఫరా పర్యవేక్షణకు నియమించిన సిబ్బందికి 10 రోజుల వరకు సెలవులు ఇయవద్దని అధికారులను ఆయన ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా మూడు, నాలుగు రోజులపాటు డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. కాలువల వెంబడి నీటిపారుదల, రెవెన్యూ, తదితర శాఖల సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి, విడుదల చేసిన నీటిని చేపలు, రొయ్యల చెరువులకు మళ్లించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల వారీగా ప్రత్యేక డయాగ్రామ్‌ను సిద్ధం చేసి ఎంత మేరకు నీరు చేరిందనే అంశంపై ప్రతి రోజూ పర్యవేక్షించాలని సూచించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ, తాగునీటి అవసరాల నిమిత్తం ఈ ప్రకాశం బ్యారేజి నుంచి, నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రకాశం బ్యారేజి నుంచి రోజుకు 2500 క్యూసెక్కుల నీరు, సాగర్ కుడి కాలువ నుంచి 5500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్లందరూ ఆయా గ్రామాల్లో ఉన్న అన్ని స్టోరేజి ట్యాంకులను నీటితో నింపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. జలవనరుల ఇఎన్‌సి నారాయణ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సముద్ర జలాల్లో యాంత్రిక పడవులు, మెకనైజ్డ్ మోటారు బోట్లు ద్వారా నిర్వహించే అన్ని రకాల చేపల వేటను ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు (61 రోజులు) పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకు సోమవారం, మత్స్యశాఖ కమిషనరు ఎ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. చేప, రొయ్యల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేప, రొయ్యలను సంరక్షించుకోవడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా సముద్ర మత్స్య సంపద, సుస్థిరతను సాధించవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ఆయా బోట్ల యజమానులను సముద్ర మత్స్య క్రమ బద్ధీకరణ చట్టం 1994 సెక్షన్ (4)ను అనుసరించి శిక్షార్హులని పేర్కొన్నారు. అటువంటి వారి బోట్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీనపర్చుకుంటా మన్నారు. అంతేకాకుండా జరిమానా విధించడం, డీజిల్ ఆయిల్ రాయితీ, ప్రభుత్వం అందించే అన్ని రకాల సౌకర్యాలను నిలుపుదల చేస్తామన్నారు. నిషిద్ధ కాలాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్ట్ గార్డు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వికలాంగులకు రూ.6 వేల పింఛను



- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి-జనసేన-బిజెపి కూటమి అధికారంలోకి రాగానే వికలాంగులకు నెలకు రూ.6 వేల పింఛను ఇస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా వికలాంగుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. సత్తెనపల్లిలో వికలాంగులు తనను కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందించారని పేర్కొన్నారు. మొదటి నుంచి వికలాంగుల సంక్షేమానికి, ఆత్మగౌరవానికి టిడిపి ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతియేటా వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించి, వారిలో ప్రతిభను గుర్తించేలా చేశామన్నారు. వారి కోసం అమలు చేసిన ప్రత్యేక పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వైసిపి నైజం

రౌడీయిజం, విధ్వంసం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వైసిపి వాళ్ల నైజమని చంద్రబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారాన్ని కోల్పోవడం ఖాయమని తెలిశాక వైసిపి రౌడీమూకలకు నిద్రపట్టడం లేదని పేర్కొన్నారు. అందుకే అర్ధరాత్రి సమయంలో పల్నాడు జిల్లా క్రోసూరులో టిడిపి కార్యాలయానికి నిప్పు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాగళం సభకు వచ్చిన జనస్పందన చూసి ఓర్వలేక ఈ పనిచేశారని ఆరోపించారు.

ఎన్నికల లబ్ధి కోసం జగన్ శవరాజకీయాలు : అచ్చెన్న

ఎన్నికల లబ్ధి కోసమే వైఎస్ జగన్ శవరాజకీయాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల పింఛన్‌ను పెంచిన మొత్తంతో కలిపి జులైలో రూ.7 వేలు ఇంటివద్దనే అందిస్తామని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మేనిఫెస్టోపై ప్రజాభిప్రాయం కోసం వాట్సాప్ నెంబర్

తమ కూటమి త్వరలో విడుదల చేయనున్న ఎన్నికల మేనిఫెస్టో కోసం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయం తీసుకున్నట్లు టిడిపి, జనసేన, బిజెపి నేతలు తెలిపారు. దీనికోసం తీసుకొచ్చిన 8341130393 వాట్సాప్ నెంబర్‌ను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడి జనార్దన్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు లంకా దినకర్ టిడిపి కార్యాలయంలో విడుదల చేశారు. ప్రజల అభిప్రాయాలు తెలియజేస్తే వాటిని గౌరవంగా స్వీకరిస్తామని, ప్రాధాన్యత అభిప్రాయాలను మేనిఫెస్టోలో పొందుపరుస్తామని తెలిపారు. రాష్ట్రంలోని మాదిగ సంఘాలన్నీ చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్నా యని ఆ పార్టీ నేతలు వర్ల రామయ్య, టిడి జనార్దన్ తెలిపారు. టిడిపి కార్యాలయంలో జరిగిన మాదిగ సంఘాల సమావేశంలో ముఖ్య అతిథులుగా వీరు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పేరిపోగు వెంకటేశ్వరరావు, టిడిపి నేత పాతర్ల రమేష్, ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్ పాల్గొన్నారు.


మార్గమధ్యంలోనే జన్మించిన బిడ్డ

నడక దారిలోనే బిడ్డకు ప్రసవం

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

డిజిటల్ ఇండియా, అన్నింటా దేశం వెలిగిపోతోంది అంటూ పాలకులు గుప్పిస్తున్న ప్రకటనలు ఉత్తిమాటలేనని ఈ ఘటనతో తేలిపోయాయి. నేటికీ గిరి గ్రామాలకు అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితిని తేటతెల్లం చేసే సంఘటన ఇది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం మారుమూల పెద్దకోట పంచాయతీ చీడివలస గ్రామానికి చెందిన కిల్లో వసంత సోమవారం నడక దారిలోనే బిడ్డను ప్రసవించింది. ఉదయం ఆమెకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వైద్యం కోసం గ్రామం నుంచి ఎత్తయిన కొండ కోనలు, అటవీ ప్రాంతాలను దాటుతూ కాలినడకన తరలించసాగారు. మార్గమధ్యలో వసంతకు పురిటి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. మార్గమధ్యంలోనే ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం ఆమెను, బిడ్డను హుకుంపేట మండలం ఉప్ప ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. చీడివలస గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఆ నిధులను స్వాహా చేయడంతో పనులు ముందుక సాగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2017లో రోడ్డు పనులకు రూ.50 లక్షలను, 2023లో సుమారు కోటి రూపాయలను మంజూరు చేశారని, వాటితో పనులు పూర్తి చేయకుండా అధికారులు, కాంట్రాక్టర్లు నగదు కాజేశారని సిపిఎం నాయకులు కె.గోవింద్, మాజీ ఉపసర్పంచ్ కిల్లో నాగేశ్వరరావు విమర్శించారు.

మాపై వైసిపి దుష్ప్రచారం

- వేమిరెడ్డి దంపతులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నిన్నటికి నిన్న మేము పార్టీ మారుతున్నట్టు వైసిపి వారు ఓ దుష్ప్రచారం చేశారని, ఈ రోజు ఇంకో ప్రచారం చేసి వికృతానందం పొందుతున్నారని నెల్లూరు పార్లమెంటు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆమె భర్త కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వైసిపికి, ఆ పార్టీ నాయకులకు ప్రజలు తగ్గిన బుద్ధి చెబుతారని అన్నారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెంలో వారు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్ రెడ్డి, రాజేంద్రరెడ్డి తదితరులు తమపై దుష్ప్రచారం చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబునాయుడు తనను ప్రకటించినప్పటి నుంచి ఇలాంటి ఫేక్ ప్రచారాలు అనేకం చేశారని వివరించారు. ఢిల్లీ నుంచి ఎంపి అభ్యర్థిగా ఇక్కడికి వచ్చిన విజయసాయిరెడ్డి నెల్లూరు జిల్లాకు ఏం చేశారో చెప్పి ఓట్లు అభ్యర్థించాలని డిమాండ్ చేశారు. ఒక మహిళా అభ్యర్థికి ఎమ్మెల్యే సీటు కేటాయిస్తే ఓర్చుకోలేక, ఓటమిని అంగీకరించలేక ఇలా దిగజారుడు రాజకీయాలు చేయడం ఎంత మాత్రం తగదని చెప్పారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై పోటీకి సరైన నాయకుడు లేక వైజాగ్ నుంచి దిగుమతి చేసుకున్న విజయసాయిరెడ్డి.. ఈ రోజు పిచ్చిపిచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టి విమర్శిస్తున్నారన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మేము పార్టీ మారినప్పటి నుంచి వైసిపి నాయకులు చీప్ పాలిటిక్స్ ఆడుతున్నారని విమర్శించారు. ఓడిపోతామన్న భయంతో ఏవేవో ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

16 కిలోల బంగారం, 30 కిలోల వెండి స్వాధీనం


బంగారం ఉన్న బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, పోలీసులు

- రూ.44 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలూరు జిల్లాల్లో భారీగా బంగారం, వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు శివారులో కలపర్రు టోల్‌గేట్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో విజయవాడ నుంచి ఏలూరు, నరసాపురం ప్రాంతాలకు బంగారం, వెండి ఆభరణాలను తరలిస్తున్న కారును తనిఖీ చేశారు. ఆ వాహనంలో 16 కేజీల బంగారం, 30 కిలోల వెండి ఆభరణాలను గుర్తించారు. వాటికి సంబంధించి ఎటువంటి పత్రాలూ లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. ఏలూరు నుంచి విజయవాడ వైపు కొరియర్ వాహనంలో తరలిస్తున్న రూ.15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడి మండలం లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో ఓ కారును తనిఖీ చేసి అందులోని రూ.లక్ష నగదు, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు ఎంపిడిఒ కార్యాలయం వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, ఎన్నికల సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో రూ.2,54,180 నగదు, తెనాలి నియోజకవర్గ పరిధిలో రూ.51,000 నగదు, రూ.2,73,000ల విలువ గల 45.5 గ్రాముల బంగారం సీజ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో ఓ ఆర్‌టిసి బస్సును తనిఖీ చేశారు. హైదరాబాద్ కీర్తన ఫైనాన్స్ కంపెనీకి చెందిన రూ.10.55 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేశారు. తెలంగాణ నుంచి 19 మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో ఎస్ఇబి అధికారులు దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సోమవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. ఉదయం 8:30 గంటల సమయంలో గేట్ నెంబర్ మూడు నుంచి రైల్వే స్టేషన్‌లోని ఇతర ప్లాట్‌ఫారాలపైకి వెళ్లేందుకు ప్రయాణికులు రోజూ ఉపయోగించే ఫుట్ ఓవర్ బ్రిడ్జి 2 - 3 ఫ్లాట్ ఫారాల మధ్య ఒక్కసారిగా కుంగిపోయింది. ఈ క్రమంలో దీనిపై వస్తున్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మూసేసి ప్రయాణికులను ఇతర మార్గాల గుండా మళ్లించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయిన సమయంలో 1, 2, 3 ఫ్లాట్ ఫారాల మీదకు రైళ్లేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మరమ్మతు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఈ బ్రిడ్జిని తాత్కాలికంగా మూసివేస్తునట్టు రైల్వే అధికారులు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ స్టేషన్‌లో అందుబాటులో ఉన్న రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను, లిఫ్ట్‌లను ఉపయోగించుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ సీనియర్ అధికారులతో కలిసి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

దేశం ఆర్థికంగా నలిగిపోతోంది

నోరు తెరిస్తే అసత్య ప్రచారాలు • రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

గత పదేళ్లుగా దేశం ఆర్థికంగా నలిగిపోతోందని, అసమానతలు అధికమయ్యాయని, అసత్య ప్రచారాలతో ప్రజలను పాలకులు మభ్యపెడుతున్నారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. 'దేశం నిజంగా వెలిగిపోతుందా?' అనే అంశంపై వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సదస్సు జరిగింది. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ సదస్సుకు ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశం ఆర్థికంగా కుంగిపోతుంటే పైకి మాత్రం వెలిగిపోతోందని పాలకులు చెప్పుకుంటున్నారని, ఇది భవిష్యత్ తరాలను మరింత ఊబిలోకి నెట్టడమేనన్నారు. ప్రతిపక్షాలు తనను 99 సార్లు తిట్టాయని కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ లెక్కలు చెప్పారని, దేశంలో నిరుద్యోగత ఎంత? కోవిడ్ మరణాలు ఎన్ని? వైద్యం అందక చనిపోతున్న వారి సంఖ్య ఎంత? వలసల రూపంలో సుదూర రాష్ట్రాలకు పాదయాత్ర ద్వారా వెళుతున్న కార్మికులు ఎంతమంది అనే లెక్కలు ఎందుకు చెప్పరని ప్రశ్నించారు. 2022 రైల్వే రిక్రూట్‌మెంట్ ప్రకటన ద్వారా ఏడో తరగతి చదివిన వారికి క్లీనింగ్ పనుల కోసం 35వేల పోస్టులను ప్రకటిస్తే, కోటి 25 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో డిగ్రీ చేసిన వారూ ఉన్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా 82 శాతం మంది యువత నిరుద్యోగంతో ఉందని, నిత్యావసర ధరలు నిత్యం పెరుగుతూనే ఉన్నాయని చెప్పారు. గతంలో మాదిరి భారతదేశం ప్రకటించే లెక్కల్లో విశ్వసనీయత లేదని మన ఆర్థిక పరిస్థితిపై ప్రపంచంలోని వందమంది ఆర్థికవేత్తలు రాసిన లేఖలో వెల్లడించారన్నారు. సీనియర్ పాత్రికేయులు రాఘవశర్మ, ఐలు జిల్లా అధ్యక్షులు హేమచంద్ర, ప్రముఖ న్యాయవాది ఓంప్రకాష్, వేమన విజ్ఞాన కేంద్రం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ అధికారులపై నిరాధార ఆరోపణలు తగవు: మంత్రి బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నిజాయితీగా పనిచేస్తున్న సివిల్ సర్వీస్ అధికారులపై ప్రశాంత్ కిషోర్ బృందం నిరాధార ఆరోపణలు చేయడం గర్హనీయమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన విశాఖలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సివిల్ సర్వీస్ అధికారులు చాలాకాలం నుంచి పలువురు ముఖ్యమంత్రుల ప్రభుత్వాల్లో కీలకంగా పనిచేస్తున్నారని, వారిలో ఇద్దరో, ముగ్గురో కొన్ని పొరపాట్లు చేసినంత మాత్రాన అందరిపైనా అభాండాలు వేయడం సరికాదని అన్నారు. వారందరినీ ఎన్నికల విధుల నుంచి తొలగించి మార్గదర్శి, హెరిటేజ్ తదితర సంస్థల అధికారులను నియమించి ఎన్నికలు జరుపుకోవొచ్చా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. దీన్ని సహించలేని ప్రతిపక్షాలు నిరాధారమైన అరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. భౌతికశాస్త్ర పితామహుడు సర్ ఐజాక్ న్యూటన్ చెప్పిన విధంగా చర్యకు ప్రతిచర్య ఉన్నట్లు వారి చర్యకు తమ నుంచి కూడా ప్రతిచర్య ఉంటుందని పేర్కొన్నారు. బీహార్‌లో ప్రజా తిరస్కారానికి గురైన ప్రశాంత్ కిషోర్‌ను ఎపి ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. చంద్రబాబు మేనేజ్ చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. వలంటీర్లపై ఇసికి లేఖ రాసిన వారు గోతిలో పడ్డారన్నారు. తాము అప్పులు చేస్తున్నామని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని, అప్పులు తేకుండా రూ.4 వేల పింఛను ఇస్తామని చంద్రబాబు ఎలా హామీ ఇస్తున్నారని ప్రశ్నించారు. పవన్ నిలకడలేని మనిషని విమర్శించారు. మీడియా సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పాల్గొన్నారు.

భార్యాభర్తల ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణం?

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలు సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులే ఇందుకు కారణంగా తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లకు చెందిన కోయ విష్ణుప్రసాద్ (45) కొంతకాలంగా అప్పికట్ల గ్రామంలో ఎరువులు, పురుగు మందుల షాపు నిర్వహిస్తున్నారు. రైతులకు పెద్ద మొత్తంలో అప్పు ఇచ్చారు. అవి తిరిగి వసూలు కాకపోవడం, తాను తెచ్చిన అప్పులు తీర్చలేక కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవ్వడంతో తన భార్య లక్ష్మీప్రసన్న (40)తో కలిసి ఇంట్లోనే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. అప్పులు ఎంత ఉన్నాయో స్పష్టంగా తెలియకపోయినా రూ.కోట్లల్లోనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దంపతులు ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులేనా.. ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న పేపరు మిల్లు కార్మికుల సమ్మె

- 12న కార్మిక శాఖ ఆధ్వర్యంలో జాయింట్ మీటింగ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపి పేపరు మిల్లు కార్మికుల సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరింది. యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికుల ఆందోళనలు మిల్లు లోపల కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 12న కార్మిక శాఖ ఆధ్వర్యంలో జాయింట్ మీటింగ్ జరగనుందని తెలిపారు. ఈ మేరకు కార్మిక సంఘాలకు కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ లేఖ పంపించినట్లు తెలిపారు. పరిశ్రమలో పాత వేతన ఒప్పందం 2020 జూన్ 30తో ముగిసిందని చెప్పారు. నాలుగేళ్లు కావస్తున్నా యాజమాన్యం నూతన వేతన ఒప్పందం చేయలేదని, దీంతో మిల్లులోని 11 గుర్తింపు కార్మిక సంఘాలు ఐక్య పోరాటం చేపట్టాయని తెలిపారు. యాజమాన్య నిర్లక్ష్య వైఖరి కారణంగానే కార్మికులు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. 11 గుర్తింపు సంఘాలు ఫిబ్రవరి 26న యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇచ్చాయని, వారం రోజుల్లో చర్చలకు పిలుస్తామని నాడు యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. యాజమాన్యం రెండుసార్లు చర్చలకు పిలిచి వేతన ఒప్పందం చేయబోమని చెప్పిందని తెలిపారు. కార్మికులు మళ్లీ జెసిఎల్‌ను ఆశ్రయించారన్నారు.